

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 120

శుక్రవారం 21-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఫ్యాషన్








క్యాజువల్ టు కార్పొరేట్

కుర్తాసెట్ ధరించిన సౌకర్యం కావాలి
సంప్రదాయం కాకుండా స్టయిలిష్‌గా కనిపించాలి
క్యాజువల్ వేర్ అనిపించాలి
కార్పొరేట్ లుక్‌తో ఆకట్టుకోవాలి.
ఇవన్నీ ఒకచోట కొలువుండాలంటే
ఎవర్‌గ్రీన్ చీరకట్టును మోడర్న్‌గా మెరిపించాలి.

లాంగ్ బ్లౌజ్‌లు, ఓవర్‌కోట్స్, పెప్లమ్, షర్ట్ స్టైల్... ఇలాంటి వాటితో కాటన్ లేదా సిల్క్ చీరకట్టును మ్యాచ్ చేస్తే స్టయిల్ లుక్ సొంతం కాకుండా ఉండదు. కాటన్, సిల్క్, బెనారస్ డిజైనర్ టాప్స్‌తో తీసుకువచ్చే ఈ లుక్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ ఆకట్టుకుంటుంది.

కిచెన్ టిప్స్

ఎండుకొబ్బరి తాజాగా...

ఎండుకొబ్బరిని నిల్వ ఉంచిన కొద్దిరోజులకే కొబ్బరిచిప్ప లోపల బూజులాగా రావడం, కొన్నిసార్లు లోపల తెల్లగా ఉన్నప్పటికీ చేదుగా మారడం చూస్తుంటాం. ఇవేవీ రాకుండా, కొబ్బరిచిప్పలను చింతలేకుండా ఇలా నిల్వచేసుకోండి...



- మార్కెట్ నుంచి తెచ్చిన ఎండు కొబ్బరి చిప్పలను శుభ్రంగా తుడిచి, ఎండలో ఆరబెట్టాలి. ఆరిన చిప్పలను ఉప్పునీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఇప్పుడు కొద్దిగా కొబ్బరినూనెను వేళ్లతో తీసుకుని చిప్పకు రాసి నిమిషం పాటు రుద్దాలి. ఈ చిప్పలను రెండురోజుల పాటు ఎండలో పెట్టి , కవర్‌లో మూటకట్టాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఇలా పెట్టిన కొబ్బరి నెలల పాటు పాడవకుండా ఉంటుంది.
- టేబుల్ స్పూను పటికపొడిని కప్పు నీటిలో కలపాలి. పటిక మొత్తం కరిగిన తరువాత ఈ నీటిలో చిన్న గుడ్డను ముంచి కొబ్బరి చిప్పల లోపల, బయటా తుడవాలి. ఇలా తుడిచిన చిప్పలను ఎండలో రెండు రోజులపాటు ఆరబెట్టి, కవర్‌లో మూటకట్టాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వచేయాలి. ఇలా కూడా ఎక్కువ రోజులపాటు చిప్పలు తాజాగా ఉంటాయి.

మచ్చల్ని మాయం చేసే డ్రింక్!

దాహాన్ని తీర్చే కూల్‌డ్రింక్స్ టైల్స్, గిన్నెల మీద ఉన్న మరకలను ఇట్టే పోగొడతాయి.



- ఐరన్ ట్యాప్‌లు, టైల్స్ మీద ఏర్పడిన తుప్పు మరకలు ఒకపట్టాన వదలవు. అల్యూమినియం ఫాయిల్‌ను ఉండలా చుట్టి, కూల్‌డ్రింక్‌లో ముంచి తుప్పు మరకలపై రుద్దితే నిమిషాల్లో మరకలు మాయమైపోతాయి.
- డీప్‌ఫ్రైకి వాడే బాణళ్లు తరచూ వాడడం వల్ల లోపల బయట నల్లగా మారిపోతాయి. ఈ బాణలిపై కూల్‌డ్రింక్‌ను పోసి పదినిమిషాలు నానబెట్టాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్దితే మసిమరకలు పోయి బాణలి తెల్లగా మెరుస్తుంది.
- బాత్‌రూం టైల్స్ మీద వదలకుండా పట్టిపీడిస్తోన్న మొండి మరకలను కూల్‌డ్రింక్‌లో ముంచిన స్క్రబ్బర్‌తో రుద్దితే ఇట్టే పోతాయి.

మహిళా అధికారులు

వరదలకు ఎదురు నిలిచారు

పంజాబ్ నుంచి
హిమాచల్ ప్రదేశ్ వరకు
మహిళా ఆఫీసర్ల
ధైర్యగాథలు మార్మోగుతున్నాయి.
ఇటీవలి పెను వరదల్లో
చిక్కుకున్నవారిని కాపాడటంలో
మహిళా కలెక్టర్లు, ఎస్‌పిలు
రేయింబవళ్లు కష్టపడి
ధీరత్వాన్ని ప్రదర్శించారు.
చంటి పిల్లల్ని ఇళ్లల్లో వదిలి
ప్రజల కోసం రోజుల తరబడి
పని చేసిన ఈ ఆఫీసర్ల పరిచయం...


● కుల్లు ఎస్.పి. సాక్షి వర్మ


● పాటియాలా కలెక్టర్ సాక్షి సహానే


● మండి ఎస్.పి. సౌమ్య

ఉత్తర భారతాన్ని వానలు, వరదలు చుట్టుముట్టాయి. పంజాబ్ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకూ కుంభవృష్టి ముంచెత్తింది. నదులు వెర్రెత్తి ప్రవహించాయి. కొండ చరియలు విరిగి పడ్డాయి. గిరి వృక్షాలు కూకటివేళ్లతో సహా పెకలించుకుని వరద నీటిలో అడ్డొచ్చినవాటిని ధ్వంసం చేసుకుంటూ ముందుకు సాగాయి. కార్లు అగ్గిపెట్టెల్లా చెల్లాచెదురయ్యాయి. ప్రాణాలకు ప్రమాదం వచ్చి ఏర్పడింది. ఇలాంటి సమయాల్లో బయటకు అడుగు పెట్టడమే కష్టం. కాని ఈ సందర్భాలను సమర్థంగా ఎదుర్కొని ప్రశంసలు పొందారు మహిళా అధికారులు. ప్రకృతి విసిరే సవాళ్లకు తాము జవాబు చెప్పగలమని నిరూపించారు. సహాయక బృందాలను సమాయత్త పరచడం, లోతట్టు ప్రాంతాలను ఖాళీ చేయించడం, వరదల్లో చిక్కుకున్నవారిని సురక్షితంగా తరలించడం ఈ పనుల్లో స్వయంగా పాల్గొంటూ రేయింబవళ్లు పని చేశారు. అందుకే వారిని జనం మెచ్చుకుంటున్నారు. కృతజ్ఞతలు చెబుతున్నారు.

పాటియాలా కలెక్టర్

ఉత్తర భారతానికి పెను వర్షగండం ఉందని వార్తలొచ్చాక ఆ గండం పంజాబ్‌లో పాటియాలా జిల్లాకు కూడా వచ్చింది. జూలై 9, 10 తేదీల్లో పాటియాలా జిల్లా వరదల్లో చిక్కుకుంది. ఆ జిల్లా కలెక్టర్ సాక్షి సహానె వెంటనే రంగంలో దిగింది. ఆమెకు మూడేళ్ల కుమార్తె ఉంది. ఆ కుమార్తె బాగోగులు తన తల్లిదండ్రులకు అప్పజెప్పి దాదాపు 7 రోజులు ఇంటికే వెళ్లకుండా జిల్లా అంతటా తిరుగుతూ ప్రజలను కాపాడింది సాక్షి సహానె. ముఖ్యంగా ఎగువన ఉన్న మొహాలీ జిల్లా నుంచి వరద నీరు పాటియాలాలోని సట్లజ్ యమున లింక్ కెనాల్‌కి చేరడంతో ఒక్కసారిగా వరద చండీగఢ్–పాటియాలా హైవేపై ఉన్న రాజ్‌పుర ప్రాంతానికి వచ్చేసింది. అక్కడే చిత్కారా యూనివర్సిటీ, నీలమ్ హాస్పిటల్ ఉన్నాయి. రెండూ వరదలో చిక్కుకున్నాయి. ‘నీలమ్ హాస్పిటల్‌లో ఉన్న అందరు పేషెంట్లను, 14 మంది ఐసియు పేషెంట్లను విజయవంతంగా తరలించ గలిగాం’ అని సహానె తెలిపింది. అలాగే చిత్కారా యూనివర్సిటీలో విద్యార్థులందరూ బయటకు రాలేనంతగా వరద నీటిలో చిక్కుకున్నారు. సహానె స్వయంగా యూనివర్సిటీ దగ్గరకు వెళ్లి ఆర్మీ, ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాల సహాయంతో ఆ విద్యార్థులను బయటకు తరలించారు. ‘సులూర్ అనే గ్రామంలో వరద నీటిలో చిక్కుకుని ఆహారం కోసం జనం అల్లాడుతున్నారని నాకు అర్ధరాత్రి ఫోన్ వచ్చింది. వెంటనే ఆహారం తీసుకుని ఆ వానలో వరదలో బయలుదేరాను. కారులో కూచుని ఉంటే వరద నీరు నా అద్దాల వరకూ చేరుకుంది. భయమూ తెగింపు కలిగాయి. అలాగే ముందుకు వెళ్లి ఆహారం అందించగలిగాను’ అంది సాక్షి సహానె. 2014 ఐ.ఏ.ఎస్ బ్యాచ్‌కు చెందిన సహానె తన చొరవ, చురుకుదనంతో పాటియాలా జిల్లా ప్రజల అభిమానం గెలుచుకుంది.

కుల్లు ఎస్.పి.

హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు జిల్లా ఎస్.పి 28 సంవత్సరాల సాక్షి వర్మను అందరూ ‘లేడీ సింగం’ అంటారు. సిమ్లా జిల్లాలో ఆమె పని చేసినప్పుడు బ్రౌన్‌షుగర్ సరఫరా చేసే ముఠాలను పట్టుకుంది. అలాగే పేరు మోసిన దొంగలను జైలు పాలు చేసింది. స్త్రీల రక్షణ కోసం ‘గుడియా హెల్ప్‌లైన్’, ‘శక్తి బటన్’, ‘హోషియార్ సింగ్’ అనే హెల్ప్‌లైన్లు ప్రారంభించింది. దాంతో జనం ఆదరణ పొందింది. కుల్లు ఎస్.పిగా చార్జ్ తీసుకున్నాక వచ్చిన తీవ్ర వరదలను సాక్షి వర్మ సమర్థంగా ఎదుర్కొంది. ‘ఈ వరదల్లో నాకు ఎదురైన పెద్ద సవాలు ఏమిటంటే మా జిల్లాలో ఉన్న పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్స్ మనాలి కావచ్చు, తీర్థన్ కావచ్చు... వీటన్నింటితో కమ్యూనికేషన్ కోల్పోవడం. మొబైల్స్ పని చేయలేదు. మా పోలీసు శాఖ వైర్‌లెస్ ఫోన్లు కొన్ని చోట్ల మాత్రమే పని చేశాయి. మిగిలిన ప్రాంతాలకు శాటిలైట్ ఫోన్లు పంపి అక్కడి నుంచి సమాచారం తెప్పించాను. కాని శాటిలైట్ ఫోన్లు చేర్చడం కూడా పెద్ద సవాలైంది. అలాగే రోడ్లు ధ్వంసం కావడం వల్ల సహాయక బృందాలు చేరలేకపోయాయి. అయినా సరే మేమందరం సమర్థంగా సహాయక చర్యలు చేపట్టాము. పని చేసేటప్పుడు నేను స్త్రీనా, పురుషుడినా అనేది నాకు గుర్తు ఉండదు. ఒక ఆఫీసర్‌గా ఏం చేయగలను అనేదే ఆలోచిస్తాను’ అని తెలిపింది సాక్షి వర్మ– 2014 ఐపిఎస్ బ్యాచ్ ఆఫీసర్.

మండి ఎస్.పి.

కుల్లు జిల్లా పక్కనే ఉంటుంది మండి జిల్లా. రెంటికీ రెండు గంటల దూరం. ఈ జిల్లా కూడా తీవ్రంగా వరద బారిన పడింది. వంతెనలు, ఇళ్లు, రోడ్లు పూర్తిగా మునిగిపోయాయి. చివరకు పోలీస్ స్టేషన్లకు బిఎస్‌ఎఫ్ దళాలకు కూడా కమ్యూనికేషన్ లేదు. ఇలాంటి సమయంలో గొప్ప సమర్థతతో పని చేసింది మండి ఎస్.పి సౌమ్య సాంబశివన్. 2010 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఈ ఆఫీసర్ బియాస్ నది ఒడ్డున ఉన్న స్లమ్స్ చిక్కుకున్న 80 మందిని కాపాడగలగడంతో మొదటి ప్రశంస పొందింది. టూరిస్ట్ ప్రాంతం కాబట్టి కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల అక్కడికి వచ్చిన టూరిస్ట్‌లు ఎలా ఉన్నారంటూ ఫోన్ల వరద మొదలైంది. టూరిస్ట్‌లను సురక్షితంగా ఉంచడం సౌమ్యకు ఎదురైన పెద్ద సవాలు. ‘వారందరిని వెతికి స్థానిక సత్రాల్లో, గురుద్వారాల్లో చేర్చడం చాలా వొత్తిడి కలిగించింది. అలాగే ఇళ్లు విడిచి రావడానికి చాలామంది ఇష్టపడలేదు. కష్టపడి సంపాదించుకున్న వస్తువులను వదిలి రావడం ఎవరికైనా బాధే. వారు అలాగే ఉంటే చనిపోతారు. ఎంతో ఒప్పించి వారిని ఖాళీ చేయించాను’ అందామె. సౌమ్య సాంబశివన్ కింద మొత్తం 1200 మంది సహాయక సిబ్బంది పని చేసి ఈ ఉత్పాతాన్ని ఎదుర్కొన్నారు.

వంటిల్లు

మిగిలినా.. మరింత రుచిగా...

లంచ్, డిన్నర్‌లలో వండిన అన్నం కొన్నిసార్లు మిగిలిపోతుంటుంది. అలా మిగిలిన అన్నాన్ని పులిహోర, ఎగ్‌రైస్, వెజ్ రైస్ చేసుకోవడం మామూలే. తరచూ మసాలా రైస్ తినబుద్ధికాదు. అందువల్ల మిగిలిపోయిన అన్నాన్నీ మరింత రుచిగా ఇలా కూడా చేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు...

రైస్ పకోడి



కావలసినవి: మిగిలిన అన్నం – ఒకటిన్నర కప్పులు; శనగపిండి – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిబఠాణి – పావు కప్పు ; పచ్చిమిర్చి – ఒకటి; వెల్లుల్లి రెబ్బలు – పది; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; కారం – అరటేబుల్ స్పూను ; జీలకర్ర పొడి – టీస్పూను; గరం మసాలా – అరటీస్పూను; పసుపు – పావు టీస్పూను; నూనె – రెండు టేబుల్‌స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ఉల్లిపాయ, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరిగి పెట్టుకోవాలి. ● పెద్దగిన్నెలో అన్నం, పచ్చిబఠాణి, ఉల్లిపాయ ,పచ్చిమిర్చి, వెల్లుల్లి తరుగు, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. ● ఇప్పుడు కారం, పసుపు, జీలకర్రపొడి, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు, అరటేబుల్ స్పూను నూనెవేసి మరోసారి కలుపుకోవాలి. ● అన్నం మిశ్రమాన్ని పకోడీల్లా వేసుకోవాలి. ● ఈ పకోడీలపై కొద్దిగా నూనె రాసి ఎయిర్ ఫ్రైయర్‌లో 180 డిగ్రీల వద్ద పదిహేను నిమిషాలు ఫ్రై చేయాలి. ● గోల్డెన్ కలర్‌లో క్రిస్పీగా వేగిన తరువాత తీసేసి టొమాటో కెచప్, గ్రీన్ చట్నీతో సర్వ్‌చేసుకోవాలి.

రైస్ పట్టి



కావలసినవి: మిగిలిన అన్నం – కప్పు ; పచ్చి బఠాణి – అరకప్పు ; క్యారట్ – ఒకటి(సన్నగా తురమాలి) ; ఉడికించిన మటన్ ఖీమా – పావు కప్పు ; చీజ్ – ముప్పావు కప్పు ; గుడ్డు – ఒకటి ; గోధుమ పిండి – టేబుల్ స్పూను ; నూనె – మూడు టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● నూనె తప్పించి మిగతా పదార్థాలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ● ఈ మిశ్రమాన్ని పట్టీలా చేసుకొని రెండు వైపులా నూనె వేసుకుంటూ గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి. ● సాస్, చట్నీ సర్వ్‌చేసుకోవాలి.

ఇన్‌స్టంట్ ఊతప్పం



కావలసినవి: మిగిలిన అన్నం – కప్పు ; బొంబాయి రవ్వ – అరకప్పు ; పెరుగు – కప్పు; క్యారట్, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, టొమాటో ముక్కలు – కప్పు; అల్లం తరుగు – టీస్పూను ; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు ; జీలకర్ర – టీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా; నూనె ఊతప్పం వేయించడానికి – తగినంత.

తయారీ: ● పెద్దగిన్నెలో రవ్వ, పెరుగు వేసి కలిపి ఇరవై నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. ● అన్నంలో కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన అన్నాన్ని రవ్వ మిశ్రమంలో వేసి కలపాలి. దీనిలో కప్పు నీళ్లుపోసి కలపాలి. ● ఇప్పుడు కూరగాయ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర వేసి కలపాలి. ● ఈ మిశ్రమాన్ని వేడెక్కిన పెనంపై నూనె వేసి ఊతప్పంలా వేయాలి. రెండువైపులా నూనె చల్లుకుంటూ చక్కగా కాల్చుకుంటే ఇన్‌స్టంట్ ఊతప్పం రెడీ. ● కూరగాయ ముక్కలను పిండిలో కలపకుండా ఊతప్పం పైన చల్లుకుని కూడా కాల్చుకోవచ్చు.

రైస్ రొట్టి



కావలసినవి : మిగిలిన అన్నం – మూడు కప్పులు ; ఉల్లిపాయ తరుగు – అరకప్పు ; క్యారట్ తురుము – కప్పు ; పచ్చిమిర్చి – నాలుగు (సన్నగా తరగాలి) ; అల్లం – అంగుళం ముక్క (తురమాలి) ; కరివేపాకు – మూడు రెమ్మలు ; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; జీలకర్ర – అరటీస్పూను ; బియ్యప్పిండి – ముప్పావు కప్పు ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – రొట్టి వేగడానికి సరిపడా.

తయారీ: ● అన్నాన్ని నీళ్లు పోయకుండా పేస్టులా గ్రైండ్ చేయాలి. ● అన్నం పేస్టుని గిన్నెలో వేసి..ఉల్లిపాయ ముక్కలు , క్యారట్ తురుము, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అల్లం తరుగు, జీలకర్ర రుచికి సరిపడా ఉప్పువేసి చక్కగా కలుపుకోవాలి. ● కొద్దిగా బియ్యప్పిండి వేసి ముద్దగా కలుపుకుని పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● చేతులు తడిచేసుకుని పిండిని టెన్నిస్ బంతి పరిమాణంలో ఉండలుగా చేయాలి. ● ఈ ఉండలను అరిటాకు లేదా కవర్ మీద పెట్టి రొట్టెలా చేతితో వత్తుకోవాలి. ● పలుచగా వత్తుకున్న రొట్టెపై అక్కడక్కడ రంధ్రాలు చేయాలి. ● ఈ రొట్టెను చక్కగా కాలిన పెనం మీద వేసి సన్నని మంట మీద కొద్దిగా నూనె వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుని వేడివేడిగా సర్వ్‌చేసుకోవాలి.

అన్నం వడియం



కావలసినవి: అన్నం – కప్పు ; ఎండు మిర్చి – మూడు ; జీలకర్ర – రెండు టీస్పూన్లు ; ఉల్లిపాయ – ఒకటి ; పచ్చిమిర్చి – ఒకటి ; కరివేపాకు – రెమ్మ ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అన్నం మునిగేలా నీళ్లుపోసి రాత్రంతా నానబెట్టుకోవాలి. ● ఉదయాన్నే నీళ్లు తీసేసి అన్నాన్ని మిక్సీ జార్‌లో వేయాలి. ● దీనిలో ఎండుమిర్చి, జీలకర్ర వేసి బరకగా గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన ఉల్లిపాయను, పచ్చిమిర్చిని వేయాలి. ● కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పు వేసి చక్కగా కలుపుకోవాలి. ● ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలు చేసి మూడు రోజులు ఎండలో ఆరబెట్టాలి. ● ఉండలు చక్కగా ఆరాక, గాలిచొరబడని డబ్బాలో వేసి నిల్వచేయాలి. ● స్నాక్స్ సమయం లేదా అన్నం తినేటప్పుడు ఈ ఉండలను గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి సర్వ్‌చేసుకోవాలి.

శుక్రవారం 21-7-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 120

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



భారత్ 182/4

వెస్టిండీస్‌తో రెండో టెస్టు. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ అర్ధ సెంచరీలు. - 13లో



ఆరో రోజూ రికార్డుల పరుగు

20 వేల స్థాయికి చేరువలో నిఫ్టీ.. 67,500 స్థాయి ఎగువకు సెన్సెక్స్ - 13లో



ఇండియా కూటమి తొలి భేటీ

ఖర్గే చాంబర్‌లో భేటీ అయిన 'ఇండియా' కూటమి నేతలు.. వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

- వివరాలు 6లో



రేడియో కాలర్ మృత్యుపాశమై..!

ప్రాజెక్టు చీతా అగమ్య గోచరంగా మారింది. వాటి భద్రతకు అమర్చిన రేడియో కాలరే చీతాల పాలిట మృత్యుపాశమైందని అంటున్నారు.

- వివరాలు 6లో



16 మంది సజీవ సమాధి

మహారాష్ట్రలోని ఇర్షల్‌వాడి గ్రామంలో బుధవారం రాత్రి కొండచరియలు విరిగిపడిన ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో



నాలుగోసారి కక్ష్య దూరం పెంపు

'చంద్రయాన్-3'కి నాలుగోసారి కక్ష్య దూరాన్ని పెంచారు. 25న ఐదోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపట్టనున్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

యాదాద్రికి ఎంఎంటీఎస్



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రికి ఎంఎంటీఎస్ అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఉన్న 33 కిలోమీటర్ల మార్గంలో ఎంఎంటీఎస్ కోసం మరోలైన్ అదనంగా నిర్మించనున్నారు.

- వివరాలు 3లో

ఐటీలో మేటి హైదరాబాద్



దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఐటీ నగరంగా హైదరాబాద్ ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఐటీ రంగంలో రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనానికి వచ్చిన తమిళనాడు బృందంతో ఆయన భేటీ అయ్యారు.

- వివరాలు 3లో

ఓఆర్ఆర్‌ను ఏ ప్రాతిపదికన అప్పగించారు?



ఓఆర్ఆర్ నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతలను 30 ఏళ్లపాటు ఏ ప్రాతిపదికన ప్రైవేట్ కంపెనీకి అప్పగించారో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది.

- వివరాలు 3లో

రేవంత్ చైర్మన్‌గా ప్రదేశ్ ఎన్నికల కమిటీ



అధికార సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ టీమ్‌ను సిద్ధం చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో 25 మంది సభ్యులు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉన్నారు.


- వివరాలు 2లో

ఇదండీ సంగతి



మన ఇల్లు లోతట్టు ప్రాంతంలో ఉండటం వలన సరాసరి ఇక్కడికే వరదల్లో కొట్టుకొచ్చాను!

వదలని వాన.. వరదలా..



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- కరీంనగర్ జిల్లా రామడుగులో అత్యధికంగా 16 సెం.మీ. వర్షపాతం
- గురువారం ఒక్కరోజే రాష్ట్రంలో 3.45 సెంటీమీటర్ల సగటు వాన
- నాలుగు రోజుల్లోనే 20 శాతం లోటు నుంచి 6 శాతం అధికానికి...
- వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్.. మరో రెండు రోజులూ వానలు

- రాష్ట్రంలో నాలుగో రోజూ వానలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఆనందంలో అన్నదాతలు.. సాధారణ ప్రజలకు ఇబ్బందులు
- ఎడతెరిపిలేని వానతో అలుగు పారుతున్న చెరువులు.. రోడ్లపైకి నీళ్లు
- ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామాలు జల దిగ్బంధం.. స్తంభించిన జన జీవనం
- ఎగువ గోదావరికి ప్రవాహం మొదలు.. దిగువన పోటెత్తుతున్న వరద



సచివాలయం ఎదుట రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వరద గోదారి

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ 11లో

కృష్ణా ఉప నదులకూ జలకళ

- మూసీ పరవళ్లు.. 2 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల 11లో

సుమారు నెల రోజుల పాటు దోబూచులాడిన నైరుతి రుతుపవనాలు అల్పపీడనం ప్రభావంతో ప్రతాపం చూపుతున్నాయి. వరుసగా నాలుగో రోజూ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు పడ్డాయి. వాగులు, వంకలు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. పొద్దంతా ముసురుపట్టడం, ఇంట్లోంచి బయటికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. మరోవైపు ప్రాణహిత, ఇంద్రావతి ఉప నదులు, వాగులు పోటెత్తి దిగువ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద 44 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఇప్పటికే కురుస్తున్న వానలకుతోడు మరో రెండు రోజులూ భారీ వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ ప్రకటనతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈసారి సాగునీటికి కష్టాలు తీరినట్టేనంటూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. - వివరాలు 11లో

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

- గోదావరి పరీవాహకం, భద్రాచలం వద్ద తక్షణ చర్యలు చేపట్టండి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేయండి
- హెలికాప్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచండి
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలని స్పష్టీకరణ

11లో

అవసరమైతే హెలికాప్టర్ సేవలు: హరీశ్ 11లో

విద్యాసంస్థలకు సెలవులు.. పరీక్షలు వాయిదా

- గురువారం పిల్లలు స్కూళ్లకు చేరాక సెలవు ప్రకటనతో ఇబ్బంది
- శుక్రవారం కూడా బంద్.. వానలు తగ్గకపోతే మరోరోజూ సెలవు
- యూనివర్సిటీల పరిధిలో అన్ని పరీక్షలు రద్దు
- ఇంజనీరింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంచాలని విద్యార్థుల విజ్ఞప్తి
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు శుక్ర, శనివారాలు సెలవు

10లో



ట్రైబల్ లీడర్స్ ఫోరం ఆధ్వర్యంలో మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో గిరిజన సంఘాల భారీ ర్యాలీ

మణిపూర్ మంటలు

మహిళలపై అమానుష ప్రవర్తనపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు

దారుణ ఉదంతాన్ని ఖండించిన అన్ని పార్టీల నేతలు

దోషులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్

- కల్లోల మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన ఘోర అవమానంపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉదంతం దేశ ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. మహిళల పట్ల అనాగరికంగా ప్రవర్తించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీలకు అతీతంగా నాయకులు ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టు సైతం స్పందించి, విచారణ చేపట్టింది. మణిపూర్ అంశంపై గురువారం పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశాయి.

తొలి రోజే గరంగరం



- 'మణిపూర్'పై అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు
- ఘటనపై ప్రధాని సమాధానం చెప్పాలి: కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్

దోషులను వదిలిపెట్టం



మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దారుణోదంతం 140 కోట్ల మంది భారతీయులను తలదించుకునేలా చేసింది. నా హృదయం ఆవేదనతో నిండిపోయింది. దోషులను వదిలే ప్రసక్తే లేదు. - ప్రధాని మోదీ

మీవల్ల కాకపోతే మేమే రంగంలోకి దిగుతాం

కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు హెచ్చరిక



- మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన అవమానాన్ని చూసి తీవ్రంగా కలత చెందాం. ఈ ఘటనను మా అంతట మేం విచారణకు స్వీకరిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే మేమే రంగంలోకి దిగి, తగిన చర్యలు ప్రారంభించాల్సి వస్తుంది.

- వివరాలు 6లో

మహారాష్ట్ర నుంచి లోక్‌సభకు కేసీఆర్?

నాందేడ్ లేదా ఔరంగాబాద్ నుంచి బరిలోకి

- మొత్తం 48 లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులు
- ఇప్పటికే 27 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు
- గతంలో కరీంనగర్, పాలమూరు, మెదక్ ఎంపీగా కేసీఆర్ గెలుపు



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. బీఆర్ఎస్‌ను జాతీయ స్థాయిలో బలోపేతం చేసేందుకు ఇది దోహదపడుతుందని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. కాగా మహారాష్ట్రలోని నాందేడ్ లేదా ఔరంగాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న కేసీఆర్ గతంలో తెలంగాణలోని మూడు వేర్వేరు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2004, 2006, 2008లో కరీంనగర్ నుంచి. 2009లో మహబూబ్‌నగర్ నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర అవతరణ నేపథ్యంలో 2014లో మెదక్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన కేసీఆర్, సీఎం పదవిని చేపట్టడంతో మిగతా 2వ పేజీలో ▶



రోడ్డుపై బైఠాయించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. ఎమ్మెల్యే రఘునందన్‌రావు

'డబుల్' బాటకు బ్రేక్

బీజేపీ చలో బాటసింగారం భగ్నం

- ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఓఆర్ఆర్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- ఎక్కడికక్కడ బీజేపీ నేతల గృహ నిర్బంధం..అరెస్టులు
- వర్షంలో తడుస్తూనే కిషన్‌రెడ్డి బైఠాయింపు..తోపులాట
- నన్ను చంపుతారా? చంపండి అంటూ ఆగ్రహం
- బలవంతంగా రాష్ట్ర కార్యాలయానికి తరలింపు
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన కార్యక్రమం విఫలం
- మండల కేంద్రాల్లో ఆందోళనలకు బీజేపీ పిలుపు
- పార్టీ కార్యాలయం వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

2లో

నేడు కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ - 2లో

మైనారిటీలకు లక్ష సాయం!

త్వరలో సీఎం కేసీఆర్ వివరాలు వెల్లడిస్తారు: మంత్రి హరీశ్‌రావు



- రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించే అంశం సీఎం కె.చంద్రశేఖర్‌రావు పరిశీలనలో ఉందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు చెప్పారు. త్వరలో అమల్లోకి రానున్న ఈ పథకానికి సంబంధించిన వివరాలను సీఎం ప్రకటిస్తారన్నారు. దేశంలో నేటికీ ముస్లింలు పేదలుగా మిగలడానికి కాంగ్రెస్సే కారణమన్నారు. - వివరాలు 3లో

గూగుల్ టేక్ అవుట్ తప్పు!

వివేకా హత్య కేసులో తుది చార్జ్‌షీట్‌లో మాటమార్చిన సీబీఐ



- గ్రీన్‌విచ్ కాలమానం, భారత కాలమానానికి అప్పట్లో తేడా గుర్తించలేదని వెల్లడి
- సునీల్ యాదవ్ 'గూగుల్ టేక్ అవుట్'పై ఇప్పుడు మరోమాట
- వైఎస్ భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క ఆధారం లేదు
- చిన్నాన్న కడప ఎంపీ టికెట్ ఆశించనేలేదన్న షర్మిల
- నన్ను పోటీ చేయమంటే ఆసక్తి చూపలేదని వాంగ్మూలం
- వివేకా ఎంపీ టికెట్ ఆశించడంతోనే విభేదాలంటూ సీబీఐ అభియోగాలు.. గత చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా తుది చార్జ్‌షీట్

- వివరాలు 5లో

క్లుప్తంగా...

'బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం హత్య'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలనలో ప్రజాస్వామ్యం పట్ట పగలు హత్యకు గురైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కింద పేదలకు ఇళ్లు దక్కకపోవడాన్ని నిలదీస్తూ నిరసన తెలిపిన కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు వందలాది మంది బీజేపీ నేతలను అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు.

బీజేపీలో చేరేందుకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంతనాలు

ఆధారాలు ఉన్నాయ్: మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ టౌన్: రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరేందుకు మంతనాలు జరుపుతున్నారని ఆ పార్టీ నేత, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తనవద్ద ఉన్నాయని వెల్లడించారు. నిర్మల్‌లోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని గుర్తించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆయన వస్తానంటే తానే దగ్గరుండి బీజేపీలో చేర్పిస్తా నన్నారు. పార్టీ నాయకత్వంతో మాట్లాడి ముధోల్ టికెట్ కూడా ఇప్పిస్తానని చెప్పారు. నిర్మల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కోతలే..: జగదీశ్‌రెడ్డి



హుజూర్‌నగర్ రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కోతలు తప్పవని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి దుయ్య బట్టారు. 24 గంటల విద్యుత్ విధానం ఆ పార్టీ చరిత్రలోనే లేదని, 24 గంటల కరెంట్ ఇచ్చే ఆలోచన ఉంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో వ్యవసాయానికి 7 గంటలే కరెంట్ ఇస్తున్నారని చెప్పారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాస పురం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ చాలంటూ పీసీసీ అధ్య క్షుడు రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన ప్రకటనపై మంత్రి మండిపడ్డారు. కాంగ్రెస్ రహస్య ఎజెండానే బుడ్డర్ ఖాన్ నోటి నుంచి వెలువడిందని ఎద్దేవా చేశారు. 8 గంటల విద్యుత్ కాంగ్రెస్ పార్టీ రహస్య ఎజెండాలో భాగమేనన్నారు. కాంగ్రెస్ అధికారం చేపడితే.. సంక్షేమ ,పథకాలు ఎత్తివేయడంతోపాటు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌లకు మంగళం పాడుతుందని, రైతు బంధు, రైతు బీమా ఎత్తివేస్తుందని ఆరోపించారు.

జనగామలో బీఆర్ఎస్‌ను భ్రష్టుపట్టిస్తున్నారు..

ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై ఆప్కో మాజీ చైర్మన్ శ్రీరాములు ధ్వజం

జనగామ: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిత్యం కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని భ్రష్టుపట్టించి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర నేత, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమ కాలంలో పనిచేసిన కార్యకర్తలకు సరైన గుర్తింపులేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఆయన బావమరిది విచ్చలవిడిగా అక్రమాలు చేశారని, ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 కేసుల్లో వారి ప్రమేయం ఉందని, చిట్టా తయారు చేసి ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

దళితబంధు అవినీతిలో కేసీఆర్ వాటా ఎంత?

ఎగ్జిట్‌మోడ్‌లో రాష్ట్ర ప్రభుత్వం
బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్: దళితబంధు పథకంలో జరుగుతున్న అవినీతిలో సీఎం కేసీఆర్ వాటా ఎంత అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎగ్జిట్‌మోడ్‌లో ఉన్న ప్రభుత్వం ప్రజల సమస్యల్ని పట్టించుకునే స్థితిలో లేదని, కమీషన్ల కోసం కక్కుర్తి పడి పెత్తందార్లకే సహాయం చేస్తోందని ధ్వజమెత్తారు. దళితబంధులో అవినీతికి పాల్పడిన లంచగొండి ఎమ్మెల్యేలపై సీఎం కేసీఆర్ అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలతో ఎందుకు విచారణ చేపట్టడం లేదని నిలదీశారు. ఇసుకదందాలో కూడా సీఎం వాటా ఉంది కాబట్టే దానిపై మాట్లాడటం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35వేల ఎకరాల అసైన్డ్ భూములను రైతుల నుంచి లాక్కుని ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయిస్తోందని విమర్శించారు.

'డబుల్' బాటకు బ్రేక్..

బీజేపీ చలో బాటసింగారం భగ్నం.. ఎయిర్‌పోర్టుకు సమీపంలోనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు



కిషన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



తన నివాసం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: బీజేపీ 'చలో బాటసింగారం' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని, ఆయన వెంట ఉన్న ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, ఇతర నేతలను అరెస్టు చేసి వారు బాటసింగారం వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, ఇతర నాయకులను వారి వారి నివాసాల్లోనే నిర్బంధంలో ఉంచారు.

కాన్వాయ్‌కి డీసీఎం అడ్డుగా పెట్టి..

హైదరాబాద్ శివార్లలోని బాటసింగారంలో మధ్యలో నిలిపేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం పరిశీలించాలని కిషన్‌రెడ్డి నిర్ణయించారు. అక్కడే పేదల ఇళ్ల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను వెల్లడించాలని భావించారు. దీంతో బుధవారం రాత్రి నుంచే హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వివిధ స్థాయిల పార్టీ నాయకులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఇక గురువారం ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే వారిని, ఆఫీసు బాధ్యులను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఇతర నాయకులను కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో ఉదయాన్నే ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన కిషన్‌రెడ్డి నేరుగా బాటసింగారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాగానే అనుమతి లేకుండా ఆందోళన కార్యక్రమాలు చేపట్టొద్దని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. బీఆర్ఎస్ నేతలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ధర్నాలు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా రఘునందన్‌రావు ప్రశ్నించారు. అంతా కలిసి ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా బాట సింగారం వైపు బయలుదేరారు. అయితే పోలీసులు ఓఆర్ఆర్ వద్దే కాన్వాయ్‌కి ఎదురుగా డీసీఎంను నిలిపి అడ్డుకున్నారు.

నా చర్మం ఊడిపోతోంది.. మీపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా

పోలీసుల వైఖరికి నిరసనగా కిషన్‌రెడ్డి, ఇతర నేతలు రోడ్డుపై వర్షంలో తడుస్తూనే బైఠాయించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని, పోలీసులకు సహకరించాలని పోలీసు కమిషనర్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో తనను రోడ్డుపైనుంచి లేపేందుకు ప్రయత్నించిన పోలీసులతో కేంద్రమంత్రి వాగ్వాదానికి దిగారు. కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాటతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. 'నేనేం తప్పు చేశాను? నన్ను ఎందుకు అడ్డుకుంటున్నారు? మీ చర్యలతో నా చర్మమంతా ఎరుపుగా మారి కమిలిపోయి ఊడి పోతోంది. మిమ్మల్ని లోక్‌సభ స్పీకర్ ముందు నిలబెడతా.. మీపై ఫిర్యాదు చేస్తా.. మీరు సీఎం కేసీఆర్ కుటుంబానికి కట్టుబానిసల్లా పనిచేస్తున్నారు. నన్ను చంపుతారా?..చంపండి..ఇంటికి మాత్రం వెళ్లను..' అంటూ కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రిని బలవంతంగా ఆయన వాహనంలో కూర్చోబెట్టి పోలీసులే నడుపుతూ ఆరాంఘర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే, మాసబ్ ట్యాంక్, ఎర్రమంజిల్, ఖైరతాబాద్ మీదుగా నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు. కాగా కిషన్‌రెడ్డి, ఇతర నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ పార్టీ కార్యాలయం సమీపంలో బీజేపీ కార్యకర్తలు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. పార్టీ పరంగా డబుల్ బెడ్ రూం ఇళ్లపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి సాక్ష్యం: ఈటల

బీజేపీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అటు వైపు ఏ ఒక్కరినీ అనుమతించలేదు. ఎంపీ అరవింద్‌ను బంజారాహిల్స్‌లోని నివాసంలో, డీకే అరుణను జూబ్లీహిల్స్‌లోని నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. ఈటలను శామీర్‌పేటలోని ఇంటి వద్దే అడ్డుకోగా, ఆయన కార్యకర్తలతో కలిసి అక్కడే ధర్నాకు కూర్చొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కేంద్రమంత్రి హక్కులను భంగం కలిగించే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల నుండి అప్పులు తీసుకుని, రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులతో నిర్మించిన డబుల్ ఇళ్లను పేదలకు ఇంకా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి సాక్ష్యం అని అన్నారు. తార్నాకలో రాంచందర్‌రావు, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డిలను గృహ నిర్బంధంలో ఉంచారు.

బీఆర్ఎస్‌పై యుద్ధం మొదలైంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- కల్వకుంట్ల కుటుంబం జైలు గదులు రెడీ చేసుకోవాలి
- పోలీస్ కమిషనర్, డీసీపీలు ఒక నేరస్తుడు, ఉగ్రవాదితో వ్యవహరించినట్టు నాతో వ్యవహరించారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌పై యుద్ధం మొదలైందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మొదలు పెట్టిన యుద్ధానికి తాము సిద్ధమని ప్రకటించారు. 'డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనుల గురించి తెలుసు కోవడానికి వెళ్లే హక్కు కూడా కేంద్ర మంత్రిగా నాకు లేదా?' అని ప్రశ్నించారు. ఒక నేరస్తుడు, ఉగ్ర వాదితో వ్యవహరించిన విధంగా తనతో పోలీస్ కమిషనర్, డీసీపీలు అమానుషంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను ప్రగతిభ వన్‌లో కూర్చొని అణచివేస్తారా? అని దుయ్య బట్టారు. కిషన్‌రెడ్డి గురువారం ఉదయం శంషా బాద్ ఎయిర్‌పోర్టు వద్ద, ఓఆర్ఆర్‌పై, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

బీఆర్ఎస్‌ను గద్దె దించేవరకు పోరాటం

బాటసింగారంలో రెండు పడక గదుల ఇళ్ల పరిశీలనకు బయలుదేరిన తనను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిప్పిన తీరును కేంద్రమంత్రి తప్పు బట్టారు. 'తెలంగాణలో పేద ప్రజలకు న్యాయం జరగడం లేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్లూ ఇవ్వడం లేదు. బాటసింగారంలో మధ్యలోనే వదిలేశారు. వాటిని చూద్దామని బయలుదేరాం. ధర్నా, ఆందోళన కార్యక్రమాల వంటివి కాదని చెప్పినా.. పోలీసులు నియంతత్వ ధోరణితో వ్యవహరించారు. 75 ఏళ్ల భారతదేశ చరిత్రలో తొలిసారిగా ఓ కేంద్ర కేబినెట్ మంత్రిని ప్రజాసమస్యలను పరిశీలించేందుకు వెళ్తుండగా అక్రమంగా అరెస్టు చేశారు. దీనిపై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా. పోలీసులు కేసీఆర్ తొత్తుల్లాగా కాకుండా ప్రజాసేవకుల్లా వ్యవహరించాలి. కేంద్రమంత్రి కాన్వాయ్‌కి డీసీఎంను అడ్డంపెట్టి ఆపేంత అవసరం ఏమొచ్చింది? నేనేమైనా క్రిమినల్ నా? రాష్ట్రంలో దౌర్జన్య పాలన నడుస్తోంది. నిజాం కన్నా అధ్వానమైన పాలన ఇక్కడ ఉంది. ఈరోజు యుద్ధం మొదలైంది. కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్‌తో యుద్ధానికి మేం సిద్ధం. ప్రజల సమస్యల తరఫున బీఆర్ఎస్‌ను గద్దెదించే వరకు పోరాటం కొనసా గిస్తాం. ఆ పార్టీ పాపాలు పండాయి. కల్వకుంట్ల కుటుంబం జైలు గదులు రెడీ చేసుకోవాలి..' అంటూ కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దమ్ముంటే 50 లక్షల ఇళ్లు కట్టండి...

'సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే తెలంగాణలో 50 లక్షల ఇళ్లు కట్టాలి. 50 లక్షల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం వాటా తెచ్చే బాధ్యత నాదే. ఖరీదైన ఇళ్లు కట్టుకోవడానికి, విమానాలు కొనడానికి కేసీఆర్‌కు డబ్బులుంటాయి కానీ పేద ప్రజలకు ఇళ్లు కట్టడానికి డబ్బులుండవా? అరకొరగా కట్టిన ఇళ్లు కూడా తొమ్మిదేళ్లుగా ఎవరికీ ఇవ్వలేదు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం..' అంటూ ధ్వజమెత్తారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల కంటే తానే ఎక్కువ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని కిషన్‌రెడ్డి అన్నారు. 'అరెస్టులు మాకు కొత్త కాదు. జైళ్లను సిద్ధం చేసుకోండి. ఎంతమందిని అరెస్టు చేస్తారో చేయండి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్య మంలో చావుకు కూడా భయపడం. పేదల పక్షాన పోరాడుతూనే ఉంటాం..' అని స్పష్టం చేశారు.

ధర్నాకు అనుమతి ఇవ్వండి

హిమాయత్‌నగర్: ఈ నెల 25న బీజేపీ చేపట్టే ధర్నాకు పోలీసు శాఖ నుంచి అనుమతి ఇవ్వాలంటూ ఆ పార్టీ నేతలు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌ను కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులు కొండా విశ్వేశ్వరరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీవీఎస్ ప్రభాకర్, ఏవీఎన్ రెడ్డి, రామచందర్‌లు గురువారం సీపీని కలిసి వినతిపత్రం అందచేశారు.

మీ మౌనం వల్లనే మణిపూర్‌లో ఘోరం

- కుకి మహిళలపై జరిగిన దారుణాలపై తక్షణమే స్పందించండి
- ప్రధాని, హోం మంత్రిని ఉద్దేశిస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: మణిపూర్‌లో కుకి మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న హేయమైన ఘటనలు, బృంద హింసపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామా జిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాను ఉద్దేశించి ట్వీట్ చేశారు. 'మహిళలు, పిల్లలను తాలిబాన్లు అగౌరవ పరుస్తు న్నపుడు భారతీయులుగా మనందరం ఆందోళన చెందాం. కానీ ప్రస్తుతం మన సొంత దేశంలోనే మెయితీ గుంపులు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికంగా వేధింపులకు గురి చేయడం అత్యంత హేయం. మనసు కలిచి వేసే ఇలాంటి అనాగరిక ఘటనలు నయా భారత్‌లో సాధారణంగా మారుతున్నాయి. ప్రధాని, హోంమంత్రి, కేంద్ర ప్రభుత్వం మౌనముద్ర వహించడంతో మణి పూర్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి భయాన కమైన హింసకు దారితీసింది. మణిపూర్ మంటలను ఆర్పేందుకు ప్రధాని, హోంమంత్రి అన్ని అంశాలను పక్కన పెట్టి శక్తిని, సమయాన్ని వెచ్చించాలి.. నాగరిక సమాజంలో హింసకు తావులేదనే సందేశాన్ని పంపాలి'' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

మహారాష్ట్ర నుంచి లోక్‌సభకు కేసీఆర్?

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

జాతీయ రాజకీయాల్లో బలం చాటే వ్యూహం

జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీల నేతృత్వంలోని కూటములకు సమదూరం పాటిస్తున్న కేసీఆర్ లోక్‌సభలో ఒంటరి పోరుకు సన్నద్ధమవుతున్నారు. మహారాష్ట్రలోని అన్ని లోక్‌సభ స్థానాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులను బరిలోకి దింపేలా ఆయన వ్యూహ రచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మహారాష్ట్రలో 48 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటికే 27 నియోజకవర్గాల పరిధిలో గ్రామ స్థాయి వరకు తొమ్మిదేసి పార్టీ కమిటీలు ఏర్పాటయ్యాయి. మహారాష్ట్రలోని 15 జిల్లాల పరిధిలో పార్టీ కార్యకలాపాలు వేగం పుంజుకున్నట్లు మహారాష్ట్ర బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా మహారాష్ట్ర నుంచి లోక్‌సభ బరిలోకి దిగడం ద్వారా జాతీయ రాజకీయాల్లో తన బలాన్ని చాటేలా కేసీఆర్ వ్యూహం సిద్ధం చేస్తున్నారని చెబుతున్నారు.

సిట్టింగ్‌లందరికీ బీఫామ్ ఇచ్చే దమ్ముందా?

- కేసీఆర్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్
- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి కేసీఆర్ అద్భుతమైన పాలన అందించి ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ బీఫామ్ ఇచ్చే దమ్ముందా అని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణను బంగారుమయం చేసి ఉంటే ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌లోని 25–30 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఎందుకు మార్చాలనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారంతా దొంగలని, ప్రజలను ఇబ్బందులపాలు చేసేందుకే మార్చాలని అనుకుంటున్నారని ఆరోపించారు. మరోవైపు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పొంగులేటి కోరారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి గ్రామపంచాయతీ మొదలు పార్లమెంటు వరకు కాంగ్రెస్ జెండాను రెపరెప లాడించాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న వారు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా.. అది ఇంకా 55 రోజులు మాత్రమేనని, బీఆర్ఎస్‌కు కౌంట్‌డౌన్ మొదలైందని పొంగులేటి చెప్పారు. ప్రచార కమిటీ కోచైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి జిల్లాకు వచ్చిన పొంగులేటికి పార్టీ నాయకులు జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద ఘనస్వాగతం పలికారు. డీసీసీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఖమ్మం, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌పై ప్రధాని తీరు బాధాకరం: ఎమ్మెల్యే సీతక్క

సాక్షి, హైదరాబాద్: మణిపూర్‌లో జరుగు తున్న సంఘటనలపై ప్రధాని మోదీ తీరు బాధాకరమని ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. అక్కడ దారుణాలు జరుగుతున్నా, తనకేమీ తెలియనట్టు మాట్లాడటం శోచనీయమన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మణిపూర్ ఘటనపై 79రోజుల తర్వాత మోదీ మౌనం వీడారన్నారు. కుకీతెగపై దాడులు, హత్యాచారాలు బాధాకరమ ని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో రాహుల్ పర్యటన ను బీజేపీ సర్కారు అడ్డుకుందని, మనదేశంలోనే జరుగుతున్న సంఘటనలా అని భయపడేట్టుగా మణిపూర్‌లో పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూం సమస్య పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలకు తెరతీశాయని విమర్శించారు.

కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు..

బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు బండి సంజయ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజలు సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. తెలంగాణ పోలీసులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టులతో బీజేపీ వెనకడుగు వేయబోదన్నారు. కేసీఆర్ మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారని, ఇకనైనా ఆ బుద్ధులు మానుకోవాలని హితవు పలికారు. గురువారం ఢిల్లీ లోని తెలంగాణభవన్‌లో బండి సంజయ్ మీడి యాతో మాట్లాడారు. కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించడంలో తప్పేముందన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని ఇచ్చారు? ఎన్ని కట్టిచ్చారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇచ్చిన ఇళ్లు పూర్తి చేశాం అని కేంద్రానికి నివేదిక ఇచ్చిన కేసీఆర్... లబ్ధిదారుల లిస్ట్ ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రం ప్రశ్నిస్తే స్పందించకపోవడానికి గల కారణాలను ప్రజలకు వివరించాలన్నారు. కేసీఆర్ చూపిన గ్రాఫి క్స్‌కు, కట్టిన డబుల్ ఇళ్లకు పొంతనే లేదని, నా పాదయాత్రలో రాష్ట్ర ప్రభుత్వం కట్టించిన ఆ ఇళ్లను పరిశీలిస్తే ముట్టుకుంటే కూలిపోయేలా ఉన్నాయని తెలిపారు. అరెస్టులు, గృహ నిర్బంధాలు కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమని, ఎంపీల అరెస్టులపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ నోటీసులు కూడా ఇచ్చామన్నారు.

క్షేత్రస్థాయి పోరాటం మరింత ఉధృతం

బీఆర్ఎస్‌ను గద్దె దించడం ఖాయం: బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ నేతలను బీఆర్ఎస్ అడ్డుకోవడంతో తెలంగాణలో యుద్ధం ఆరంభమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ముఖ్య నాయకులను అరెస్ట్ చేయడాన్ని లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని నిలదీశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఆ ఇళ్లకు డబ్బులు వసూలు చేస్తూ పేదల కడుపు కొడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రజలే నిరూపిస్తా రన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలిచి తెలంగాణలో ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బాధ్యతలు నిర్వర్తించకుండా అడ్డుకున్నారు: కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అరెస్టుపై రాష్ట్రపతి, స్పీకర్‌కు ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రిగా, ఎంపీగా తన బాధ్యతలు నిర్వహించకుండా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకున్న తీరుపై రాష్టపతి ద్రౌపదీ ముర్ము, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. లోక్‌సభ సభ్యుడిగా తన హక్కులకు భంగం కలిగించేవిధంగా సీఎం కేసీఆర్ సర్కార్ వ్యవహరించిందని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. తనను అరెస్ట్ చేసిన వెంటనే స్పీకర్‌కు కారణం తెలియజేయాల్సి ఉన్నా ఆ విధంగా చేయలేదన్నారు. జెడ్ కేటగిరీ భద్రత కలిగిన వ్యక్తిగా ముందుగానే తన పర్యటనకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించానని, అయినప్పటికీ రాచకొండ కమిషనర్, ఇతర పోలీసు అధికారులు తనను అరెస్టు చేశారని లోక్‌సభ స్పీకర్‌కు తెలిపారు. కేంద్రమంత్రిగా, ఎంపీగా కేంద్రప్రభుత్వ పథకాల అమలుతీరు పరిశీలన తన బాధ్యతని, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు హైదరాబాద్‌లోని బాటసింగారానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని వివరించారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్‌పై కేసీఆర్ సమాధానం చెప్పాలి: ఎంపీ డి.అర్వింద్



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేశారో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సమాధానం చెప్పాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న కిషన్‌రెడ్డిని అడ్డుకుని ! అరెస్ట్ చేయడం దుర్మార్గమ న్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. ఇతరుల మాదిరిగా కిషన్‌రెడ్డిపై లిక్కర్ మాఫియా, డ్రగ్స్, బాలీవుడ్ వాళ్లతో సంబంధాలు ఉన్నట్లు ఏమైనా ఆరోపణలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇచ్చిన రూ.18,500 కోట్లలో ఒక్క పైసా కూడా కేసీఆర్ సర్కార్ ఖర్చు చేయలేదని మండిపడ్డారు. బీజేపీ అంటే సీఎం కేసీఆర్ భయపడుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు. అరెస్టులు, అడ్డంకులతో బీజేపీ ఎదుగుదలను ఆపలేరని, రాబోయే రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ రాత్రికిరాత్రే అరెస్ట్ చేయడం ఏమిటని నిలదీశారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకారం నేడు

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 7 గంటలకు చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి దేవాలయంలో పూజలు చేశాక.. అంబర్‌పేటలో మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం బషీర్‌బాగ్‌లోని శ్రీకనకదుర్గ దేవాలయంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 11.45 గంటలకు పార్టీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారు. కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ హాజరవుతారు.

'డబుల్'పై బీజేపీ డ్రామాలు

- కిషన్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించాల్సిన అవసరమేముంది?
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో బీజేపీ నాయకులు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ విమర్శించారు. దేశంలో పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఉచితంగా ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. గురు వారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడి యాతో మాట్లాడారు. కేంద్రమంత్రిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న కిషన్‌రెడ్డికి అధికారికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను సందర్శించి పరిశీలించే అవకాశం ఉన్నప్పటికీ అలా కాదని రోడ్డుపై బైఠాయించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఏం ఆశించి, ఎందుకోసం ఈ రాద్ధాంతం చేస్తున్నారో చెప్పాలని అన్నారు. ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ప్రకటించిన తర్వాత కూడా ఆందోళన ఎందుకు చేస్తున్నారో చెప్పాలని, పేద ప్రజల సంక్షేమం కోసం మీరేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజంగా పేదలకు మేలు చేయాలనే ఆలో చన మీకు ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎందుకు నిధులు తేలేకపోతున్నారని ప్రశ్నించారు.

పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే..

పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ అన్ని మౌలిక సౌకర్యాలు, వసతులతో కూడిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తలసాని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2.65 లక్షలు, జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్ష ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కొల్లూరులో రూ. 6,700 కోట్ల వ్యయంతో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల కాలనీని ఇటీవలే సీఎం ప్రారంభించారన్నారు. గతంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని ప్రశంసించిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు.

రేవంత్ చైర్మన్‌గా ప్రదేశ్ ఎన్నికల కమిటీ

- భట్టిసహా 25 మంది సభ్యులు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ



సాక్షి, న్యూఢిల్లీ: అధికార సాధనే థీమ్‌గా ఎలక్షన్ టీమ్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్ధం చేసింది. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రదేశ్ ఎన్నికల కమిటీని ప్రకటించింది. ఈ కమిటీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో 25 మంది సభ్యులు, ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉన్నారు. ఈ మేరకు గురు వారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రదేశ్ ఎన్నికల కమిటీలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మాజీమంత్రులు గీతారెడ్డి, జానారెడ్డి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామో దర రాజనర్సింహ, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు జగ్గా రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొదెం వీరయ్య, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శులు వంశీచంద్ రెడ్డి, సంపత్ కుమార్, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నేతలు రేణుకా చౌదరి, అజారుద్దీన్, మహేశ్‌కుమార్ గౌడ్, ప్రేమ్‌సాగర్ రావు, సునీతా రావులను సభ్యులుగా నియమించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, సేవాదళ్ రాష్ట్ర ముఖ్య నిర్వాహకుడు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు.

క్లుప్తంగా...

హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

దరఖాస్తులకు గడువు ఈనెల 30

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. హెచ్‌సీయూలో 16 ఇంటిగ్రేటెడ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అన్ని ఇంటిగ్రేటెడ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో మొత్తం 315 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ కేటగిరీలో 128 సీట్లు, ఎస్సీలకు 47, ఎస్టీలకు 24, ఓబీసీలకు 85, ఈడబ్ల్యూఎస్‌లకు 31 సీట్లు రిజర్వు చేశారు. వీటికి అదనంగా 15 సీట్లు పీడబ్ల్యూడీ, రక్షణ సిబ్బందికి కేటాయించారు. కోర్సులలో ప్రవేశాలు సీయూఈటీ(యూజీ)2023 స్కోర్ ఆధారంగా ఉంటాయి. ఔత్సాహిక అభ్యర్థులు యూనివర్సిటీ అకడమిక్ వెబ్‌సైట్ లింక్ http://acad.uohyd.ac.in/లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో దరఖాస్తు రుసుము, ప్రాస్పెక్టస్, ప్రవేశ షెడ్యూల్, ఆన్‌లైన్ దరఖాస్తు తదితర అంశాలు అందుబాటులో ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు జూలై 30 చివరి తేదీ అని అధికారులు ప్రకటించారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో బీసీ బిల్లు పెట్టాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ఎంపీ కృష్ణయ్య వినతి



సాక్షి, న్యూఢిల్లీ: జనగణనలో కులగణన చేపట్టాలని భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అభినందించారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టే అంశాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నందగోపాల్, రాజ్‌కుమార్, బాషయ్య తదితరులు ఖర్గేను కలిశారు.

పేపర్ లీకేజీ కేసులో మరో ముగ్గురు అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్స్ లీకేజీ కేసులో గురువారం మరో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. మాజీ ఏఈ రమేష్ నెట్‌వర్క్‌లో సభ్యులు అయిన పేదమ్మల గాయత్రి, విప్పునూతుల సాయికృష్ణ , పి.ప్రవీణ్‌కుమార్‌ను సిట్ గురువారం అరెస్ట్ చేసింది.



సాక్షి, హైదరాబాద్: వీఆర్‌ఏలకు పే స్కేల్ వర్తింపజేసి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించిన తర్వాత, గ్రామానికో వీఆర్‌ఏను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం(ట్రెసా) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి వినతిపత్రం సమర్పించింది.

బీడీఎల్ నూతన సీఎండీగా మాధవరావు బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా భారత నేవీ రిటైర్డ్ కమోడోర్ ఎ.మాధవరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బీడీఎల్‌లో మార్చి 2020న మాధవరావు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేరారు. ప్రస్తుతం ఆయన డైరెక్టర్ (ప్రొడక్షన్)గా, డైరెక్టర్ (టెక్నికల్) అదనపు బాధ్యతల్లో పనిచేస్తున్నారు. బీడీఎల్‌లో పనిచేసిన అనుభవంతోపాటు మాధవరావుకు భారత నౌకాదళంలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసిన అనుభవం ఉంది. మాధవరావు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్‌లో ఎంటెక్, డిఫెన్స్ స్టడీస్‌లో ఎమ్మెస్సీ, ఎంబీఏ ఫైనాన్స్ తదితర కోర్సులు చేశారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' సాధనకు, ఫాస్ట్ ట్రాక్ ప్రాతిపదికన భవిష్యత్తు తరం అధునాతన క్షిపణుల తయారీకి బీడీఎల్ చొరవ తీసుకునేలా ఆయన కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా భారత సాయుధ దళాలు, రక్షణ మంత్రిత్వ శాఖ ఇతర దేశాలతో ఒప్పందాలపై సంతకం చేయడంలో కీలక పాత్ర పోషించారు. భారత నౌకాదళంలో పనిచేసిన సమయంలో కమోడోర్ మాధవరావు కార్గిల్, పరాక్రమ్ ఆపరేషన్లలో పాల్గొన్నారు. భారత నౌకాదళంలోకి అణు జలాంతర్గాముల ప్రవేశానికి విశాఖపట్నంలో న్యూక్లియర్ సేఫ్టీ ఫీల్డ్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేయడంలోనూ మాధవరావు కీలకంగా ఉన్నారు. భారత నావికాదళానికి చెందిన రెండు తరగతుల సబ్‌మెరైన్‌లలో పనిచేయడంతోపాటు న్యూక్లియర్ సబ్‌మెరైన్ 'చక్ర' ఇండక్షన్‌లో కీలక పాత్ర పోషించారు. నేవల్ డాక్‌యార్డ్‌లతో సుదీర్ఘ అనుబంధాన్ని కలిగి ఉన్నారు. నేవల్ డాక్‌యార్డ్ విశాఖపట్నంలో జనరల్ మేనేజర్ టెక్నికల్‌గా పనిచేశారు.

మైనారిటీలకు రూ.లక్ష సాయం!

త్వరలో సీఎం కేసీఆర్ వివరాలు వెల్లడిస్తారు: మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించే అంశం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పరిశీలనలో ఉందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు చెప్పారు. త్వరలో అమల్లోకి రానున్న ఈ పథకానికి సంబంధించిన వివరాలను సీఎం ప్రకటిస్తారన్నారు. మైనారిటీ సంక్షేమానికి ప్రస్తుత వార్షిక బడ్జెట్‌లో రూ.2,200 కోట్లు కేటా యించిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. వివిధ విభాగాల కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమి తులైన మైనారిటీ నేతలను గురువారం జల విహా ర్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ మైనారిటీల విషయంలో కాంగ్రెస్ చెప్పే మాటలకు పొంతన ఉండదని, దేశంలో నేటి కీ ముస్లింలు పేదలుగా మిగలడానికి ఆ పార్టీయే కారణమన్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో మైనారిటీ సంక్షేమానికి వెచ్చించిన మొత్తం కంటే ఒక్క ఏడాదిలో తమ ప్రభుత్వం ఖర్చు చేసిందే ఎక్కు వగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహమూద్ అలీ, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మె ల్యేలు షకీల్, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గంగా జమున తహజీబ్

మైనారిటీ వర్గాలను సీఎం కేసీఆర్ ఎంతగానో గౌరవిస్తారనేందుకు మహమూద్ అలీని రెండు పర్యాయాలు మంత్రిగా చేయడమే నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గంగ జమున తహజీబ్‌ను అమలు చేస్తున్నారని.. మైనారిటీలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, షాదీ ముబారక్ వంటి ఎన్నో పథకాలు ఇస్తున్నారని చెప్పారు. పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఉన్న మైనార్టీ నేతలను హరీశ్‌రావు, మహమూద్ అలీ సన్మానించారు. సన్మానం అందుకున్న మైనారిటీ నేతల్లో మేడే రాజీవ్ సాగర్, ముజీబ్ ఉద్దీన్, తన్వీర్, ఇంతియాజ్, తారిక్ అన్సారీ, సలీం, అక్బర్ ఉన్నారు.

యాదాద్రికి ఎంఎంటీఎస్

- మొదలైన కార్యాచరణ.. పెరగనున్న నిర్మాణ వ్యయం
- పూర్తిగా రైల్వేశాఖ సొంత నిధులతోనే..
- మూడో లైన్‌తోపాటు యాదాద్రి స్టేషన్ అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్, యాదాద్రి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రికి ఎంఎంటీఎస్ అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఉన్న 33 కిలోమీటర్ల మార్గంలో ఇప్పుడున్న రెండు లైన్‌లతో పాటు ఎంఎంటీఎస్ కోసం మరోలైన్ అదనంగా నిర్మించనున్నారు. వాస్తవానికి ఎంఎంటీఎస్ రెండోదశ కింద 2016లోనే ఈ ప్రాజెక్టు చేపట్టారు. కానీ రాష్ట్రప్రభుత్వం తన వాటాగా నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర జాప్యం నెలకొంది. రూ.330 కోట్లతో అప్పట్లో అంచనాలు రూపొందించారు. పెరిగిన ధరల దృష్ట్యా ప్రాజెక్టు వ్యయం ఇప్పుడు రూ.430 కోట్లకు చేరింది. రైల్వేశాఖ వందశాతం నిధులతో ఈ ప్రాజెక్టు నిర్మించనుంది. రైల్ వికాస్‌నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) ఆధ్వర్యంలో త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

జీఎం సమీక్ష

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్‌ప్రాజెక్ట్ మేనేజర్ మున్నాకుమార్, సికింద్రాబాద్ డీఆర్‌ఎం ఏకే గుప్తాలతో కూడిన ఉన్నతాధికారుల బృందం గురువారం యాదాద్రి రైల్వేస్టేషన్‌ను సందర్శించింది. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయాలు, స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలు, కొత్తగా నిర్మించాల్సిన ఎంఎంటీఎస్–2 లైన్, తదితర పనులపైన జీఎం సమీక్షించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, యాదాద్రి స్టేషన్లు, యార్డులలో అదనపు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతమున్న రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ప్లాట్‌ఫాం, స్టేషన్ ఇతర వసతుల కోసం స్థలాన్ని జీఎం పరిశీలించారు. ప్రస్తుతం గుట్టవైపు ఉన్న స్టేషన్‌కు ఎదురుగా నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టడానికి అనువుగా ఉన్నట్టు గుర్తించారు. యాదాద్రి క్షేత్ర ఆలయ నమూనాతో రైల్వేస్టేషన్ ముఖ ద్వారం నిర్మించనున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని, రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించాలని, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రాసిన వినతిపత్రాన్ని జీఎంకు భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అందజేశారు. జీఎం ముందుగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని సుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్నారు.



యాదాద్రి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల నమూనాను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు

యాదాద్రి పునరాభివృద్ధి

అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద యాదాద్రి రైల్వేస్టేషన్‌ను పునరాభివృద్ధి చేయనున్నట్టు జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎంఎంటీఎస్ –2 లైన్ కోసం స్టేషన్ తూర్పు వైపున విస్తరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఈ స్టేషన్ అభివృద్ధికి రైల్వేశాఖ నిధులు కేటాయించిన దృష్ట్యా అమృత్‌భారత్ పథకం కింద పడమర వైపున కూడా స్టేషన్ అభివృద్ధి చేస్తామని, టెండర్లు కూడా పిలుస్తామని చెప్పారు. ప్లాట్‌ఫామ్‌ల పైకప్పు నిర్మాణం, ప్రధాన ముఖద్వార అభివృద్ధితో పాటు స్టేషన్ భవనాన్ని మెరుగుపరచనున్నట్టు తెలిపారు. ఎంఎంటీఎస్‌తోపాటు, స్టేషన్ అభివృద్ధి వల్ల యాదాద్రికి భక్తులు అతి తక్కువ చార్జీల్లోనే వెళ్లవచ్చన్నారు.

డీపీహెచ్ పరిధిలో కొత్తగా 33 పోస్టులు

- హైదరాబాద్‌లో మరో 5 డీఎంహెచ్‌వోలు
- కేబినెట్ నిర్ణయం మేరకు మంజూరు

సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) పరిధిలో కొత్తగా 33 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో ఐదు డీఎంహెచ్‌వోలతో పాటు డీపీహెచ్ రాష్ట్ర కార్యాలయానికి సంబంధించిన 28 పోస్టులు ఉన్నాయి. ఈ మేరకు ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా మంజూరు చేసిన డీఎంహెచ్‌వోలన్నీ హైదరాబాద్ జిల్లా పరిధిలోనివే. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని మొత్తం డీఎంహెచ్‌వోల సంఖ్య 38కి పెరగనుంది. సుమారు కోటి జనాభా ఉన్న హైదరాబాద్‌లో ఒక్క డీఎంహెచ్‌వో పోస్టుతో పర్యవేక్షణ కష్టంగా మారిందని, జీహెచ్‌ఎంసీ తరహాలో ఆరు జోన్లకు ఒక్కో డీఎంహెచ్‌వోను నియమించాలని గత మే 19న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. కొత్తగా మంజూరు చేసిన పోస్టులతో రాష్ట్రంలో వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంపై పర్యవేక్షణ పెరుగుతుందని, వ్యాధుల నివారణ, నియంత్రణ, చికిత్స ప్రక్రియలు మెరుగుపడి, అన్ని స్థాయిల్లో మెరుగైన వైద్యం అందుతుందని ట్వీట్ చేశారు.

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ: వైద్యారోగ్య శాఖలో కారుణ్య నియామకాల కోసం 1,266 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో ఉండగా మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1266 దరఖాస్తులు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. వీరికి పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను సూపర్ న్యూమరీ కింద జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసింది. జిల్లాల వారీగా జాబితాను విడుదల చేసింది. ఈ పోస్టులను భర్తీ చేసే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించింది.

కొత్తగా మంజూరైన పోస్టుల వివరాలు...

- అడిషనల్ డైరెక్టర్ (అడ్మిన్) –1
- జాయింట్ డైరెక్టర్ (అడ్మిన్) – 1
- డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) –1
- అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్- స్టేట్ క్యాడర్) – 3
- అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (స్టేట్ క్యాడర్) – 4
- ఆఫీస్ సూపరింటెండెంట్ – 6
- సీనియర్ అసిస్టెంట్ – 12
- డీఎంహెచ్‌వో – 5
- కారుణ్య నియామకాల కోసం 1266 పోస్టుల అప్‌గ్రేడ్

మూడో 'దోస్త్'లో 72 వేల సీట్లు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా మూడో విడతలో 72,949 డిగ్రీ సీట్లను గురువారం కేటాయించినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. 55,313 మంది విద్యార్థులకు వారు ఇచ్చిన మొదటి ప్రాధాన్యత ప్రకారం సీట్లు కేటాయించామన్నారు. రెండో ప్రాధాన్యత కింద 17,636 మందికి సీట్లు కేటాయించామన్నారు. మూడో దశలో 63,484 మంది కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 79,356 మంది ఆప్షన్లు ఇచ్చారు.

ఏ గ్రూపులో ఎన్ని సీట్ల కేటాయింపు?

గ్రూపు	సీట్ల కేటాయింపు
ఆర్ట్స్	10,939
కామర్స్	32,209
లైఫ్ సైన్సెస్	16, 859
ఫిజికల్ సైన్సెస్	12,620
డి ఫార్మసీ	235
ఇతర గ్రూపులు	87

ఆగస్టు 1 నుంచి ప్రత్యేక దశ ప్రవేశాలు

ఆగస్టు 1వ తేదీ నుంచి స్పెషల్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని ఉన్నత విద్యా మండలి తెలిపింది. స్పెషల్ అడ్మిషన్ల ప్రక్రియకు ఆగస్టు 11 వరకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, 12వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చని, 16వ తేదీన సీట్లు కేటాయిస్తారని తెలిపింది. ఆగస్టు 19వ లోగా సీట్లు పొందిన ప్రతీ విద్యార్థి కాలేజీలో రిపోర్టు చేయాలని సూచించింది.

ఓఆర్ఆర్‌ను ఏ ప్రాతిపదికన అప్పగించారు?

- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతలను 30 ఏళ్లపాటు ఏ ప్రాతిపదికన ప్రైవేట్ కంపెనీకి అప్పగించారో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) డైరెక్టర్‌తోపాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. 30 ఏళ్లపాటు ఓఆర్ఆర్ నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతల టెండర్‌ను రూ.7,380 కోట్లకు ఓ కంపెనీకి అప్పగించడంలో పారదర్శకత లేదంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ టెండర్‌ను ఐఆర్‌బీ కంపెనీ దక్కించుకున్న విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కనుగుల మహేశ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ప్రాథమిక అంచనా రాయితీ విలువ ఎంత అనేది వెల్లడించకుండా హెచ్‌ఎండీఏ, పురపాలక పరిపాలన-పట్టణాభివృద్ధి శాఖ కలసి ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే సంస్థతో ఒప్పందం చేసుకోవడం అక్రమమని పిటిషన్‌లో పేర్కొన్నారు. 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్‌ను టోల్- ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) విధానంలో నిర్వహించడానికి ప్రభుత్వం మే 28న కుదుర్చుకున్న ఒప్పందం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ఈ ఒప్పందానికి సంబంధించిన అంచనా విలువను వెల్లడించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఒప్పందం వాస్తవ పరిస్థితిని పరిశీలించేలా కాగ్‌కు ఆదేశాలు ఇవ్వాలని, ఒకవేళ ఒప్పందం విలువ తక్కువగా ఉందని కాగ్ నిర్ధారిస్తే లీజును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పుడే ఆదేశాలివ్వలేం..

ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇప్పటివరకు దీనికి సంబంధించిన జీవోలు విడుదల చేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. ప్రస్తుతం రోజువారీగా టోల్ ఫీజు రూ.88 లక్షల వరకు వసూలవుతోందని, ఈ లెక్కన 30 ఏళ్ల కాలానికి లెక్కిస్తే వేల కోట్ల రూపాయల ప్రజాధనం కంపెనీ పాలవుతుందన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్‌లో ప్రజాప్రయోజనం ఏమీ లేదని, దురుద్దేశంతోనే దాఖలు చేశారని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రస్తుత దశలో ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని పిటిషనర్ తరఫు న్యాయవాదికి చెప్పింది.

ఆధారాలున్నాయ్.. తగ్గేదేలే!

కోర్టులో కలుద్దాం.. మంత్రి కేటీఆర్ ట్వీట్‌కు సుఖేశ్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై తాను చేసిన ఆరోపణలన్నింటికీ తన వద్ద ఆధారాలున్నాయని, తగ్గేదేలే.. అని సుఖేశ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేటీఆర్ లీగల్ నోటీసుకు స్పందిస్తూ.. తనని ఫ్రాడ్ అని సంబోధించినందుకు తాను కూడా పరువునష్టం దావా వేస్తానని, కోర్టులో కలుద్దామని స్పష్టం చేశారు. తాను చేసిన ఆరోపణలు అవాస్తవాలు అనిపించినప్పుడు మంత్రి కేటీఆర్ ధైర్యంగా సీబీఐ విచారణను స్వాగతించాలని సుఖేశ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీబీఐ విచారణ చేస్తే తాను చెప్పిన చాట్‌లు, రికార్డింగ్‌లు నిజమా? నకిలీవా అనే విషయం తేలుతుందని తెలిపారు. సుఖేశ్ ఆరోపణలపై స్పందిస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసిన విషయం విదితమే. దీనికి మనీలాండరింగ్ కేసులో మండోలి జైలులో ఉన్న సుఖేశ్ స్పందిస్తూ ఓ లేఖ రాశారు. దీనిని గురువారం తన న్యాయవాది ద్వారా విడుదల చేశారు. కేటీఆర్ పంపిన లీగల్ నోటీసును స్వాగతిస్తున్నట్లుతెలిపారు. తన ఫిర్యా దులు ఉపసంహరించుకొనేది లేదని తేల్చి చెప్పా రు. నిజం ఎప్పటికైనా బహిర్గతం అవుతుందన్నారు. సీబీఐకి తాను చేసిన ఫిర్యాదులు అన్నీ అసత్యాలని లీగల్ నోటీసులో పేర్కొన్నారని, మరి సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. సీబీఐ విచారణ జరిగితే నిజం బయట పడుతుందన్నారు. తానేవరో కేటీఆర్‌కు తెలియనప్పుడు సీబీఐ విచారణ స్వాగతించే ధైర్యం లేదా? అని ప్రశ్నించారు. తనని ఫ్రాడ్ అంటున్నారని.. కేటీఆర్, కవిత వారి పనుల కోసం ఉపయోగించుకున్నప్పుడు ఈ విషయం తెలియదా అని నిలదీశారు. కేటీఆర్ తనని ఆ విధంగా సంబోధించడం బాధాకరమని పేర్కొన్నారు. తన కేసుల గురించి వ్యాఖ్యానించే ముందు కేటీఆర్ పార్టీలోని సహచరులు డజన్ల కొద్దీ అవినీతి కేసులు ఎదుర్కొంటున్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. తనను క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ కోరారని, తానెందుకు క్షమాపణలు చెప్పాలని ఆ లేఖలో సుఖేశ్ ప్రశ్నించారు. కేటీఆర్ అహంకారాన్ని తన వద్దే ఉంచుకోవాలని, తనపై పనిచేయదని అన్నారు. ఏ విషయాన్నీ వ్యక్తిగతంగా తీసుకోవద్దని, కేటీఆర్ అంటే తనకెంతో గౌరవం, ప్రేమ ఉన్నాయని సుఖేశ్ తన లేఖలో పేర్కొన్నారు.

రైతుబంధు పూర్తిస్థాయిలో ఎప్పడిస్తారు?

సీఎంకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ సీజన్ మొదలై రైతులు పనులు ప్రారంభించినప్పటికీ రైతు బంధు కింద అన్నదాతలకు ఇప్ప టివరకు పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం అందలేదని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది రైతు బంధు నగదు కోసం ఎదురు చూస్తున్నందున రైతన్నల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు ఎప్పుడు పడతాయో చెప్పాలని ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎంకు బహిరంగలేఖ రాశారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే రైతు లతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్య మించనున్నట్లు కోమటిరెడ్డి వెల్లడించారు.

కాంగ్రెస్‌లో చేరిన గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు



జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు కండువా వేస్తున్న రేవంత్, చిత్రంలో ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ/గద్వాల రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నాయకురాలు సరితా తిరుపతయ్య దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన కార్యక్రమంలో సరితా తిరుపతయ్య కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ సునీల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవి దంపతులు, గట్టు సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు, ధరూరు మండలానికి సీనియర్ నేతలు రాఘవేంద్రరెడ్డి, సోము, మల్దకల్ మండలం సీనియర్ నేత అమరవాయి కృష్ణారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి వెంట ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఐటీలో మేటి హైదరాబాద్

- తమిళనాడు ఐటీ మంత్రి పలనివేల్ బృందంతో భేటీలో మంత్రి కేటీఆర్
- తెలంగాణ ఐటీ విధానాలపై అధ్యయనానికి హైదరాబాద్ వచ్చిన బృందం



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఐటీ నగరంగా హైదరాబాద్ ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక నెలకొన్న సందేహాలను పటాపంచలు చేస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ పటంలో నిలబెట్టినట్లు చెప్పారు. ఐటీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఐటీ పాలసీలపై 3 రోజులపాటు అధ్యయనం చేసేందుకు గురువారం హైదరాబాద్ విచ్చేసిన తమిళనాడు ఐటీ శాఖ మంత్రి పలనివేల్ త్యాగరాజన్ (పీటీఆర్) ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంత్రి కేటీఆర్‌తో సచివాలయంలో సమావేశమైంది. ఐటీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, ఐటీ పాలసీ, అనుబంధ పాలసీలు, పరిశ్రమ బలోపేతం కోసం తీసుకున్న నిర్ణయాలను ఈ సందర్భంగా కేటీఆర్ తమిళనాడు ప్రతినిధి బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఐటీ శాఖ ద్వారా రాష్ట్రంలోని యువతకు అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తూనే మరోవైపు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్ , మొబైల్, డిజిటల్ తదితర సేవల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. హైదరాబాద్‌తోపాటు ద్వితీయశ్రేణి నగరాలకు కూడా ఐటీ పరిశ్రమను విస్తరించాలన్న లక్ష్యంతో కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేట లాంటి పట్టణాలలో ఐటీ టవర్లను ఏర్పాటు చేశామని, ఈ టవర్లలో టాస్క్, టీ-హబ్, వీ-హబ్ వంటి ఉప కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తమిళనాడు ఐటీ శాఖ ప్రశంసలు

తెలంగాణలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషిపట్ల తమిళనాడు మంత్రి పీటీఆర్ బృందం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పాలసీలపట్ల ప్రశంసలు కురిపించింది. తమిళనాడు ఐటీ మంత్రిగా నూతన బాధ్యతలు చేపట్టిన తనకు ఈ పర్యటన ఉపయుక్తంగా ఉంటుందన్న నమ్మకాన్ని పీటీఆర్ వ్యక్తం చేశారు. ఇక్కడి ఆదర్శవంతమైన విధానాలను తమిళనాడులో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్ల బాధ్యతల స్వీకారం

- గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా రజనీ సాయిచంద్
- స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా భిక్షపతి
- ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తన్వీర్



బాధ్యతల స్వీకరణ సమయంలో భావోద్వేగానికి గురైన రజనీ సాయిచంద్



భిక్షపతిని అభినందిస్తున్న హరీశ్



బాధ్యతలు సీకరిస్తున్న తన్వీర్

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ సంస్థల కార్పొరేషన్ల చైర్మన్లుగా ఇటీవల నియమితులైన ముగ్గురు నేతలు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మంత్రులు తలసాని, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కవిత తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా వేద రజనీ సాయిచంద్, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌గా మఠం భిక్షపతి, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మొహమ్మద్ తన్వీర్ బాధ్యతలు స్వీకరించారు. కష్టపడి పనిచేస్తే పదవులు వాటంతటవే వస్తాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మఠం భిక్షపతి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

నేడు సీఎంఆర్‌పై సీఎం సమీక్ష

సాక్షి, హైదరాబాద్: ధాన్యం దిగుబడికి అనుగుణంగా మిల్లింగ్ చేయని కారణంగా ఉత్పన్నమవుతున్న సమస్యలపై సీఎం కేసీఆర్ శుక్రవారం సమీక్షించనున్నారు. రాష్ట్రంలో ఏటా కోటి మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం మిల్లులకు చేరుతోంది. అయితే మిల్లర్లు సకాలంలో ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించడం లేదు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు విక్రయిస్తూ, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. కేంద్ర ప్రభుత్వం పంపిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌నే మిల్లుల్లోని బియ్యంలో మిక్స్ చేస్తుంటే, ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యత బాగాలేదని తిరస్కరించడాన్ని మిల్లర్లు తప్పుపట్టారు. సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐతో ఒప్పందం తెగదెంపులు చేసుకుంటామని మిల్లర్లు తెగేసి చెప్పారు. మంత్రి గంగుల కమలాకర్ గురువారం సచివాలయంలో ఐటీ మంత్రి కేటీఆర్‌ను కలిసి మిల్లర్ల సమస్యపై సమాలోచనలు జరిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శుక్రవారం సమావేశమయ్యేందుకు నిర్ణయించారు. మంత్రి గంగుల కమలాకర్, కమిషనర్ అనిల్‌కుమార్‌లు ఈ సమావేశంలో పాల్గొంటారు. కాగా, ప్రభుత్వమే జపాన్ కంపెనీ సెటాకీ సహకారంతో 60 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో మిల్లులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

'సివిల్స్'తో ప్రజా సేవకు అవకాశం

బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, బుర్రా వెంకటేశం



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుర్రా వెంకటేశం

లాలాపేట: ప్రజా సంక్షేమానికి అవసరమైన విధానాలను రూపొందించి వారికి సేవ చేస్తూ గౌరవాన్ని పొందే అవకాశం కేవలం సివిల్ సర్వీసెస్‌లోనే లభిస్తుందని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సివిల్స్ విజేతలతో ముఖాముఖి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో దేశంలోనే అత్యున్నతమైన సివిల్ సర్వీస్ సాధించాలన్న లక్ష్యాన్ని ఎంచుకుని గమ్యాన్ని చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ఏడాది సివిల్స్ టాపర్స్‌లో గురుకుల విద్యా సంస్థల విద్యార్థులు ఉండటం అభినందనీయమన్నారు. గురుకుల విద్య అత్యున్నతమైన క్రమ శిక్షణ ఇస్తుందనేందుకు వారే నిదర్శనం అన్నారు. తాను బీసీ గురుకులంలో ప్రాథమిక విద్య, ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి ఎన్నో అవరోధాలను అధిగమించి సివిల్స్ సాధించినట్లు తెలిపారు. నేడు కొందరు యువత పేదరికాన్ని సవాల్ చేస్తూ సివిల్స్ టాపర్స్‌గా నిలవడం వారి నిబద్ధతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రతిభావంతులకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్స్, గ్రూప్స్‌కు కోచింగ్ అందిస్తుందన్నారు. ఇందుకోసం ఓయూలో ప్రత్యేకంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్టడీ సర్కిల్ రూపొందించిన కెరియర్ గైడెన్స్ కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ చింత గణేష్ మాట్లాడుతూ సివిల్స్ సాధించాలనే ఆసక్తి ఉన్నవారికి ఉస్మానియా యూనివర్సిటీ అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఓయూ యూజీసీ డీన్ ప్రొ. మల్లేశం మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదన్నారు. తాను ఎంతో పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగానన్నారు. సివిల్స్‌లో 3 వ ర్యాంక్ సాధించిన ఉమాహారతి, 35వ ర్యాంకర్ సాకేత్ కుమార్, 60వ ర్యాంకర్ సాయి ప్రణవ్, 94వ ర్యాంకర్ సాయికృష్ణ, 200 ర్యాంకర్, మరి కొందరు ర్యాంకర్లు మహేశ్ కుమార్, రేవయ్య, ప్రణీత్, హిమవంశీ, అపూర్వ తదితరులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఓ యూ విద్యార్థులు అడిగిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమం అనంతరం విశ్వసాహితీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మానాన్న అనురాగం డ్యాన్స్ కాంపిటీషన్‌లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమలలో ఓయూ ప్రొఫెసర్లు, బీసీ స్టడీ సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
ఆయనే ఖగోళాన్ని పైకెత్తి ఉంచాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 21 జూలై 2023

ఈసారైనా జనవాణి వింటారా?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడిగా, వేడిగా సాగుతాయని ఊహించినదే. అయితే మొదటి రోజే రానున్న నెల రోజులు ఎలా ఉండనున్నాయో అర్థమైపోయింది. అల్లరిమూకలు మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన పార్లమెంట్ ఉభయ సభలను తొలి రోజే కుదిపేసింది. పాలకులు సిగ్గుపడాల్సిన ఈ మణిపూర్ ఘటనపై పూర్తి స్థాయి చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభ, రాజ్యసభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. రెండున్నర నెలల పైగా మణిపూర్ అగ్నికీలల్లో దగ్ధమవుతున్నా మూగనోము వీడని పాలకులు సుప్రీమ్ కోర్ట్‌కో, ఓటర్లలో వెల్లువెత్తే నిరసనకో వెరచి ఎట్టకేలకు పార్లమెంట్ తొలి రోజున పెదవి విప్పారు. సభ సమావేశంలో ఉన్నా అక్కడ కాకుండా, మీడియా ఎదుట మాత్రం విచారం వ్యక్తం చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పగలిగారు. ప్రధాని సైతం సభలో మణిపూర్‌పై చర్చలో పాల్గొని జవాబివ్వాలని ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే, హోమ్ మంత్రి మాట్లాడతారని అధికారపక్షం ఆశ్వాసిస్తోంది. మొత్తానికి ఒక్క మణిపురే కాదు... ఢిల్లీలో ఎన్నికైన 'ఆప్' ప్రభుత్వాన్ని కాదని అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు దఖలు పరిచే ఆర్డినెన్స్, డేటా రక్షణ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) – ఇలా అనేక అంశాలు ఈ సమావేశాల్ని విమర్శల జడివానగా మార్చనున్నాయి.

ఆగస్ట్ 17 వరకు జరిగే వర్షాకాల సమావేశాల్లో అంతా సజావుగా సాగితే 17 రోజులు పార్లమెంట్ పని చేయాలి. ఈసారి శాసన నిర్మాణ అజెండాలో భాగంగా ఇప్పటికే పార్లమెంటరీ సంఘాలు పరిశీలించిన అటవీ, జీవావరణ వైవిధ్య చట్టసవరణ సహా 8 పెండింగ్ బిల్లులకు ఆమోదం పొందాలని ప్రభుత్వ ఆలోచన. అలాగే, వ్యక్తిగత డేటా భద్రత బిల్లు సహా కొత్తగా మరో 21 బిల్లులకు ఆమోదముద్ర వేయించాలనీ భావిస్తోంది. ముందుగా ప్రకటించిన వీటికి తోడు జాబితాలో లేనివాటినీ ప్రభుత్వం సభ ముందుకు తేవచ్చు. ముందుగా చెప్పకుండానే 2019 ఆగస్ట్ 5న రాజ్యసభలో జమ్ము–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును పాలకపక్షం ప్రవేశపెట్టిన అనుభవం ఉంది. కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయనగా పార్లమెంట్ కీలక చట్టాలు చేయడం కొంత కాలంగా జరుగుతున్నదే. 2019 ఎన్నికలకు ముందు 2018 వర్షాకాల సమావేశాల్లో ఆర్థిక నేరగాళ్ళ ఆస్తుల స్వాధీనం చట్టాన్నీ, 2014 ఎన్నికలకు ముందు 2013 వర్షాకాల సమావేశాల్లో జాతీయ ఆహార భద్రత చట్టాన్నీ నాటి పాలకపక్షాలు చేశాయి. ఈసారి అలాగే యూసీసీ ప్రస్తావనకు రావచ్చు.

వరదలు, అధిక ధరలు, రైళ్ళ భద్రత సహా అనేక అంశాలున్నాయి. కానీ, పరస్పరం పైచేయి కోసం ప్రయత్నిస్తున్న అధికార, ప్రతిపక్షాల మధ్య పార్లమెంట్‌లో ప్రజాసమస్యల ప్రస్తావన, వాటిపై సరైన చర్చ ఎంత వరకు ఉంటాయనే అనుమానం కలుగుతోంది. మహిళలపై అమానుష ఘటనలో 48 రోజుల తర్వాత కానీ మణిపూర్‌లో పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదంటే, సామూహిక అత్యాచార నిందితులు పాతికమందిలో ఒక్కరి అరెస్టుకే 77 రోజులు పట్టిందంటే ఏమనాలి? మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార పార్టీ ఎంపీ నిష్పూచీగా, నిర్లజ్జగా తిరుగుతుంటే ఏం చేయాలి? పాలకుల ఈ నిర్లిప్తతనూ, నిష్క్రియాపరత్వాన్నీ కచ్చితంగా నిలదీయాలి. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చేయాలంటూ ప్రభుత్వాన్ని వంచి, ఒప్పించాలి. కానీ, అందుకోసం షరా మామూలుగా సభ కార్యకలాపాల్ని అడ్డుకొంటే లాభం లేదు. వేర్వేరు మార్గాల ద్వారా సభలోనే పాలకవర్గాన్ని నిలదీసి, జవాబివ్వక తప్పనిస్థితిలోకి నెట్టవచ్చు. కార్యాచరణకు దిగేలా చూడవచ్చు. దీనికి ప్రతి పక్షాల మధ్య ఐక్యత, ఎప్పటికప్పుడు ముందస్తు వ్యూహరచన తప్పనిసరి. పరస్పర వైరుధ్యాల మధ్య కూడా అనివార్యతతో ఇటీవలే 'ఇండియా' పేరిట ఎన్నికల కూటమి కట్టిన 26 ప్రతిపక్షాల్లో అలాంటి సభా సమన్వయం ఏ మేరకు ఉంటుందో చూడాలి.

అర్థవంతమైన చర్చలకూ, ప్రజాసమస్యల పరిష్కారాలకూ వేదిక కావాల్సిన ప్రజాస్వామ్య దేవాలయం కొన్నేళ్ళుగా పలు దుస్సంప్రదాయాలకు మౌనసాక్షిగా మిగలాల్సి వస్తోంది. ప్రస్తుత లోక్‌సభ అయిదేళ్ళ కాలపరిమితి 2024 ప్రథమార్ధంలో ముగిసిపోనుంది. రాజ్యాంగ విహితమైన డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండానే ఇంతకాలంగా అధికారపక్షం చక్రం తిప్పుతోంది. ఇది మన పార్లమెంటరీ చరిత్రలోనే కనివిని ఎరుగనిది. మరి ఈ సమావేశాల్లోనైనా ఉప సభాపతి ఎన్నికకు పాలకపార్టీ ఊ కొడుతుందా అంటే చెప్పలేం. సంఖ్యాబలం ఉందని అధికార పక్షం, ప్రభుత్వానికి ముందరి కాళ్ళకు బంధం వేయాలని ప్రతిపక్షాలు ప్రదర్శిస్తున్న మంకుపట్టు కారణంగా చర్చలు, సంప్రతింపులు అటకెక్కాయి. పెద్దగా చర్చలేమీ లేకుండానే అనేక బిల్లులు మూజువాణీ ఓటుతో చట్టాలైపోతున్న శోచనీయమైన పరిస్థితులు చూస్తున్నాం. వాకౌట్లు, సస్పెన్షన్లతోనే సమావేశాలు తూతూ మంత్రంగా నడిచి, మమ అనిపిస్తున్నాయి. ఇది దేశానికి మంచిది కాదు. ప్రజాస్వామ్యానికి తల్లి లాంటివాళ్ళమని జబ్బలు చరుచుకొనేవారు ఇకనైనా కళ్ళు తెరవాలి. అలాగే, పార్లమెంట్ సజావుగా సాగడం అధికార, ప్రతిపక్షాల సమష్టి బాధ్యత. నిమిషానికి రూ. 2.5 లక్షల వంతున వెచ్చిస్తున్న ప్రజాధనం వృథా కానివ్వరాదని ప్రజాప్రతినిధులు స్ఫురణలో ఉంచుకోవాలి. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మరొక్కసారి శీతకాలంలో మాత్రమే పూర్తిస్థాయి పార్లమెంట్ సమావేశాలకు వీలుంటుంది. కాబట్టి, ఈసారైనా మన పార్లమెంట్ అంకగణితపు లెక్కల కన్నా అత్యవసర అంశాలపై కనీసపాటి చర్చకు వేదిక కావాలి. ప్రజాస్వామ్యానికి అదే అసలైన ధన్యత.

కొంచెం నెమ్మదిస్తేనే... నిలవగలం!

విశ్లేషణ



డా॥ శ్రీనాథ్ శ్రీధరన్

గడచిన శతాబ్దాల్లో మనిషి అనూహ్యమైన ప్రగతి సాధించాడు. బొగ్గు, వంటగ్యాస్, సహజ వాయువుల శక్తిని ఒడిసిపట్టి, ఇంధన విప్లవం సాధించడంతో సమాజం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టింది. ఆర్థిక అభివృద్ధి అనేది సామాజిక ఆకాంక్షలు పెరిగేందుకు దోహదపడింది. అదే సమయంలో మానవజాతి భవిష్యత్తు కూడలికి చేరింది. అభివృద్ధి వెంట పరుగులు పెట్టడాన్ని సమీక్షించుకోవాల్సిన సమయం వచ్చింది. మానవజాతి మరిన్ని కాలాలు మనుగడ సాగించాలంటే ఈ ఆలోచన, సమీక్ష అత్యవసరం. అభివృద్ధితో వచ్చిన ఆధునిక జీవనశైలి పర్యావరణాన్ని మాత్రమే ప్రభావితం చేయడం లేదు. మన మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిగత సంక్షేమాన్ని... మొత్తమ్మీద మన జీవితపు నాణ్యతను దెబ్బతీస్తోంది.

ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కేన్స్ చెప్పినట్లు, మనిషి జీవన ప్రమాణం కొన్ని వేల ఏళ్లపాటు స్తబ్దుగానే ఉండింది. శిలాజ ఇంధనాల వాడకం మొదలుకావడం అంటే 18, 19వ శతాబ్దం నుంచే దీంట్లో పెను పురోగతి మొదలైంది. బొగ్గు, వంటగ్యాస్, ముడిచమురు అందుబాటులోకి రావడం మన జీవితాలను సమూలంగా మార్చేసిందనడంలో అతిశయోక్తి లేదు. దశాబ్దాల్లోనే సగటు ఆయుష్షు రెట్టింపు అయ్యింది. వేల కిలోమీటర్ల దూరాన్ని గంటల్లో దాటేయగలుగుతున్నాం. ప్రపంచం మూలమూలల్లోని వారితోనూ సమాచార వినిమయం చిటికెలో జరిగిపోతోంది. వృద్ధి చెందుతున్న టెక్నాలజీ, దాని పరిణామాలూ ప్రపంచ రూపురేఖలను మార్చేశాయి అనడంలో సందేహం లేదు. కానీ ఈ అనూహ్య వేగానికి మనం మూల్యం కచ్చితంగా చెల్లిస్తున్నాం.

మరింత ఎక్కువ ఉత్పత్తి చేయాలి... అది కూడా సమర్థంగా జరగాలన్న ఆదుర్దా మనల్ని మనం సమీక్షించుకునే, విమర్శించుకునే... ప్రకృతితో మనకున్న సంబంధాన్ని మదింపు చేసుకునే సమయమూ ఇవ్వడంలేదు. పైగా... వలసలు, మనిషి చలనశీలతలకు ముడిపడి ఉన్న రాజకీయ సవాళ్లు కూడా కాలంతోపాటు సంక్లిష్టమవుతూ పోయాయి. ఇప్పుడు ప్రయాణమూ సులువే, పెద్ద ఎత్తున వలస వెళ్లిపోవడమూ సులభమే. వీటి ప్రభావం వనరులపై పడుతోంది. వలస వెళ్లిన ప్రాంతాల సంస్కృతులతో ఘర్షణలకు కారణమవుతున్నాయి. సామాజిక సమన్వయమూ దెబ్బతింటోంది. సరిహద్దులు పలుచనైపోయి ప్రపంచం కుంచించుకుపోతున్న కొద్దీ పరిస్థితులు మరింత ముదురుతున్నాయి. అందుకే ఒక క్షణం ఆగి ఈ సవాళ్లను దీర్ఘాలోచనలతో, సమతుల దృష్టితో పరిష్కరించాల్సి ఉంటుంది.

సుస్థిరత–అభివృద్ధి

మనిషి శతాబ్దాలుగా ఇంధన వినియోగమనే వ్యసనానికి బానిస. శిలాజ ఇంధనాలు మనల్ని ముందుకు పోయేలా చేసినా ప్రపంచాన్ని వాతావరణ మార్పుల అంచున నిలబెట్టింది కూడా ఇవే. సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు పెద్దపీట వేయాల్సిన సమయం ఇదే. అయితే ఈ మార్పు జరగాలంటే గనుల తవ్వకాలు, నిర్మాణాల అవసరం చాలా ఎక్కువగా ఉంటుందన్నది విమర్శకుల ఆలోచన. పర్యావరణ అనుకూల టెక్నాలజీల కోసం అవసరమైన రాగి, నికెల్, కోబాల్ట్, ఇతర ఖనిజాలు మన అవసరాలకు తగినన్ని ఉన్నాయా? అని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యల్లో కొంత నిజం లేకపోలేదు. కానీ.. మనిషి తన సృజనాత్మకతతో వీటిని అధిగమించడం పెద్ద కష్టమూ కాదు. భూమిలో ఈ అత్యవసరమైన లోహాలు తగినన్ని ఉన్నాయని ఇటీవలి అధ్యయనాలు స్పష్టం చేసిన విషయాన్ని ఇక్కడ చెప్పుకోవాలి. కాకపోతే వీటి శుద్ధీకరణ పద్ధతులు మాత్రం సమస్యాత్మకమైనవి. వీటిని అధిగమించడమూ కష్టమేమీ కాదు. డిమాండుకు తగ్గట్టు సరఫరాలను పెంచగలిగే పెట్టుబడిదారీ వ్యవస్థను దృష్టిలో పెట్టుకుంటే ఈ సవాళ్లను ఎదుర్కోవడం కష్టమేమీ కాకపోవచ్చు. ఈ క్రమంలో పర్యావరణ, సామాజిక సమస్యలను విస్మరించడం సరికాదు. 'రేర్ ఎర్త్‌మెటల్స్' ఉత్పత్తిలో, గ్రీన్ టెక్నాలజీల్లో ముందువరసలో ఉన్న చైనాలో పర్యావరణ పరిస్థితి దిగజారిపోవడం, కాలుష్యం, కొన్ని వర్గాల సామాజిక బహిష్కరణ, ఆరోగ్య అంశాలు మనకు హెచ్చరికలుగా నిలవాలి.



ఇంకో కీలకమైన విషయం... పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే మన ఆలోచనా ధోరణుల్లోనూ మార్పులు రావాలి. సుస్థిరత అనేది అభివృద్ధికి అడ్డంకి కాదనీ, మెరుగైన భవిష్యత్తుకు మార్గమనీ గుర్తించాలి. పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధులకు పొంతన కుదరదన్న ద్వైదీభావం సరికాదని తెలుసుకోవాలి. నిజానికి పర్యావరణ అనుకూల విధానాలు ఆర్థిక వృద్ధిని పెంచుతాయనీ, నూతన ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందనీ అర్థం చేసుకోవడం ముఖ్యం. పునరుత్పాదక ఇంధన వనరులపైనే ఆధారపడి పనిచేసే కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఇదో మేలి అవకాశం.

జీవన విధానంలో నిదానం

పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు కాస్త నెమ్మదైన జీవన విధానమూ తోడైతే శిలాజ ఇంధనాల దుష్పరిణామాలను తగ్గించడం వీలవుతుంది. ప్రపంచంపై, సమాజంపై సరైన అవగాహన కలిగి ఉంటూ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి ఫలాలను అనుభవించడం అవసరం. అభివృద్ధి సాధించే ప్రయాసలో మన చర్యల పర్యవసానాలను గుర్తించి తదనుగుణంగా మనల్ని మనం మార్చుకోవడం కూడా అవసరం. ఆధునిక జీవితంపై మోజు తాత్కాలికంగా కొన్ని ప్రయోజనాలు కల్పించవచ్చునేమోగానీ... దీర్ఘకాలంలో భూమ్మీద మనిషి మనుగడ ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదముంది.

అభివృద్ధిని సాధించాలన్న వ్యామోహంలో ప్రస్తుతం 800 కోట్లు దాటిన మానవ జనాభాకు ఆహారం అందివ్వడం ఎలా అన్నది మరవకూడదు. మానవ మనుగడ కోసం మన వేగాన్ని తగ్గించుకోవాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ, అందరికీ ఆహార కల్పన అన్న అంశాల మధ్య సమతౌల్యత సాధించాలి. ప్రస్తుతం ఆహారాన్ని పండించడం అనేది ఒక పరిశ్రమలా సాగుతోంది. అయితే ఇందుకు పర్యావరణం మూల్యం చెల్లిస్తోంది. విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకం, అడవుల నరికివేతవంటివన్నీ పర్యావరణ వ్యవస్థలు, జీవవైవిధ్యతలు, భూమి సారాల విషయంలో చెడు ప్రభావం చూపాయి. సుస్థిరాభివృద్ధి కావాలంటే ఇదే పద్ధతిని కొనసాగించడం మంచిది కాదు.

నిదానమే ప్రధానము

అందరికీ ఆహారమన్న సవాలును ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహం అవసరం. ఆయా దేశాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గాలను వెతకాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం కల్పిస్తూ... వ్యవసాయ రంగంలో పరిశోధనలకు పెద్దపీట వేయాలి. వనరులు అందరికీ అందుబాటులో ఉండేలా అవకాశాలను కల్పించాలి. కాకపోతే ఇదో సంక్లిష్టమైన సవాలే. ఎన్నో సౌకర్యాలు కల్పించిన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలోనూ కొంచెం జాగరూకతతో వ్యవహరించాలి.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్లు భవిష్యత్తులో ఉద్యోగాలను తగ్గిస్తాయన్న ఆందోళన కూడా ఒకవైపు ఏర్పడుతోంది. ఈ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించాలి. విద్యపై పెట్టే పెట్టుబడులు పెరగాలి. అదే సమయంలో కొత్త టెక్నాలజీల గురించి అందరికీ శిక్షణ ఇచ్చేందుకూ ఏర్పాట్లు కావాలి. విధానాల ద్వారా సామాజిక అసమతుల్యతలను రూపుమాపే ప్రయత్నం జరగాలి. విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆధునిక జీవనశైలి పర్యావరణాన్ని మాత్రమే ప్రభావితం చేయడం లేదు. మన మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిగత సంక్షేమాన్ని... మొత్తమ్మీద మన జీవితపు నాణ్యతను దెబ్బతీస్తోంది. ఈ ఉరుకుల జీవితాన్ని కాస్త మందగింపజేస్తే ఆత్మవిమర్శకు అవకాశం ఏర్పడుతుంది. మానసిక, భావోద్వేగ సంక్షేమాలను మన ప్రాథమ్యాలుగా ఉంచుకుని పనిచేసేందుకు పనికొస్తుంది. ఆందోళన సంబంధిత ఆరోగ్య సమస్యలు తగ్గించేందుకు వీలేర్పడుతుంది. ప్రాపంచిక సౌఖ్యాల వెంబడి పరుగులో సామాజిక బంధాలను దాదాపుగా విస్మరించాం. బంధుత్వాలు, సహానుభూతి, మానవ సంబంధాలను మరోసారి ఆచరించేందుకు, కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తుంది.

వ్యాసకర్త కార్పొరేట్ సలహాదారు, 'టైమ్ ఫర్ భారత్' రచయిత
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇంత ఘోరమా?



మణిపూర్‌లో మహిళల పట్ల జరిగింది అత్యంత అసహ్యకరమైనది. ఇంకా దిగ్భ్రాంతికరమైనది, ఈ 2023లో కూడా పూర్తి వార్త ఘటన జరిగిన రెండున్నర నెలల తర్వాత తెలియడం! వార్తలు కవర్ చేయడానికి మీడియా భూమ్మీద ఎక్కడికైనా వెళ్తుంది, ఈశాన్య భారతానికి తప్ప!

– సాగర్, రచయిత

మనుషులు కాదా?



నిజం చెప్పాలంటే, ఇంకొకరి మీద ఆధిపత్యం సాధించడానికి మహిళలను ఉపకరణాలుగా వాడటం ఇంకా కొనసాగుతూనే ఉంది. అది కశ్మీర్‌లో చూశాను. రాజస్థాన్, బెంగాల్‌లలో చూశాను. ఇప్పుడు మణిపూర్. ఇది ఎప్పుడు ఆగుతుంది?

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

ఒకటే పరిష్కారం



ఏకైక ఆచరణీయ చర్య: మణిపూర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలి. రాష్ట్రపతి పాలన విధించాలి. కనబడితే కాల్చివేత ఆదేశాలతో ఇంఫాల్‌కు సైన్యాన్ని పంపాలి.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి


వ్యతిరేక ఫలితం



కృత్రిమ మేధ(ఏఐ)కు వ్యతిరేకంగా చేస్తున్న హాలీవుడ్ సమ్మె, ఆ కృత్రిమ మేధను హాలీవుడ్‌లో మరింత వేగంగా వాడేలా చేస్తుంది. చరిత్రలో ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎప్పుడూ ఆపలేకపోయారు. కృత్రిమ మేధతో పోరాడే ఏకైక మార్గం... నిరోధించకుండా దాన్ని వాడటమే!

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

అరుదైన నటుడు




యాభై ఏళ్ల క్రితం ఈ రోజున (జూలై 20) చనిపోయిన బ్రూస్ లీని తలుచుకుంటున్నాను. అప్పుడాయనకు కేవలం 32 ఏళ్లు. చిట్టచివరి విశ్రాంత స్థలానికి ఆయన శవపేటికను మోసుకెళ్లిన వాళ్లలో (హాలీవుడ్ దిగ్గజ నటులు) స్టీవ్ మెక్‌క్వీన్, జేమ్ కోబమ్ లాంటి వాళ్లున్నారు.

– మైకేల్ వార్‌బర్టన్, నటుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మానవత్వం మంటగలుస్తోంది...

సందర్భం



ఎమ్.డి. మునీర్

కేంద్రం మీద దేశం కోపంగా ఉంది. 79 రోజులుగా మణిపూర్ మండి పోతున్న నేపథ్యంలో మే 3 నుంచి వరుసగా హింసాత్మక ఘటనలు జరుగుతున్నప్పటికీ పీఎం నరేంద్ర మోదీ నోరు తెరవలేదు, కనీసం శాంతి సందేశం కూడా ఇవ్వలేదు. అటు కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికలు జరగాల్సి ఉన్న రాష్ట్రాల్లో పర్యటించారు. అమెరికా, ఫ్రాన్స్ వెళ్లి వచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్యం ఉన్న పార్టీ నేతల మీటింగ్‌లలో పాల్గొన్నారు. అయినా ఎక్కడా మణిపూర్ ముచ్చట ఎత్తలేదు. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ మణిపూర్ వెళ్లి బాధితులను పరామర్శించి వచ్చారు. వారి సమస్యలు విన్నారు.

ఈ నేపథ్యంలో మే నెలలో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన సంఘటన జరిగిందని తెలిపే వీడియో ఇప్పుడు బయటకు వచ్చింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం, వారిపై అత్యాచారం చేసినట్లు ఈ వీడియో చెబుతోంది. ఇదంతా జరిగే సమయంలో పోలీస్‌లు అక్కడ ఉన్నట్లు కూడా కనిపిస్తున్నది. ఈ సంఘటనను సుప్రీం కోర్ట్ సుమోటోగా స్వీకరించింది. వచ్చే శుక్రవారం లోపు కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలనీ, అలా తీసుకోని పక్షంలో తానే రంగంలోకి దిగవలసి వస్తుందనీ తీవ్రంగా హెచ్చరించింది. పీఎం నరేంద్ర మోదీ మొదటిసారి మణిపూర్ పరిస్థితులపై ఈ సంఘటనను ఖండిస్తూ చివరకు నోరు విప్పారు. 79 రోజుల తర్వాత మణిపూర్ గురించిన ఈ ఒక్క సంఘటన మీద మాట్లాడుతూ నిందితుల మీద చర్యలు ఉంటాయి అన్నారు. తాను ఆ వీడియో చూసి తీవ్ర ఆక్రోశానికీ, ఆందోళనకూ గురి అయ్యానని పేర్కొంటూనే, మణిపూర్ అయినా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అయినా... ఎక్కడ అయినా మహిళల మీద అకృత్యాలను సహించేది లేదని పేర్కొన్నారు. ఇంతే మాట్లాడారు. అసలు మణిపూర్‌లో చోటు చేసుకున్న సంఘటనల పరంపర మీద మాట్లాడలేదు. సుప్రీం కోర్ట్ భయంతో ఆమాత్రం పీఎం మాట్లాడినట్లు కనిపించింది. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ 'మహిళా కుస్తీ' బిడ్డలపై పాల్పడిన లైంగిక వేధింపుల పైనా ఏమీ మాట్లాడలేదనేదీ గమనార్హమే. రాజ్యసభలో విపక్షాలు మణిపూర్ విషయంగా ప్రభుత్వాన్ని తూర్పారబట్టాయి. పీఎం మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ఇతర విపక్షాలు పార్లమెంట్ బయట ఆందోళనకు దిగాయి.



ఇద్దరు మహిళలపై జరిగిన అవమానకర లైంగిక దాడికి సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీస్‌లు పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ జారీ అయ్యిందన్నారు. రెండు నెలలుగా మణిపూర్‌లో ఇంటర్నెట్ బంద్ ఉన్న కారణంగా ఈ సంఘటన బయటకు రావడానికి ఇంతకాలం పట్టింది. ఇన్ని రోజుల నుంచి మణిపూర్ మండి పోతుంటే శాంతి, భద్రతల కోసం కేంద్రం కానీ, రాష్ట్రం కానీ పక్కాగా ఏమీ చేయలేకపోయాయి.


'బేటీ బచావో, బేటీ బడావో, బేటీ పడావో' అంటూ మాట్లాడే బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో ఆదివాసీ ఆడపడుచులపై ఇటువంటి అకృత్యాలు ఎలా జరుగుతున్నాయి? ప్రధాని మోదీ అన్ని పార్టీల ప్రతినిధి వర్గాన్ని వెంట తీసుకొని ఇప్పటికైనా మణిపూర్ వెళ్లాలి. ఓట్ల కోసం కుల, మతాలకు అతీతంగా జీవిస్తున్న ప్రజలను విడదీయడం, వారి మధ్య వైరుధ్యాలు సృష్టించడం సరికాదు. ప్రపంచం అంతా ఇటువైపే చూస్తున్నదనే సంగతిని గమనంలో ఉంచుకోవాలి. ఇప్పటికే మణిపూర్‌లోని పరిస్థితులపై యూరోప్‌లో చర్చ జరుగుతోంది.

విద్వేష రాజకీయాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయో ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం గుర్తించాలి. దేశంలో ఇప్పుడు అత్యంత క్లిష్టమైన సమస్య మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దడమే. ఆ దిశగా వెంటనే ప్రధాని దృష్టి సారించాలి. కులాలు, మతాలు, జాతుల మధ్య విద్వేషాలు రేగితే ఎంతటి విపరిణామాలు సంభవిస్తాయో చెప్పడానికి ప్రస్తుత మణిపూర్ పరిస్థితి ఒక ఉదాహరణ. ముందు ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలకు భరోసా కలిగించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
మొబైల్: 99518 65223

నా తాన బంగ్లలున్నయి... మరి నీ తాన?

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ట్రాఫిక్‌తోని తొవ్వలు మెస్ల రాకుంటున్నయి. ఇంటికి పోబుద్దిగాని సర్కార్ జీతగాల్లు హోటల్ల గూసోని ముచ్చట్లు బెడ్తున్నరు. ఒక్కపారే సిటీ బస్సులు సోల్పుత బోతున్నయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. గా దాని మీద గీ దాని మీద అనకుంట అన్నిటి మీద మాట్లాడుతుంటరు. గని రాజకీయాల మీదనే ఎక్వ ముచ్చట బెడ్తరు. రాజకీయాల మీద ముచ్చట బెట్టుకుంట నువ్వెంత అంటె నువ్వెంత అనుకుంట మాటల తోనే కొట్లాడుతుంటరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏ మాట్లాడుకుండ్రో నా కెర్క లేదు. నేను బోయినంక గాల్లు గీ తీర్గ ముచ్చట బెట్టిండ్రు.

''ఇస్తారి పెండ్లాంకు బంగారి గొలుసు జేపిచ్చిండు. గని గామె నచ్చలే'' అని యాద్గిరి అన్నడు.

''రత్నాల గొల్సు జేపిచ్చేదుండె'' అని సత్నారి అన్నడు.

''గది గుడ్క జేపిచ్చిండు. గని గామె నచ్చలే.''

''ముత్యాల దండ జేపిచ్చేదుండె.''

''గది గుడ్క జేపిచ్చిండు. గని గామె నచ్చలే.''

''మల్ల ఏం జేపిస్తె గామె నచ్చింది?''

''సోంచాయించి, సోంచాయించి టమాటల తోని దండ జేపిచ్చిండు. గామె నచ్చింది.''

''ఒకడు నా పైంటు పది వేల రూపాయలు, బూట్లు ఐదు వేల రూపాయలు, పైతాపులు రొండు వేల రూపాయలు, అంగి మూడు వేల రూపాయలు అని జెప్పిండు.''

''ఇంతకు ఏం కొల్వు జేస్తున్నడు?''

''కొల్వు జేస్తలేడు. టమాటలు అమ్ముతున్నడు.''

''చంద్రయాన్ ఎందుకో ఎర్కేనా?''

''ఎందుకు?''

''గాడ టమాటలు పండుతయో లేదో ఎర్క జేస్కునేతందుకు.''

''మొన్న టమాటలతోని బోతున్న లారి కింద బడ్తె ఎవ్వలు టమాటలు ఎత్క బోకుంట పోలీసోల్లు కావలి గాసిండ్రు.''

''ఒల్సెన్ని రూపాయలు కర్సు జేసి ఎమ్మెల్యే టికిట్ దెచ్చుకుంటె పాయిద లేదు అని ఒక లీడరు అనుకుండు'' అని యాద్గిరి ఇంకేమొ జెప్పబోతుంటె – ''అనుకోని ఏం జేసిండు?'' అని సత్నారి అడిగిండు.

''టమాటాల యాపారం షురువు జేసిండు.''

''శాన మంది టమాటలు తినుడు బంద్ జేసింద్రు. ఎందుకు బంద్ జేసింద్రని అడిగితె ఏం జెప్పింద్రో ఎర్కేనా?''


''ఏం జెప్పింద్రు?''

''కొంతమంది టమాటలను గయల ఇడ్సి పెట్టినం అన్నారు. కొంతమంది పత్యమని జెప్పింద్రు.''

''గీ నడ్మ టమాటలు అమ్మెటోల్లు దర్న జేసింద్రు?''

''ఎందుకు జేసింద్రు?''

''గాల్లకు జడ్ సెక్యూరిటీ ఇయ్యాల్నని.''



''టమాటలు జెయ్యబట్కె సంసారాలల్ల మంటలు లేస్తున్నయి.''

''గదెట్ల?''

''మధ్యప్రదేశ్ల ఆలుమగలు ఒక హోటల్ నడిపిస్తున్నరు. మగడు పెండ్లాంతోని జెప్పకుంట ఒక కూరల రొండు టమాటలు ఏసిండు.''

''టమాటలు ఏస్తె మంచిదే గదా?''

''నీకు మంచిదేమొ గని గాయిన పెండ్లాంకు మండింది. నా కెర్క లేకుంట కూరల టమాటలు ఏస్తవా అని అల్గి ఆమె తల్లి గారింటికి బోయింది. మొగడు ఎంత బత్మిలాడినా ఇంటలేదు.''

''గీ నడ్మ టమాటర్ అని హిందిల ఒక సిన్మ దీసింద్రు. గా సిన్మల ఇద్దరు అన్నదమ్ములుంటరు. అన్న అమీర్. తమ్ముడు గరీబు. గాల్ల ఇద్దరి నడ్మ డైలాగులెట్లున్నాయంటె...''

''ఎట్లున్నయి?''

''నా తాన బంగ్లలున్నయి. బంగారముంది. మోటర్లున్నయి. నీ తాన ఏమున్నయి అని అన్న అడిగితె 'నా తాన టమాటలున్నయి' అని తమ్ముడంటడు.''

''ఒక లీడర్ స్పీచ్ గొడుతుంటె కొంతమంది రాల్లు, కోడిగుడ్లు ఏస్తె గాయిన ఏమన్నడో ఎర్కేనా?''

''ఏమన్నడు?''

''పుజాల్ల గివ్విటితోని ఎందుకు గొడ్తరు? కొడ్తె టమాటలతోని కొట్టుండ్రి అన్నడు.''

''ఇంకొక లీడర్ పెండ్లాం మొగని ఇజ్జత్ దీసింది. గామె ఏమన్నదంటె...''

''ఏమన్నది?''

''గా లీడర్ స్పీచ్ గొడుతుంటె టమాటలతోని గొట్టింద్రు. నీకు పతార లేదు. నువ్వు స్పీచ్ గొడుతుంటె ఒక్కడు గుడ్క ఒక్క టమాట తోని కొట్టలేదు అని అన్నది.''

''అపొజిషన్ పార్టీలు మీటింగ్ బెట్టినయి. టమాటల తోనే బీజేపీ సర్కార్ను దించాలని గా మీటింగ్ల నిర్ణయం దీసుకున్నరు. అపొజిషన్ పార్టీలు జెయ్యబట్కె టమాట దరలు మొగులు మీదికి బోయినయని బీజేపీ అనబట్టింది'' అని యాద్గిరి అన్నడు.

''ఎన్డీఏల చిన్న టమాటలు, పెద్ద టమాటలు అనే ఫరక్ లేదు. అన్ని టమాటలు ఒక్కటే అని మోదీ అన్నడు.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.చవితి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మఖ ప.12.13 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.9.05 నుండి 10.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ఉ.12.32 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.350 నుండి 11.21 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.33.

రామోజీరావుపై చీటింగ్ కేసు

- మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్, లబ్బీపేట బ్రాంచి మేనేజర్, మరికొందరిపైనా కేసు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మార్గదర్శి చిట్స్‌లో మోసాలపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ యజమాని చెరుకూరి రామోజీరావు, ఎండీ శైలజ కిరణ్‌తో పాటు విజయవాడ లబ్బీపేట బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్, పలువురు సిబ్బందిపై ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గురువారం చీటింగ్ సహా ఇతర సెక్షన్లతో కేసు నమోదయింది. సక్రమంగా వాయిదాలు చెల్లించినా, చిట్‌లో పాడుకొన్న నగదు ఇవ్వకుండా మార్గదర్శి యాజమాన్యం నాలుగు నెలలుగా ఇబ్బందులు పెడుతోందని బాధితుడు, న్యాయవాది ముప్పి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 409 (క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), 420 (చీటింగ్), 120బి, సెక్షన్ 5 ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు వివరాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

గూగుల్ టేక్ అవుట్ తప్పు!

వివేకా హత్య కేసులో తుది చార్జ్‌షీట్‌లో మాటమార్చిన సీబీఐ

సాక్షి, అమరావతి : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ డొల్లతనం మరోసారి బట్టబయలైంది. ఈ కేసులో అత్యంత కీలకమైన ఆధారమంటూ గూగుల్ టేక్ అవుట్ పేరిట కొండను తవ్వినంత హడావుడి చేసిన సీబీఐ.. తుది చార్జిషీట్‌లో తోక ముడిచింది. ఇన్నాళ్లూ ఎంతో శాస్త్రీయ ఆధారమంటూ చెప్పుకొచ్చిన అంశంపైనే చివరికి చేతులెత్తేసింది. తాను గతంలో చార్జిషీట్లో పేర్కొన్న నిందితుడు సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ వివరాలు అంతా పొరపాటని అంగీకరించడం గమనార్హం. కాగా, ఈ కేసులో అరెస్టు చేసిన ఏ-6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి, ఏ-7 వైఎస్ భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయింది. కేవలం గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చూపిస్తూ వారిని అరెస్టు చేసిన సీబీఐ తుది చార్జిషీట్‌లో ఎలాంటి ఆధారం చూపించకపోవడం గమనార్హం. మరోవైపు షర్మిల తన చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి కడప ఎంపీ టికెట్‌ను ఆశించనే లేదని సీబీఐకి వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. తద్వారా ఎంపీ టికెట్‌కు అడ్డుగా ఉన్నందునే వివేకాను హత్య చేశారన్న అభియోగాల్లో వాస్తవం లేదన్నది తేటతెల్లమైంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ అధికారులు హైదరాబాద్‌లోని సీబీఐ న్యాయస్థానంలో బుధవారం తుది చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అభియోగాలకు సరైన ఆధారమేదీ తుది చార్జిషీట్‌లో సీబీఐ చూపించలేకపోయింది. వెరసి వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ఏనాడో దారి తప్పిందని.. కొందరి ప్రభావానికి గురై సీబీఐ అధికా రులు వ్యవహరిస్తు న్నారన్నది స్పష్టమైంది. వైఎస్సార్ కుటుంబంపై రాజకీయ దురుద్దేశంతో ఎల్లో మీడియా చేస్తున్న రాద్ధాంతం అంతా దుష్ప్రచారమేనన్నది తేలిపో యింది.

తూచ్.. అంతా ఉత్తిదే

కేసు దర్యాప్తులో కేంద్ర బిందువుగా పేర్కొన్న ప్రధాన సాక్ష్యాధారంపైనే సీబీఐ బొక్కబోర్లా పడింది. వివేకాను హత్య చేసిన నలుగురు నిందితుల్లో ఏ-2 సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాను సేకరించి ఈ కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించామని రెండేళ్లుగా చెబుతున్న సీబీఐ.. తుది చార్జిషీట్‌లో మాట మార్చింది. 'సునీల్ యాదవ్ 2019 మార్చి 14వ తేదీ రాత్రి వివేకానందరెడ్డి నివాసంలో ఉన్నాడు. అర్ధరాత్రి దాటాక 2.35 గంటలకు వివేకా నివాసం సమీపంలో, 2.42 గంటలకు నివాసం లోపల ఉన్నాడు. ఈ విషయాన్ని ఆయన మొబైల్ నంబర్ గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించాం' అని సీబీఐ ఇన్నాళ్లు చెబుతూ వచ్చింది. తాజాగా న్యాయస్థానంలో దాఖలు చేసిన తుది చార్జిషీట్‌లో అందుకు విరుద్ధంగా పేర్కొంది. 'సునీల్ యాదవ్ 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత వివేకానందరెడ్డి నివాసంలో లేరు. 2019 మార్చి 15న ఉదయం 8.05 గంటలకు వివేకా ఇంటి బయట, ఉదయం 8.12 గంటలకు ఇంటి లోపల ఉన్నాడు. గతంలో గూగుల్ టేక్ అవుట్ ద్వారా తెలుసుకున్నది గ్రీన్‌విచ్ కాలమానం ప్రకారం. కానీ ఏ దేశంలోనైనా స్థానిక కాలమానం ప్రకారమే చూడాలి. ఈ లెక్కన భారత కాలమానం ప్రకారం అంటే దానికి 5.30 గంటల సమయం కలపాలి. గతంలో పొరబడ్డాం' అని స్పష్టం చేసింది.

గూగుల్ టేక్ అవుట్ పేరిట బురిడీకి యత్నం!

కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు గూగుల్ టేక్ అవుట్ డేటా పేరిట సీబీఐ యత్నిస్తోందన్న సందేహాలు బలపడుతున్నాయి. వివేకా మరణించారనే విషయం 2019 మార్చి 15 ఉదయం 6.05 గంటలకే అందరికీ తెలిసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి కూడా వివేకా గుండెపోటుతో మరణించారని మీడియాకు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న వందలాది మంది ఉదయం 7 గంటలకే పులివెందులలోని వివేకా నివాసానికి చేరుకున్నారు. స్థానికులు ఆ విధంగా రావడం సహజం. ఆ తర్వాత 8 గంటల సమయంలో సునీల్ యాదవ్ అక్కడికి వచ్చారని సీబీఐ ప్రస్తుతం చెప్పడం గమనార్హం. ఆ రోజు వివేకా నివాసానికి చేరుకున్న వారిలో 248 మందిని సాక్షులుగా సీబీఐ అధికారులు విచారించారు. వారిలో ఎవరూ కూడా ఆ రోజు సునీల్ యాదవ్ అక్కడ ఉన్నట్టు చెప్పనే లేదు. గూగుల్ టేక్ అవుట్ పేరిట సీబీఐ ఉద్దేశ పూర్వకంగానే గందరగోళం సృష్టిస్తోందన్నది స్పష్టమవుతోంది.

ఒక్క ఆధారం లేదే..

గూగుల్ టేక్ అవుట్ డేటా అశాస్త్రీయతతోపాటు ఈ కేసులో సీబీఐ అరెస్టుల వెనుక డొల్లతనం కూడా తుది చార్జిషీట్‌లో బట్టబయలైంది. సీబీఐ హడావుడిగా అరెస్టు చేసిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిలకు వ్యతిరేకంగా కొత్తగా ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. వివేకా హత్యకు ముందు, తర్వాత సునీల్ యాదవ్ వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసానికి 30 సార్లు వచ్చినట్టుగా సీబీఐ గత చార్జిషీట్లో పేర్కొంది. అసలు సునీల్ యాదవ్ ముందు రోజు రాత్రి వివేకానందరెడ్డి ఇంట్లోనే లేరని తుది చార్జిషీట్‌లో పేర్కొంది. హత్య సమయంలో వివేకా ఇంట్లోలేని సునీల్ యాదవ్.. ఆ రోజు రాత్రి భాస్కర్‌రెడ్డి నివాసం నుంచి వివేకా నివాసానికి వెళ్లినట్టు, హత్య తర్వాత మళ్లీ వివేకా నివాసం నుంచి భాస్కర్‌రెడ్డి నివాసానికి వచ్చినట్టు ఎలా చెబుతుంది? ఈ లెక్కన గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించామన్న ఆ సమాచారం కూడా తప్పే కదా! కేవలం గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగానే వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం పూర్తిగా అసంబద్ధమన్నది స్పష్టమైంది. అదే గూగుల్ టేక్ అవుట్ ఆధారంగా గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేసినట్టు సీబీఐ చెప్పింది. వివేకా హత్య జరిగిన రోజు రాత్రి ఆయన తన ఇంటి నుంచి తొందరగా వెళ్లిపోయారని, మర్నాడు ఉదయం వివేకా ఇంటి వద్దకు వెళ్లారని చెప్పింది. కానీ ఆ రోజు రాత్రి ఉదయ్ కుమార్ రెడ్డి ఎక్కడ ఉన్నారన్నది మాత్రం సీబీఐ చెప్పనే లేదు. మర్నాడు వివేకా మరణించారని సమాచారం తెలిసిన తర్వాత వందలాది మంది ఆయన నివాసానినికి చేరుకున్నారు. తాను ఉదయం 8 గంటల సమయంలో అక్కడికి వెళ్లానని ఉదయ్ కుమార్‌రెడ్డే చెప్పారు. మరి దాన్ని ఏదో గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించినట్టు సీబీఐ చెప్పడం ఏమిటి? ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి మార్చి 15 ఉదయం వివేకా నివాసానికి చేరుకోవడానికి ముందే తాము అక్కడకు వెళ్లామని ప్రత్యక్ష సాక్షి సత్యనారాయణ చెప్పినట్టు తుది చార్జిషీట్‌లో ఉంది. అప్పటికే వివేకా గుండెపోటుతో మరణించినట్టు అక్కడ కొందరు మాట్లాడుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అంటే వివేకా గుండెపోటుతోనే మరణించారని మొదట బయటకు పొక్కిన సమాచారంతో భాస్కర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నది స్పష్టమైంది. ఏ విధంగానూ భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా సీబీఐ తుది చార్జిషీట్‌లో ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది.

మిగిలిన నిందితుల గూగుల్ టేక్ అవుట్ డేటా లేదా?

సీబీఐ ఎంతగా హడావుడి చేస్తున్నప్పటికీ గూగుల్ టేక్ అవుట్ డేటా శాస్త్రీయతమై మొదటి నుంచి నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అంతగా గూగుల్ టేక్ అవుట్ డేటా శాస్త్రీయమైనదని సీబీఐ భావిస్తే.. ఈ కేసులో మిగిలిన నిందితులు ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి మొబైల్ ఫోన్ల గూగుల్ టేక్ అవుట్ డేటాను సీబీఐ ఎందుకు సేకరించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. నలుగురు నిందితుల్లో ఒకరి డేటాను మాత్రమే సేకరించడం ఏమిటి.. మిగిలిన ముగ్గురి డేటాను విస్మరించడం ఏమిటన్నది కీలకంగా మారింది. ఆ సమాచారం శాస్త్రీయమైనదని సీబీఐ భావిస్తే హత్యలో పాలుపంచుకున్నారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నలుగురు నిందితుల మొబైల్ ఫోన్ల గూగుల్ డేటాను సేకరించి విశ్లేషించాలి. కానీ సీబీఐ అలా చేయకపోవడం సందేహాస్పదంగా మారింది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే సీబీఐ ఉద్దేశ పూర్వకంగానే ఇలా వ్యవహరిస్తోందని నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

చిన్నాన్న కడప ఎంపీ టికెట్ ఆశించనే లేదు

'మా చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేయాలని భావించలేదు. ఆయన ఎంపీ టికెట్ ఆశించలేదు' అని షర్మిల స్పష్టం చేశారు. 'కడప ఎంపీగా నన్ను పోటీ చేయమని చిన్నాన్న కోరారు. కానీ ఆ సమయంలో కడప జిల్లా రాజకీయాల పట్ల నేను ఆసక్తిగా లేను' అని తెలిపారు. ఈ మేరకు షర్మిల ఇచ్చిన వాంగ్మూలాన్ని సీబీఐ తుది చార్జిషీట్‌లో పొందుపరిచింది. దాంతో కడప ఎంపీ టికెట్ అంశంపై సీబీఐ ఇన్నాళ్లూ చేస్తున్న అభియోగాలు అవాస్తవం అని పరోక్షంగా తేలిపోయింది. వివేకానందరెడ్డి కడప ఎంపీగా పోటీ చేయాలని భావించారని, దీంతో ఎంపీ టికెట్‌కు అడ్డురాకుండా ఉండేందుకే ఆయన్ని హత్య చేశారన్న సీబీఐ అభియోగాల్లో నిజం లేదని నిగ్గు తేలింది. 2022 అక్టోబర్ 7న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి షర్మిల వాంగ్మూలం ఇచ్చారు. సీబీఐ అధికారులు అడిగిన 20 ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు. ఎన్నికలకు దాదాపు మూడు నెలల ముందు బెంగళూరులోని తన నివాసానికి వైఎస్ వివేకానందరెడ్డి వచ్చారని, 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా తనను పోటీ చేయమని కోరారని షర్మిల చెప్పారు. ఆ సమయంలో ఆసక్తిగా లేనని చెప్పానన్నారు. వివేకా ఎందుకు పోటీ చేయాలని భావించలేదని సీబీఐ అధికారులు ఆమెను ప్రశ్నించారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోవడంతో బహుశా ఆయన పోటీ చేసేందుకు సుముఖత చూపలేదని షర్మిల చెప్పారు. 2009లో తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఆదేశాలతో వివేకానందరెడ్డి తన తల్లి విజయమ్మపై పులివెందుల ఉప ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని షర్మిల గుర్తు చేశారు. బహుశా అందువల్ల తనకు టికెట్ రాదని ఆయన భావించి ఉండవచ్చని చెప్పారు.

మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి కన్నుమూత

ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ ప్రముఖుల సంతాపం

కైలాస్‌నగర్/ లక్డీకాపూల్/సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్‌కు చెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిల్కూరి రామచంద్రారెడ్డి (78) గురువారం కన్నుమూశారు. జ్వరం, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలతో ఈ నెల 18న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆయన కిడ్నీ సమస్యతో కూడా బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పరిస్థితి విషమించి సాయంత్రం 4.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరు గాంచిన ఆయన 1978లో స్వతంత్ర అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1985, 1989, 2004లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన మొత్తంగా నాలుగు పర్యాయాలు ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గా ప్రజలకు సేవలందించారు. ఉమ్మడి రాష్ట్రంలో 1990-92 కాలంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రివర్గంలో చిన్న నీటి పారుదల, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖకు ఇండిపెండెంట్ మంత్రిగా పనిచేశారు. ఆయన కృషి ఫలితంగానే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటైంది. కాగా, ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌కు తరలించారు.



సి.రామచంద్రారెడ్డి

మాజీ మంత్రి సి. రామచంద్రారెడ్డి మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. ఆదర్శవంతమైన రాజకీయాలతో ప్రజాదరణ పొందిన నేతగా ఆయన అందించిన స్ఫూర్తి గొప్పదని పేర్కొన్నారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ఆదేశించారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, విష్ణుదాస్, మన్సూర్ అలీఖాన్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకోవడంతో పాటు బరితెగించి ప్రజా, కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తపన్‌సేన్ మాట్లాడుతూ, జాతీయ సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తోందని విమర్శించారు. ప్రధాని పార్లమెంటులో ఇచ్చిన కనీస మద్దతు ధర హామీ నేటికీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఉద్యోగ భద్రత హక్కులకే కాకుండా దేశ ఆర్థిక స్వావలంబనకే ముంపు తెస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం



సదస్సులో మాట్లాడుతున్న తపన్‌సేన్

విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీవోలను అమలు చేయాలని, రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని, ఎలక్ట్రిసిటీ బిల్లు 2022ను వాపసు తీసుకోవాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనను విరమింపజేసుకోవాలని పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీని తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

క్లుప్తంగా...

కొండచరియల కింద 16 మంది సజీవ సమాధి



ముంబై: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖలాపూర్ తహశీల్‌లోని ఇర్షల్‌వాడి గ్రామంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాలతో రాళ్లు, బురద మట్టి గ్రామాన్ని కప్పేశాయని గురువారం ఘటనాస్థలిని సందర్శించిన సీఎం ఏక్‌నాథ్ షిండే తెలిపారు. గ్రామంలో 48 గిరిజన కుటుంబాలకు చెందిన మొత్తం 103 మంది నివసిస్తుండగా కొందరు పొలం పనులకు, వారి పిల్లలు రెసిడెన్షియల్ స్కూళ్లకు వెళ్లారని తెలిసిందన్నారు. సుమారు 20 అడుగుల మేర పేరుకుపోయిన రాళ్లు, బురదలో 17 ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇప్పటి వరకు 16 మృతదేహాలను వెలికితీశారని, మరో 21 మందిని సహాయక సిబ్బంది కాపాడారని చెప్పారు. రోడ్డు సౌకర్యం కూడా లేని ఆ కొండప్రాంతంలో భారీ వర్షం కొనసాగుతున్నందున సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. 2014లో పుణే జిల్లా మాలిన్ గ్రామంపై కొండచరియలు విరిగిపడిన ఘటనలో 50 గిరిజన కుటుంబాలకు చెందిన 153 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఢిల్లీ ఆర్డినెన్స్ పిటిషన్ రాజ్యాంగ బెంచ్‌కు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికార యంత్రాంగంపై నియంత్రణ తన పరిధిలోకి తీసుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. అయిదుగురు న్యాయమూర్తులున్న రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించాలంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాల డివిజన్ బెంచ్ సిఫారసు చేసింది. ఢిల్లీలో అధికారుల నియమకాలు, బదిలీలను తన అధీనంలోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ కేంద్రం, ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం మధ్య కొత్త వివాదాన్ని రేపిన విషయం తెలిసిందే. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దుని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన తర్వాత దీనిపై విచారణ చేపడుతుందని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది.



మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో గురువారం గిరిజన సంఘాల నిరసన

దోషులను వదిలిపెట్టం

- మణిపూర్ సంఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ హామీ
- దేశం యావత్తు తలదించుకునేలా చేసిన ఘటన ఇది అని ఆవేదన



న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. దోషులను వదిలిపెట్టేదిలేదని ప్రకటించారు. మే 4వ తేదీన జరిగిన ఈ దారుణ ఉదంతం 140 కోట్ల మంది భారతీయులను తలదించుకునేలా చేసిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు జరిగిన అవమానం గురించి తెలిశాక తన హృదయం బాధతో, ఆవేదనతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా మోదీ గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో శాంతి భద్రతలను కాపాడే యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళలకు తగిన భద్రత కల్పించాలని సూచించారు. శాంతిభద్రతలను పరిరక్షించే విషయంలో రాజీపడొద్దని, కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అమానవీయ ఘటన క్షమించరానిదని, దోషులను వదిలిపెట్టబోమని ప్రజలకు హామీ ఇస్తున్నానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, బిల్లులపై చర్చల కోసం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఎంపీలంతా పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కోరారు.

ఆరా తీసిన అమిత్ షా

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్‌తో మాట్లాడారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ఆరా తీశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆ వీడియోను తొలగించండి: కేంద్రం ఆదేశం

మణిపూర్‌లో చోటుచేసుకున్న దారుణ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఇద్దరు మహిళల పట్ల దుండుగులు రాక్షసంగా ప్రవర్తించిన వీడియో సోషల్ మీడియా వేదికల్లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోను వెంటనే తొలగించాలని ట్విట్టర్ సహా ఇతర సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. వీడియోను తొలగించాలంటూ ట్విట్టర్‌ను జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది. దోషులు మరణ శిక్షకు అర్హులని మణిపూర్ సీఎం బీరేన్ పేర్కొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగుల గుంపులో ఉన్న ఒక కీలకమైన వ్యక్తితోపాటు మరొక నిందితుడిని అరెస్టు చేసినట్లు మణిపూర్ పోలీసులు చెప్పారు. ఈ దారుణ సంఘటనకు సంబంధించిన వీడియోను సుమోటోగా దర్యాప్తునకు స్వీకరించారు. గుర్తుతెలియని సాయుధ దుండగులపై బుధవారం థౌబాల్ జిల్లాలోని నాంగ్‌పాక్ సెక్మాయ్ పోలీసు స్టేషన్‌లో అపహరణ, సామూహిక అత్యాచారం, హత్య కేసు నమోదు చేశారు. మరోవైపు నిందితుడు హెరాదేశ్ సింగ్ ఇంటిని గ్రామస్థులు దహనం చేశారు.

అసలేం జరిగింది?


మణిపూర్‌లోని కాంగ్‌పోక్‌పీ జిల్లాలో మే 3న రెండు తెగల ప్రజల మధ్య హింస జరిగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో మే 4న బి.ఫయనోమ్ గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో దాదాపు 1,000 మందితో కూడిన ఓ గుంపు బి.ఫయనోమ్ గ్రామంలోకి ప్రవేశించింది. దుండగులు గ్రామంలో ఇళ్లకు నిప్పుపెట్టారు. పశువులు, దుస్తులు, టీవీలు, ఫోన్లు.. ఇలా సర్వం దోచుకున్నారు. ఈ మూక ఐదుగురు వ్యక్తులపై దాడికి దిగింది. ఆ సమయంలో పోలీసులు సైతం అక్కడే ఉన్నారు. దాడిలో 56 ఏళ్ల వ్యక్తి, అతడి కుమారుడు మృతిచెందారు. ముష్కరులు అతడి కుమార్తెను(21), మరో మహిళను నగ్నంగా మార్చి, ఊరేగింపుగా పొలాల్లోకి తీసుకెళ్లారు. 21 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మణిపూర్‌లో మే నుంచి కొనసాగుతున్న ఇంటర్నెట్‌పై నిషేధాన్ని తాజాగా ఎత్తివేశారు. అప్పటి సంఘటనకు సంబంధించిన 26 సెకండ్ల వీడియో ఈ నెల 19న సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళలు ప్రస్తుతం చురాచాంద్‌పూర్‌లో శిబిరంలో ఉన్నారు.

మీవల్ల కాకపోతే మేమే రంగంలోకి దిగుతాం: సుప్రీంకోర్టు

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన అవమానాన్ని చూసి తాము తీవ్రంగా కలత చెందామని సుప్రీంకోర్టు వెల్లడించింది. మణిపూర్ ఘటనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తనంతట తానుగా గురువారం విచారణకు స్వీకరించింది. ప్రసార మాధ్యమాల్లో కనిపించిన వీడియోను చూస్తే మణిపూర్‌లో రాజ్యాంగ ఉల్లంఘన, మానవ హక్కులకు విఘాతం కలిగినట్లు స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంది. బాధిత మహిళలకు ఉపశమనం కలిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మహిళలను అవమానించిన వ్యక్తులను అరెస్టు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తమకు తెలియజేయాలని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే తామే రంగంలోకి దిగాల్సి వస్తుందని, తగిన చర్యలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించింది. మొత్తం చర్యలపై అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మణిపూర్‌లో హింసాకాండకు సంబంధించిన ఇతర పెండింగ్ పిటిషన్లపైనా ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది.

తొలి రోజే గరంగరం

- మణిపూర్ హింసాకాండపై అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు
- చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విపక్షాల వాయిదా తీర్మానం
- ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో వాయిదా పడిన రాజ్యసభ, లోక్‌సభ



రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: వర్షాకాల సమావేశాల్లో తొలిరోజే పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. మణిపూర్‌లో హింసాకాండ, ఇద్దరు గిరిజన మహిళలకు జరిగిన అవమానం సహా ఇతర అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్షాలు ఆందోళనకు దిగడంతో ఉభయ సభలు అట్టుడికాయి. ఇతర సభా కార్యక్రమాలన్నీ రద్దుచేసి, మొదటి అంశంగా మణిపూర్ హింసపైనే చర్చించాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగింది.

ప్రధాని జవాబు చెప్పాలని డిమాండ్

పార్లమెంట్ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమైన వెంటనే.. ఇటీవల మరణించిన సభ్యులకు నివాళులర్పించిన కొద్ది నిమిషాలకే రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటలకు, లోక్‌సభ 2 గంటలకు వాయిదా పడ్డాయి. అంతకంటే ముందు మణిపూర్ అంశంపై 267 నిబంధన కింద చర్చకు పట్టుబట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించారు. ఈ మేరకు కాంగ్రెస్ తరఫున మాణిక్యం ఠాగూర్, ఆప్ నేత సంజయ్ సింగ్, బీఆర్‌ఎస్ తరఫున నామా నాగేశ్వరరావు, ఎంఐఎం నుంచి ఒవైసీ, సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వం వాయిదా తీర్మానిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ పునఃప్రారంభమైన తర్వాత కాంగ్రెస్, టీఎంసీ సహా ఇతర విపక్షాల సభ్యులు మణిపూర్ హింసపై చర్చించాలని కోరారు. చైర్మన్ అంగీకరించకపోవడంతో నిరసనకు దిగారు. అత్యంత సున్నితమైన ఈ అంశాన్ని ప్రాధాన్యతగా చర్చకు చేపట్టాలని, దీనిపై మోదీ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. టీఎంసీ నేత డెరెక్ ఓబ్రియన్ సైతం ఆయనకు మద్దతు పలికారు. చైర్మన్ తిరస్కరించడంతో సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. సభ తిరిగి ఆరంభమైన తర్వాత కూడా ఖర్గే మరోసారి తమ నోటీసులపై చర్చించాలని కోరారు. ఆయన మైక్‌ను కట్ చేయడంతో కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో సభాపతి జగదీప్ ధన్‌ఖడ్ సభను శుక్రవారానికి వాయిదావేశారు. ఇక లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు పునఃప్రారంభమైన తర్వాత మణిపూర్ హింసపై విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించడంతో సభను స్పీకర్ శుక్రవారం ఉదయానికి వాయిదా వేశారు.

చర్చకు సిద్ధమే: పీయూష్ గోయల్

విపక్షాల ఆందోళనపై రాజ్యసభలో సభాపక్ష నేత పీయూష్ గోయల్ స్పందించారు. "పార్లమెంట్ సక్రమంగా కొనసాగకూడదన్నదే ప్రతిపక్షాల ఉద్దేశంగా కనిపిస్తోంది. మణిపూర్ సంఘటనలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టంచేసినా.. నిబంధనల ప్రకారం చర్చ జరగనివ్వకుండా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి" అని ఆక్షేపించారు.

సోనియా ఆరోగ్య పరిస్థితిపై మోదీ ఆరా

పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు లోక్‌సభలో ప్రధాని మోదీ విపక్ష నేతలను పలకరించారు. వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీతో కొద్దిసేపు మాట్లాడారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మణిపూర్ హింసాకాండపై లోక్‌సభలో చర్చించాలని ప్రధాని మోదీని సోనియా కోరారని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి చెప్పారు.

ఇండియా కూటమి తొలి భేటీ

ఖర్గే చాంబర్‌లో సమావేశమైన ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతల మొట్టమొదటి సమావేశం గురువారం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో వారంతా భేటీ అయి వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మంగళవారం బెంగళూరులో సమావేశమైన ప్రతిపక్ష నేతలు తమ కూటమికి ఇండియా అనే పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. మణిపూర్ అంశంపై ఉభయసభల్లో చర్చించాలని, అనంతరం ప్రధాని మోదీ ఒక ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ..మణిపూర్ సీఎం బిరేన్ సింగ్‌ను వెంటనే తొలగించి, అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఆ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు 80 రోజులుగా కొనసాగుతున్నా ప్రధాని మోదీ అక్కడికి వెళ్లలేదు, అక్కడి పరిస్థితిపై స్పందించలేదని చెప్పారు. 'మహిళా రెజ్లర్లపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ పార్లమెంట్ నాలుగో నంబర్ గేట్ దగ్గర కనిపించగా, అక్కడికి కొన్ని అడుగుల దూరంలో ప్రధాని మోదీ మహిళల భద్రతపై లెక్చరిచ్చారు. ద్వంద్వ ప్రమాణాలు బీజేపీ డీఎన్‌ఏలోనే ఉన్నాయి' అని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాగూర్ అన్నారు.

ప్రాజెక్టు చీతా అగమ్యగోచరంగా మారింది. ఒక్కొక్కటిగా చీతాలు ప్రాణాలు కోల్పోతూ ఉంటే ఎందుకిలా జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాతావరణ పరిస్థితులు, మేటింగ్‌లో సమస్యలు, సహజ కారణాలతో చీతాలు మృతి చెందుతున్నాయనే ఇన్నాళ్లూ అధికారులు చెబుతూ వచ్చారు. కానీ వాటి భద్రత కోసం అమర్చిన రేడియో కాలరే చీతాల పాలిట మృత్యుపాశమైందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రేడియో కాలర్ల వల్ల చీతాలు ఎలా మరణిస్తున్నాయి ? ఎందుకిలా జరుగుతోంది ?

రేడియో కాలర్ మృత్యుపాశమై!

భద్రత కోసం కట్టిందే చీతాలను బలి తీసుకుంటోందా?
రేడియో కాలర్లతో చీతాలకు వస్తున్న సమస్యలేంటి ?



నమీబియా నుంచి తెచ్చిన చీతాలు	8
దక్షిణాఫ్రికా నుంచి తెచ్చిన చీతాలు	12
మార్చిలో పుట్టిన చీతాలు	4
మృతి చెందిన చీతాలు:	3 కూనలు సహా 8
మిగిలిన చీతాలు	16

\- సాక్షి, నేషనల్ డెస్క్

కేంద్ర ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి విదేశాల నుంచి తీసుకొచ్చిన చీతాలు ఒక్కొక్కటి ప్రాణాలు కోల్పోతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా ఎనిమిది చీతాలు మరణించాయి. భారత్‌లో చీతా ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17న ఆయన పుట్టిన రోజు నాడు నమీబియా నుంచి తీసుకువచ్చిన 8 చీతాలను కునో జాతీయ పార్క్‌లో ప్రవేశపెట్టారు. రెండో విడతలో భాగంగా ఈ ఏడాది దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలు తీసుకువచ్చారు. మార్చిలో జ్వాల అనే చీతా నాలుగు కూనలకు జన్మనిచ్చింది. అయితే ఏడాది తిరక్కుండానే ఎనిమిది చీతాలు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల తేజస్, సూరజ్ అనే రెండు చీతాలు మరణించాయి. ఆ చిరుతల రేడియో కాలర్ల కింద గాయాలున్నట్టు వైద్యులు గుర్తించారు. ఆ గాయాల్లో పురుగులు కూడా ఉన్నట్టు వారు నిర్ధారించారు. ఇదే తరహా గాయాలు మరో రెండు చీతాల్లో కూడా ఉండడంతో వాటికి రేడియో కాలర్లు తొలగించి చికిత్స అందిస్తున్నారు. వాటి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో రేడియో కాలర్లే చీతాల మృతికి కారణం కావచ్చునన్న అనుమానాలు బలపడ్డాయి. రేడియో కాలర్లలో ఉండే చిప్ ఉపగ్రహాల ద్వారా జంతువులకు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తుంది. చీతాల భద్రత, సంరక్షణ కోసం వీటి అవసరం చాలా ఉంది.

అన్నీ ఒక్క చోటే ఎందుకు ? : సుప్రీం



దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో 40% మృత్యువాత పడడం ఆందోళనకంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. చీతాల ప్రాజెక్టుని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒక్కచోటే ఎందుకు ఉంచుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించింది. మధ్యప్రదేశ్ కునో నుంచి వేరే రాష్ట్రాల్లో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలకు చీతాలను తరలించే మార్గాలను అన్వేషించాలని కేంద్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జె.బి. పర్దివాలా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. "చీతాలు మరణించడానికి కారణాలేంటి ? అసలు ఏమిటి సమస్య ? వాతావరణం చీతాలకు అనుకూలంగా లేదా ? ఇంకా ఏమైనా కారణాలున్నాయా ? గత వారంలో రెండు చీతాలు మరణించాయి ? అలాంటప్పుడు అన్ని చీతాలను మధ్యప్రదేశ్ కునోలో ఎందుకు ఉంచాలి ? వాటిని వేరే కేంద్రాలకు ఎందుకు తరలించకూడదు ? అంటూ కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది. కేంద్రం తరఫున కోర్టుకి హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి త్వరలోనే చీతాల మృతికి గల కారణాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. జులై 29లోగా దీనిపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వాలని సుప్రీం ఆదేశించింది.

రేడియో కాలర్స్ ఎలా కబళించాయి?



- చీతాల కదలికల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం వాటి మెడకి రేడియో కాలర్స్ కట్టారు. వేసవి కాలంలో చెమట, దురద వల్ల చీతాలు తరచుగా మెడపై గీరుకోవడం వల్ల చీతాలకు గాయాలై అది చర్మ సంబంధితమైన ఇన్‌ఫెక్షన్‌కు దారితీసి ప్రాణాలు కోల్పోయి ఉండే అవకాశాలున్నట్టు మధ్యప్రదేశ్ అటవీ సంరక్షణ మాజీ అధికారి అలోక్‌కుమార్ అభిప్రాయపడ్డారు.
- వర్షాకాలం వచ్చాక వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో రేడియో కాలర్స్ కట్టిన మెడ చుట్టూ ఒరుసుకొని పోయి చీతాలకు గాయాలయ్యాయి. ఆ గాయాల మీద క్రిమి కీటకాదులు ముసిరి ఇన్‌ఫెక్షన్‌గా మారుతోంది. దీనివల్ల రక్త ప్రసరణకు సంబంధించిన సెప్టిసీమియా అనే పరిస్థితి తలెత్తి చీతాల మరణానికి దారితీసింది.
- ఏదైనా ఒక వస్తువుని సుదీర్ఘకాలం శరీరంపై ఉంచడం వల్ల బ్యాక్టీరియా సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జర్నల్ ఆఫ్ క్లినికల్ డయాగ్నస్టిక్ రీసెర్చ్‌లో తేలింది. ముఖ్యంగా చీతాల మెడ చుట్టూ ఉండే జుట్టు మృదువుగా ఉండడం వల్ల రేడియో కాలర్‌తో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- జంతువులకి వాడే రేడియో కాలర్ బరువు ఆ జంతువు అసలు బరువులో 3% మాత్రమే ఉండాలి. సాధారణంగా రేడియో కాలర్ల బరువు 400 గ్రాముల వరకు ఉంటుంది. 20 నుంచి 60 కేజీల బరువు ఉండే చీతాలకు ఇది సరిపోతుంది. అయితే చీతా మెడ కంటే తల పెద్దది కాదు. దీని వల్ల రేడియో కాలర్ వాటికి అత్యంత బరువుగా అనిపిస్తాయి. చిన్న జంతువులన్నింటిలోనూ ఈ సమస్య ఉంటుంది. రేడియో కాలర్ కట్టడం వల్ల సమస్యలు ఎక్కువయిపోతాయని లండన్‌లోని రాయల్ వెటర్నరీ కాలేజీ ప్రొఫెసర్ అలన్ విల్సన్ చెప్పారు.
- చీతాలకు గత కొన్ని నెలలుగా రేడియో కాలర్ కట్టే ఉంచారు. కానీ వేసవిలో ఇలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వానలు కురవడం ప్రారంభమయ్యాక చర్మం నిరంతరం తడిగా ఉండడం వల్ల రేడియో కాలర్ గాయాలు మరింత పెద్దవై చీతాలు మృత్యువాత పడ్డాయి.

రాజ్యసభ వైస్ చైర్‌పర్సన్లలో సగం మంది మహిళలు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ వైస్ చైర్‌పర్సన్ల ప్యానెల్‌లో సగం మంది మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇది జూలై 17 నుంచి అమల్లోకి వచ్చిందని ఆయన గురువారం ప్రకటించారు. కొత్తగా ఉపాధ్యక్షులైన రాజ్యసభ సభ్యుల్లో పీటీ ఉష, ఎస్.ఫంగ్‌నొన్ కొన్యాక్, ఫౌజియా ఖాన్, సులాటా దియో, వి.విజయసాయిరెడ్డి, ఘన్‌శ్యామ్ తివారీ, ఎల్.హనుమంతయ్య, సుఖేందు శేఖర్ రే ఉన్నారు. నాగాలాండ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మొట్టమొదటి మహిళ కొన్యాక్ సహా ప్యానెల్‌లోకి తీసుకున్న మహిళా సభ్యులందరూ మొదటిసారిగా పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన వారే. ఎగువసభ చరిత్రలో వైస్ చైర్‌పర్సన్ల ప్యానెల్‌లోకి సగం మందికి ప్రాతినిధ్యం కల్పించడం ఇదే ప్రథమం అని ఉపరాష్ట్రపతి కార్యాలయం తెలిపింది.

ఆ బియ్యం ఎగుమతులపై నిషేధం

న్యూఢిల్లీ: బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతులపై కేంద్రం గురువారం నిషేధం విధించింది. రానున్న పండుగ సీజన్‌కల్లా దేశీయంగా సరఫరాను పెంచడం, రిటైల్ ధరలను నియంత్రణలోకి తేవడమే లక్ష్యమని కేంద్ర ఆహార శాఖ తెలిపింది. బార్ పాయిల్డ్ నాన్ బాస్మతి, బాస్మతి రైస్ ఎగుమతి విధానంలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసింది. దేశం మొత్తం బియ్యం ఎగుమతుల్లో నాన్ బాస్మతి వైట్ రైస్ వాటా 25% వరకు ఉంటుంది.

చంద్రయాన్-3 కక్ష్య పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు గురువారం ఉదయం 6.45 గంటలకు నాలుగోసారి కక్ష్య దూరాన్ని పెంచారు. ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రపొల్షన్ మాడ్యూల్‌లో నింపిన ఇంధనాన్ని మండించి మొదటి, రెండు, మూడు విడతల్లో భూమికి దగ్గరగా 224 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 51,568 కిలోమీటర్ల ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. నాలుగో విడతలో భూమికి దగ్గరగా 277 కిలోమీటర్లు, దూరంగా 89,772 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. ఈ నెల 25న అయిదోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపట్టనున్నామని షార్ వర్గాలు తెలిపాయి.

దేశంలోనే సంపన్న ఎమ్మెల్యే డీకే శివకుమార్

బెంగళూరు: దేశంలోనే అత్యంత ధనికుడైన ఎమ్మెల్యేకి రూ.1,400 కోట్ల ఆస్తులుండగా బెంగాల్‌కు చెందిన అత్యంత నిరుపేద ఎమ్మెల్యే పేరిట రూ.2 వేలు కూడా లేవని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తెలిపింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి, కర్ణాటక డిప్యూటీ సీఎం అయిన డీకే శివకుమార్ ఆస్తుల విలువ రూ.1,413 కోట్లు కాగా ఆతర్వాతి రెండు స్థానాల్లో ఉన్నవారూ కర్ణాటకకు చెందిన వారేనని ఏడీఆర్ నివేదిక తెలిపింది. రెండో స్థానంలో ఉన్న స్వతంత్ర ఎమ్మెల్యే కేహెచ్ పుట్టస్వామి గౌడ ఆస్తుల విలువ రూ.1,267 కోట్లు కాగా, రూ.1,156 కోట్లతో మూడో స్థానంలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియా కృష్ణ నిలిచారు.

గగన్‌యాన్ ఎస్‌ఎంపీఎస్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట: గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రపొల్షన్ సిస్టం (ఎస్‌ఎంపీఎస్)ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయవంతంగా పరీక్షించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్టుగా గురువారం ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పరీక్షలో 440 ఎన్ థ్రస్ట్‌తో ఐదు లిక్విడ్ అపోజి మోటార్ ఇంజిన్లు, 100 ఎన్ థ్రస్ట్‌తో 16 రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను పరీక్షించారు. గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్‌కు 440 ఎన్ ఇంజిన్లు మిషన్ ఆరోహణ దశలో ప్రధాన చోదకశక్తిని అందిస్తాయి. సుమారు 250 సెకెండ్లపాటు నిర్వహించిన పరీక్షలో లిక్విడ్ అపోజి మోటార్ ఇంజిన్లు, రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లను పరీక్షించి సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు.



అయోధ్యలో చురుగ్గా కొనసాగుతున్న శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణ పనులు. జనవరిలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం జరగనుంది. దీంతో భక్తుల రాక నేపథ్యంలో అయోధ్య పట్టణం, చుట్టుపక్కన ప్రాంతాల్లోని హోటళ్లలో గదుల బుకింగ్ విపరీతంగా పెరిగింది.

టాయిలెట్ కోసం వందేభారత్ రైలెక్కితే రూ. 6వేలు గుల్ల

భోపాల్: బాత్‌రూం కోసం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కిన ఓ వ్యక్తి రూ.6 వేలు నష్టపోయాడు. అదెలాగంటే..మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీకి చెందిన అబ్దుల్ ఖదీర్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఖదీర్, భార్య, 8 ఏళ్ల కొడుకుతో కలిసి ఈనెల 15న సాయంత్రం 5.20 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి భోపాల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. 8.55 గంటలకు వారు సింగ్రౌలీ రైలెక్కాల్సి ఉంది. వారు నిల్చున్న ప్లాట్‌ఫాం పక్కనే ఇండోర్ వెళ్లాల్సిన వందేభారత్ రైలుంది. ఖదీర్ అర్జంటుగా మూత్రానికి వెళ్లాల్సి రావడంతో వందేభారత్ టాయిలెట్‌లోకి వెళ్లారు. తిరిగి బయటకు వచ్చే సమయానికి రైలు కదలడం, బోగీ తలుపులు లాక్ కావడం జరిగిపోయాయి. అటుగా వచ్చిన పోలీసులు, టికెట్ కలెక్టర్లను అడిగినా లాభం లేకపోయింది. ట్రెయిన్ డ్రైవర్ మాత్రమే తలుపులు తెరిచే అవకాశం ఉందని వారు బదులిచ్చారు. చివరికి ట్రెయిన్ డ్రైవర్‌ను అడిగాక రైలాగింది. టికెట్ లేకుండా ప్రయాణం చేసినందుకు రూ.1,020 జరిమానాగా చెల్లించుకున్నాడు. అక్కడి నుంచి తిరిగి భోపాల్ చేరుకునేందుకు బస్సుకు మరో రూ.750 ఖర్చయ్యాయి. ఖదీర్ ఎక్కడికెళ్లాడో తెలియక భార్య, కొడుకు భోపాల్ ప్లాట్‌ఫాం మీదనే ఉండిపోయారు. సింగ్రౌలీ రైలు ప్రయాణానికి రూ.4 వేలతో చేయించిన రిజర్వేషన్ కూడా క్యాన్సిలయింది. అలా ఖదీర్ మొత్తంగా రూ.6 వేలు నష్టపోవాల్సి వచ్చింది. ఎమర్జెన్సీ వ్యవస్థ లేకపోవడంతో తన కుటుంబం మానసిక వ్యథకు గురైందంటూ ఖదీర్ చేసిన ఆరోపణలను భోపాల్ రైల్వే డివిజన్ పీఆర్‌వో సుబేదార్ సింగ్ ఖండించారు. రైలు బయలుదేరడానికి ముందుగానే తెరిచి ఉండే డోర్లు, లాక్ అయ్యే డోర్లపై ప్రకటన చేస్తారని చెప్పారు.

అంతరిక్షంలో శాస్త్రవేత్తలు గుర్తించిన అరుదైన అద్భుతమిది. భూమికి 400 కాంతి సంవత్సరాల దూరంలోని కొత్త సౌర వ్యవస్థ(పీడీఎస్70)లో ఒకే కక్ష్యలో తిరుగుతున్న రెండు గ్రహాలు ఇవి. దీంతో కవల గ్రహాలు ఒకే కక్ష్యలో తిరుగుతాయనే సిద్ధాంతానికి తొలిసారిగా బలమైన రుజువు లభించింది.



ప్రవేశాల ఎంపిక పూర్తి

కరీంనగర్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో 1వ, 5వ తరగతుల ప్రవేశాలకు గురువారం కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లు ఎస్సీ డీడీ పి.నతేనియల్ తెలిపారు. మొత్తం 492 దరఖాస్తులు రాగా 1వ తరగతి నాన్–రెసిడెన్షియల్‌లో 86, 5వ తరగతి రెసిడెన్షియల్‌లో 89 మొత్తం 175 మంది ఎస్సీ విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.



ఏసీపీని కలిసిన టీఎన్‌జీవోలు

కరీంనగర్‌క్రైం: టౌన్ ఏసీపీ నరేందర్‌ను జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు డి.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శి లక్ష్మణరావు, శ్రీనివాస్, కిరణ్ కుమార్‌రెడ్డి, శారద, రాజేశ్ తదితరులు కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

రిటైర్డ్ పెన్షనర్ల ధర్నా



కరీంనగర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ.. పెన్షన్స్ ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించాలని, నూతన పీఆర్సీని నియమించి, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేస్తూ, ప్రతి జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు అందించారు. నాయకులు తిరుమలయ్య, వెంకటయ్య, నల్ల ప్రభాకర్ రెడ్డి, మండల వీరస్వామి, రావికంటి రామకిష్టయ్య, మునిగంటి వెంకటేశ్వర్లు, తుమ్మ పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో దుర్మార్గపు పాలన'



హుజూరాబాద్: రాష్ట్రంలో దుర్మార్గపు ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదేళ్లుగా దుర్మార్గపు ప్రభుత్వం రాజ్యమేలుతోందని, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని తెలిపారు. కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, తూర్పాటి రాజు, రావుల వేణు, తూముల శ్రీనివాస్, పోతుల సంజీవ్, అంకటి వాసు, యాళ్ల సంజీవరెడ్డి, టి.రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర బృందం పర్యటన



చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో స్వచ్ఛసర్వేక్షన్ 2023లో భాగంగా చేపట్టిన పనులను రాష్ట్రబృందం గురువారం పరిశీలించారు. ఎంపీడీవో స్వరూప ఆధ్వర్యంలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంపోస్టు షెడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అంగన్‌వాడీకేంద్రాలల్లోని మరుగుదొడ్లు, ఇండ్లలోని ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఎంపీవో రాజగోపాల్ రెడ్డి, సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ శ్యామకూర శేఖర్ రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో పదకొండవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈ నెల 22న పరీక్ష నిర్వహిస్తున్నామని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 544మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రెండున్నర గంటల పాటు పరీక్ష జరుగుతుందని, గంట ముందు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లతో పాటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

31న గిరి ప్రదక్షిణలకు ప్రత్యేక బస్సు

విద్యానగర్(కరీంనగర్): ఈనెల 31న పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణలు చేయాలనుకునే భక్తుల కోసం వేములవాడ డిపో నుంచి కరీంనగర్ మీదుగా ప్రత్యేకబస్సు నడిపిస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు జూలై 30న రాత్రి 8గంటలకు వేములవాడ బస్టాండ్ నుంచి బయలుదేరి కరీంనగర్‌కు చేరుకుని, రాత్రి 9గంటలకు బయలుదేరి ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం, వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి దర్శనం అనంతరం జూలై 31న రాత్రి 8గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. ఆగస్టు 1న సాయంత్రం 3గంటలకు తిరుగుపయనమై 2న ఉదయం శ్రీ జోగులాంబ శక్తి పీఠం దర్శనం, 6గంటలకు కరీంనగర్ చేరుకుంటుందని తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీ ఒక్కొక్కరికి రూ.4,200గా నిర్ణయించినట్లు చెప్పారు. ఆన్‌లైన్, బుకింగ్ కౌంటర్లలో టికెట్ బుక్ చేసుకోవచ్చని వివరాలకు 99592 25926, 7382851826కు సంప్రదించాలన్నారు.



గురువారం రాత్రి నగరంలోని తెలంగాణ చౌక్‌లో కురుస్తున్న వర్షం

జోరువాన

- మానేరుకు పెరిగిన వరద
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం
- వర్షం ఇబ్బందులపై 8004258731 నంబర్‌కు కాల్‌చేయండి
- నేడు స్కూళ్లకు సెలవు
- 26 వరకు భారీ వర్షాలు: ఐఎండీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

వరుణుడు జోరు పెంచాడు. మూడురోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురిసినా.. చాలాచోట్ల చెదురుముదురు వర్షాలే పడ్డాయి. గురువారం మాత్రం జిల్లాలో వింత వాతావరణం నెలకొంది. దాదాపు అన్ని మండలాల్లో వర్షం పడగా, కరీంనగర్ నగరంలో మా త్రం వింత వాతావరణం నెలకొంది. ఉదయం ఎండ, మధ్యాహ్నం ఉక్కపోత నెలకొంది. సాయంత్రానికి వాతావరణం చల్లబడి మెల్ల గా వాన మొదలైంది. చిన్నగా మొదలైన వాన రాత్రి 7 గంటలు తర్వాత జోరు పెంచింది. చాలా చోట్ల వాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈనెల 21, 22, 23 తేదీల్లో భారీవర్షాలు, 24, 25, 26వ తేదీల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది.

నేడు పాఠశాలలకు సెలవు

ఉదయం భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలనుసారం మధ్యాహ్నం తర్వాత పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. శుక్రవారం కూడా పాఠశాలలకు సెలవు కొనసాగనుంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు బయటికి వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టంచేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, బల్దియా బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కర్ణన్ ఆదేశించారు. ఇబ్బందులు తలెత్తినా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 8004258731ను సంప్రదించాలని సూచించారు.



జలమయమైన రాంనగర్ చౌరస్తా

పెరుగుతున్న ఎల్ఎండీ నీటిమట్టం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు, మధ్యమానేరు జలాశయం నుంచి వస్తున్న వరద జిల్లాలోని దిగువ మానేరు జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం నాటికి ఎల్ఎండీలో 11 టీఎంసీల నీరుచేరింది. పూర్తి సామర్థ్యం 920 అడుగులకు ప్రస్తుతం 900 అడుగుల నీరుఉందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి 11టీఎంసీల నీరుచేరిందని అధికారులు వెల్లడించారు. జలాశయంలోకి మిడ్ మానేరు నుంచి 9,090 క్యూసెక్కుల వరద వస్తుండగా మోయతుమ్మెద వాగు ద్వారా 2,215 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు వివరించారు. ఉదయం 6 గంటల సమయంలో మోయతుమ్మెద వాగు నుంచి కేవలం 210 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చింది. మధ్యాహ్నానికి అది రెండు వేల క్యూసెక్కులకు చేరి, ఒకదశలో మూడు వేల క్యూసెక్కులు దాటింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో మానేరుకు ఇన్‌ఫ్లో పెరుగుతుందని అధికారులు వివరించారు.

గుండిలో అత్యధిక వర్షం

జిల్లాలోని గుండి(రామడుగు)లో అత్యధికంగా 6.3సెం.మీల వర్షపాతం నమోదైంది. అర్నకొండలో 5.3, గంగాధరలో 4.3, కరీంనగర్ రూరల్ 4.2, బూరుగుపల్లి(గంగాధర) 4.1, వెదురుగట్టు (చొప్పదండి) 4, కరీంనగర్ అర్బన్ 3.9, కొత్తపల్లి 3.3, మానకొండూరు 3, చిగురుమామిడి 2.9, గన్నేరువరం 2.7, తిమ్మాపూర్ 2.6, జమ్మికుంట 2.3, శంకరపట్నం 2.1, ఇల్లందకుంట 1.9, వీణవంక 1.5, హుజూరాబాద్ మండలంలో 1.2సెం.మీల వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా

కార్యాలయం పేరు	టోల్‌ఫ్రీ నంబర్
కలెక్టర్ కార్యాలయం	8004254731
తహసీల్దార్, కరీంనగర్	7075525568
తహసీల్దార్, రూరల్	7032130519
తహసీల్దార్, కొత్తపల్లి	8897642203
తహసీల్దార్, తిమ్మాపూర్	9912865600
తహసీల్దార్, మానకొండూర్	9849150337
తహసీల్దార్, రామడుగు	9908698147
తహసీల్దార్, గంగాధర	9963456640
తహసీల్దార్, చొప్పదండి	8897247683
తహసీల్దార్, చిగురుమామిడి	9959498818
తహసీల్దార్, హుజూరాబాద్	9014989393
తహసీల్దార్, జమ్మికుంట	9652402631
తహసీల్దార్, శంకరపట్నం	9963675699
తహసీల్దార్, వీణవంక	9700454468
తహసీల్దార్, సైదాపూర్	9908058372
తహసీల్దార్, ఇల్లందకుంట	9642286555
తహసీల్దార్, గన్నేరువరం	9949665886

వెంకన్న గుడి నిర్మాణంలో తొలి అడుగు

- గుడి నిర్మాణానికి టెండర్లు పిలిచిన టీటీడీ
- రూ.20 కోట్ల అంచనా వ్యయం
- 18 నెలల్లో పద్మావతి–శ్రీఆండాల్ సమేత వెంకన్న ఆలయం
- తమిళనాడు రాతితో గర్భగుడి, ప్రత్యేక నోడల్ అధికారి పర్యవేక్షణ
- ఆగస్టు 17 నుంచి పనులు, 2025 జనవరి నాటికి పూర్తి
- సెప్టెంబర్ నాటికి పద్మనగర్ 'గరుడ' జంక్షన్ సిద్ధం



భూమిపూజలో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కమలాకర్, వినోద్ కుమార్ (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లోని పద్మనగర్‌లో సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్మించతలపెట్టిన పద్మావతి–శ్రీఆండాల్ సమేత వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి తొలిఅడుగు పడింది. ఈమేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) టెండర్లు పిలిచింది. మొత్తం రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ఆలయం 18 నెలలలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ నెల 27తేదీని టెండర్ల దాఖలుకు ఆఖరు రోజుగా పేర్కొంది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభంకానున్నాయి. ఆగస్టు 17వ తేదీన పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం విధించిన గడువు ప్రకారం.. మొత్తం 18 నెలల్లో ఆలయం పూర్తవుతుంది. తమిళనాడు నుంచి తెప్పించే రాతితో నిర్మించనున్నారు. ఈ లెక్కన 2025 జనవరి నాటికి ఆలయం పూర్తయి, అదే నెలలో లేదా ఫిబ్రవరిలో భక్తులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఆలయ నేపథ్యం..

జిల్లాల పునర్విభజనతో జిల్లాలో చారిత్రక ఆలయం లేకుండా పోయింది. అందుకే, కరీంనగర్‌లో ప్రతిష్టాత్మక ఆలయం నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మంత్రి గంగుల కమలాకర్ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారి ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణ బాధ్యతలను మొదటి నుంచి పర్యవేక్షిస్తున్నారు. దీనిపై తెలంగాణ సీఎం కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడటం విశేషం. ఈ ప్రతిపాదనకు టీటీడీ కూడా సుముఖత వ్యక్తం చేసింది. అనంతరం కరీంనగర్–సిరిసిల్ల హైవే మార్గంలో పద్మనగర్ డెయిరీ సమీపంలో 10 ఎకరాల సువిశాల స్థలం ఆలయ నిర్మాణం కోసం ఎంపిక చేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌తో కలిసి మంత్రి గంగుల కమలాకర్ ఈ ఏడాది మేలో తిరుపతి వెళ్లి ఆలయంలోని అంతరాలయం, గోపురాలు నిర్మాణ నమూనాలతోపాటు మూలవిరాట్టు, పోటు, ప్రసాద వితరణ కేంద్రాలు పరిశీలించి వచ్చారు. అనంతరం వారి ఆహ్వానం మేరకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి గతనెల ఒకటిన కరీంనగర్ వచ్చి భూమిపూజ, స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

సెప్టెంబరులో గరుడ జంక్షన్ సిద్ధం...

తిరుమల తిరుపతి దేవస్థానం దర్శించుకునే భక్తులకు అలిపిరి ముఖద్వారం స్వాగతం పలుకుతుంది. అదే తరహాలో పద్మనగర్‌లో నిర్మించ తలపెట్టిన ఆలయం ఎదుట అచ్చం అలిపిరి గరుత్మంతుడిని తలపించేలా భారీ ఐలాండ్‌ను రూపొందించనున్నారు. ఈ ఐలాండ్ మోడల్ డిజైన్‌ను సివిల్ ఇంజనీర్ అయిన మంత్రి గంగుల కమలాకర్ స్వయంగా రూపొందించడం విశేషం. పద్మనగర్ గరుడ జంక్షన్‌ను సెప్టెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ గరుడ ఐలాండ్‌లో 24 గంటలు వేంకటేశ్వర నామం మారుమోగేలా పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేసే విషయాన్నీ మంత్రి పరిశీలిస్తున్నారు.

ముప్పావు ఎకరంలో గర్భగుడి..

సంపూర్ణంగా తిరుమల మాదిరిగా పూజలతో సహా ఉండే ఆలయంలో రాతి కట్టడంతో గర్భగుడి ముప్పావు ఎకరం విశాలమైన స్థలంలో నిర్మాణం కానుంది. దానికి తూర్పున బావి, ఎడమ పక్కన కోనేరు, మండపాలు, ప్రాకారాలు తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. స్వామి వారితో పాటు భూదేవి, శ్రీదేవి సమేత ఆలయాన్ని కూడా నిర్మించనున్నారు. 18 నెలల కాలంలో ఈ మొత్తం నిర్మాణాల పర్యవేక్షణకు టీటీడీ ప్రత్యేక నోడల్ అధికారిని ఇప్పటికే నియమించింది.

ఏడాదిలోగా పూర్తి చేస్తాం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన పద్మావతి–శ్రీఆండాల్ సమేత వెంకన్న ఆలయం టెండర్లు పిలిచారు. ఏడాదిలోగా ఆలయాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. శ్రావణ మాసం మొదట్లో పనులు మొదలవుతాయి. ఆలయం మొత్తం రాతితో నిర్మిస్తాం. రాయిని తమిళనాడు నుంచి తీసుకువస్తాం. ఏడాదిలోగా పనులు పూర్తిచేసి కరీంనగర్‌ను మినీ తిరుమలగా తీర్చిదిద్దుతాం. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ నిర్మాణం జరుగుతుంది.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖల మంత్రి

కూల్చేయండి.. లేదంటే కూల్చేస్తాం!

- శిథిల ఇళ్లపై బల్దియా నజర్
- ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త
- నగరంలో ఇప్పటివరకు 57 ఇళ్లు గుర్తింపు
- సెక్షన్ 182 ప్రకారం హెచ్చరిక నోటీసు



శిథిలావస్థలో ఉన్న ఇంటికి అతికించిన నోటీసు

కరీంనగర్ కార్పొరేషన్: 'ఇందు మూలంగా మీకు తెలియచేయునది ఏమనగా.. మీ భవనం శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్నదని గుర్తించడమైనది. కావున ఇంటిలో నివసించే వాళ్లు తక్షణమే ఖాళీ చేసి.. ఇల్లును కూల్చుకోమని.. మరమ్మతులు చేసుకోమని హెచ్చరించడమైనది. లేని యెడల సెక్షన్ 182, మున్సిపల్ చట్టం 2019 ప్రకారం కూల్చివేసి చట్టరీత్యా చర్యలు తీసుకోబడును.'

ఇది వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లకు నగరపాలకసంస్థ అంటిస్తున్న హెచ్చరిక నోటీసు. తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నగరంలోని శిథిలావస్థలో (కూలడానికి సిద్ధంగా) ఉన్న ఇళ్లపై నగరపాలకసంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. పురాతన నిర్మాణాలతో ప్రమాదాలు పొంచి ఉన్నందున ముందు జాగ్రత్తగా ప్రజలను అప్రమత్తం చేస్తోంది. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను కూల్చివేసుకోవాలని లేదంటే మరమ్మతులు చేసుకోవాలని నోటీసులు జారీ చేస్తోంది.

57 ఇళ్లకు హెచ్చరిక నోటీసు

వర్షాలతో కూలే ప్రమాదం ఉన్న ఇళ్లను మూడు రోజులుగా గుర్తించే పనిలో నగరపాలకసంస్థ అధికారులు బిజీగా ఉన్నారు. గురువారం నాటికి ఇలాంటి పడిపోయే 57 ఇళ్లను టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. యజమానులకు నోటీసులు జారీ చేశారు. కార్ఖానగడ్డ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో గుర్తించిన ఇండ్లను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాత్కాలికంగా బస కోసం తరలాలని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వర్షాలకు కూలే ప్రమాదం ఉండడంతో ముందుగానే ఇండ్లను స్వచ్ఛందంగా కూల్చుకోవాలని, మరమ్మతులు చేసుకోవాలని సూచించారు.

స్పెషల్ టీమ్స్ ఆన్ డ్యూటీ

మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తమైన నగరపాలకసంస్థ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపడం తెలిసిందే. ఎనిమిది గంటలకు ఒక బృందం చొప్పున మూడు విడుతలుగా 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయి. నగరంలో ఎక్కడ వర్షపు నీళ్లు నిలిచినా, డ్రైనేజీలు పూడుకుపోయినా, చెట్లు విరిగి పడిపోయినా ఈబృందాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాయి. కట్టరాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విరిగిన చెట్లను రెస్క్యూ టీం గురువారం తొలగించింది. నగరంలోని ప్రధాన రహదారుల నుంచి డ్రైనేజీలకు వెళ్లే హోల్స్ మట్టి, చెత్తతో మూసుకుపోగా సిబ్బంది తొలగించారు. రోడ్లు, పల్లపు ప్రాంతాల్లో నిలుస్తున్న నీళ్లను డ్రైనేజీలకు వెళ్లేలా మళ్లిస్తున్నారు.

ప్రజల రక్షణే ముఖ్యం..

– మేయర్ యాదగిరి సునీల్‌రావు

వర్షాలు కురుస్తున్న సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, గోడలు తొలగించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాంటి గృహ యజమానులకు నచ్చచెప్పి తొలగిస్తాం. పురాతన ఇండ్ల సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలి. రెస్క్యూ టీం 24 గంటలు అందుబాటులో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సహకరించాలి.

ప్రదర్శన కేంద్రాలతో ఓటింగ్‌పై అవగాహన

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: ఈవీఎం ప్రదర్శన కేంద్రాలు, సంచార ప్రదర్శన వాహనాలతో ఓటర్లకు సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని, ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్లో ఈవీఎం ప్రదర్శన కేంద్రంతో పాటు సంచార ప్రదర్శన వాహనాలను ప్రారంభించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి రెండు వాహనాల ద్వారా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిపాట్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని, పబ్లిక్ అడ్రస్ సిస్టం, టీవిలు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా అవగాహనను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వరకు వచ్చిన ఓటరు దరఖాస్తులను ఈ నెల 27న డిస్పోజల్ చేయాలని, అగస్టు 4 వరకు పోలింగ్ కేంద్రాల మార్పు, ఇతర చర్యలకై ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని అగస్టు 21న డ్రాఫ్ట్ రోల్ పబ్లిషింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కర్ణన్

రేకుర్తి కంటి ఆస్పత్రి సేవలు అభినందనీయం

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తి కంటి ఆస్పత్రి సేవలను అభినందనీయమని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. ఆసుపత్రిలో రూ.49.50లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 'గ్రీన్‌లేజర్' యంత్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ యంత్రంతో మధుమేహ బాధితులు, రెటినోపతి వ్యాధిగ్రస్తులకు చికిత్స, ఓసీటీ మధుమేహ బాధితులకు స్కానింగ్ ద్వారా కంటికి మధుమేహం వలన కలిగే నష్టాన్ని పరీక్షించవచ్చునని, ఐఓఎల్ మాస్టర్ ద్వారా రోగికి కంటి ఆపరేషన్‌కు ముందు స్కానింగ్ ద్వారా ఖచ్చితమైన లెన్స్ వేయవచ్చునని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, క్యాంపు వార్డు, పేయింగ్‌వార్డు, పలు విభాగాలను సందర్శించారు. ఆసుపత్రి చైర్మన్ కొండా వేణుమూర్తి, ప్రకాశ్ హోల్లా, డాక్టర్ టి.మురళీధర్‌రావు, బొమ్మ పవన్‌కుమార్, కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణ చర్యలు చేపట్టండి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో భారీవర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశముందని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. గురువారం జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుతో సమీక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. వీరు 24 గంటలు అందుబాటులో ఉంటారని, ఏదైనా గ్రామంలో అంటువ్యాధులు ప్రబలితే తక్షణసాయం కోసం 98499 02501 నంబరుకు సంప్రదించేలా చూస్తున్నామని అన్నారు. పీహెచ్‌సీల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

క్లుప్తంగా

సినారె పురస్కారాలకు ఎంపిక


సుదర్శనం వేణుశ్రీ


డాక్టర్ మచ్చ హరిదాసు

కరీంనగర్‌కల్చరల్: మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో అందించే సాహితీ పురస్కారాలకు కరీంనగర్ చెందిన కవులు సుదర్శనం వేణుశ్రీ, డాక్టర్ మచ్చ హరిదాసు ఎంపికయ్యారు. ఈ మేరకు పీఠం అధ్యక్షుడు మల్లేకేడి రాములు, సమన్వయకర్త డాక్టర్ పోరెడ్డి, రంగయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. జడ్చర్లలో ఈ నెల 23న పురస్కారాలు అందజేస్తామని వివరించారు.

ఏసీబీ కేసులో వీఆర్‌వోకు నాలుగేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వీఆర్‌వోకు నాలుగేళ్ల జైలు, రూ.14వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కుమార్‌వివేక్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తిమ్మాపూర్ మండలం అలుగునూర్ గ్రామానికి చెందిన దొంత తార తన వారసులకు కొంత వ్యవసాయ భూమిని గిఫ్ట్‌డీడ్ చేసింది. ఆ భూమిని రెవెన్యూరికార్డుల్లో మార్చేందుకు అప్పటి అలుగునూర్ వీఆర్‌వో అడప శ్రీనివాస్‌ను సంప్రదించింది. శ్రీనివాస్ రూ.10వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో తార కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. 2012 డిసెంబర్ 5న తార వద్ద శ్రీనివాస్ రూ.7వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అప్పటి నుంచి కేసు నడుస్తోంది. గురువారం సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాస్‌కు జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. శ్రీనివాస్ ప్రస్తుతం జగిత్యాల మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి



కరీంనగర్‌సిటీ: త్వరలో జరగనున్న ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం శాతవాహనయూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌పటేల్ మాట్లాడుతూ.. ఎల్ఎల్‌బీ నాలుగోసెమిస్టర్ పరీక్షలు, గురుకుల టీచర్ల పరీక్ష ఒకేరోజు ఉండడంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. దీన్నిదృష్టిలో ఉంచుకుని ఎల్ఎల్‌బీ పరీక్షలు వాయిదా వేయాల్సిందిగా కోరారు. శ్రావణ్‌పటేల్, సతీశ్‌రెడ్డి, సిద్ధార్థ్, అజయ్, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల్లో సంక్షేమ హాస్టళ్లు

హుజూరాబాద్: సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ అన్నారు. గురువారం హుజూరాబాద్ నియోజకవర్గంలోని బీసీ సంక్షేమహాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో భోజనం చేసి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాముయాదవ్ మాట్లాడుతూ.. అద్దెభవనంలోని గదుల్లోకి నీళ్లు వస్తున్నాయని అన్నారు. బాత్రూంలు శుభ్రంగా లేవని తెలిపారు. హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని కోరారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, దుప్పట్లు ఇవ్వాలని తెలిపారు. నాయకులు సందీప్, అష్రఫ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


రంగులతో కళకళలాడుతున్న వసతిగృహం వెలుపలి భాగం


హాస్టల్ లోపల ఊడిన పైకప్పు పెచ్చులు


ఊరుస్తున్న హాస్టల్, విద్యార్థుల ఇబ్బందులు

బయట మెరుపులు.. లోపల మరకలు

కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలో ఉన్న ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర హాస్టల్‌ను 1972లో నిర్మించారు. ఇటీవల హాస్టల్ ప్రహరీ, భవనానికి విద్యాపరమైన అంశాలు, మహనీయుల బొమ్మలతో ఆకట్టుకునేలా రంగులు అద్దారు. హాస్టల్ లోపలికి వెళ్తేమాత్రం శిథిలావస్థలో ఉన్న భవనం, ఇరుకుగదులు, కూలుతున్న, వర్షాలకు నాని ఉరుస్తున్న గోడలు దర్శనం ఇస్తున్నాయి. భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గదుల్లోకి వర్షం నీళ్లచేరి వస్తువులు, పుస్తకాలు, బట్టలు తడిసిపోతున్నాయని చెబుతున్నారు. వందమందికి పైగా విద్యార్థులు హాస్టల్‌లో ఉండగా.. ఒక్కోగదిలో 15 మందివరకు ఆశ్రయం పొందుతున్నారు. అధికారులు దృష్టిసారించి భవనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కొండగట్టులో నీటి సమస్యకు పరిష్కారం

- రూ.13.43 కోట్లతో ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


శంకుస్థాపన చేస్తున్న వినోద్‌కుమార్, తదితరులు

మల్యాల(చొప్పదండి): 'చెప్పింది చేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ తెస్తామని తెచ్చి చూపించినం.. కోటి ఎకరాలకు సాగు నీరందిస్తున్నాం' అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నప్పుడు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, దీంతో కొండగట్టులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరద కాలువ 81.10కిలో మీటరు వద్ద రెండు మోటార్లతో నిత్యం 10వేల క్యూసెక్కులను సంతలోని లొద్దిలోకి ఎత్తిపోసేందుకు రూ.13.43కోట్ల నిధులు కేటాయించగా, గురువారం వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో ఎత్తిపోతల పనులు పూర్తిచేసి కొండగట్టుపైకి వరదకాలువ నీటిని తరలించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కొండగట్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రవిశంకర్ చొరవను మంత్రి అభినందించారు. అంజన్న సన్నిధికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్‌రావు, పునుగోటి ప్రశాంతి, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆస్పత్రిలో రక్త పరీక్షల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుడు రిపోర్టు ఇచ్చారు. ఆ రిపోర్టు ప్రకారం ఆపరేషన్ చేయాల్సిన వైద్యులు అనుమానంతో మరోసారి పరీక్ష చేయించగా సరైన రిపోర్టు ఇచ్చారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ విచారణకు ఆదేశించారు. ప్రసవం కోసం ఓ మహిళ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ ద్వారా ప్రసవం చేయాలని నిర్ణయించారు. అందుకు పలు పరీక్షలు చేశారు. రక్తకణాలు 58వేలు ఉన్నట్లు మొదట రిపోర్టు ఇచ్చారు. ఆపరేషన్‌కు అన్ని సిద్ధం చేసుకున్న వైద్యులు రిపోర్టుపై అనుమానంతో మరోసారి శాంపిల్ పంపించారు. అప్పుడు రక్త కణాలు రెండు లక్షలకు పైగా ఉన్నాయని రిపోర్టు ఇచ్చారు. రక్త పరీక్షలు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఈ విషయాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ విచారణకు ఆదేశించారు. డాక్టర్ రవిప్రవీణ్ రెడ్డి, డాక్టర్ కృష్ణకాంత్ గురువారం విచారణ చేపట్టినట్లు తెలిసింది.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఏ.నర్సయ్యకు కోర్టు గురువారం మూడు రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పి.రమేశ్ తెలిపారు. మరో తొమ్మిది మందికి రూ.15,500 జరిమానా విధించినట్లు తెలిపారు. 85మందికి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

కరీంనగర్: పదిహేనేళ్లుగా 73షెడ్యూల్ పరిశ్రమలో కార్మికుల కనీస వేతనాల జీవోలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు పెరిగాయి తప్పా ప్రభుత్వ ఉద్యోగులు, అనేక రంగాల కార్మికుల జీతాలు పెరిగాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి ఖర్చు కాకుండా షెడ్యూల్ పరిశ్రమల నుంచి కార్మికులకు వేతనాలు పెంచే జీవోలను సవరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కనీస వేతనం రూ.26వేలు వచ్చే విధంగా జీవోల సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.రాజేశం, జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజమల్లు, జిల్లా కమిటీ సభ్యుడు కదిరె రమేశ్, జగదీశ్, మల్లారెడ్డి, కవిత, నాంపల్లి, కనకయ్య, వెంకన్న, అంజిరెడ్డి సంపత్, శంకర్ పాల్గొన్నారు.

అర్హత గల వారందరూ ఓటరుగా ఉండాల్సిందే


ఆర్డీవోతో వివిధ పార్టీల నేతలు

కరీంనగర్ అర్బన్: పద్దెనిమిదేళ్లు నిండే ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల నేతలు కృషి చేయాలని కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్వర్‌కు రాజకీయ పార్టీల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు గడువు సమీపిస్తుందున రాజకీయ పార్టీ ప్రతినిధులు స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించుటలో ప్రజలను చైతన్యపరచాలని కోరారు. బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ నుంచి బండ రమణరెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహనచారి, సీపీఐ(ఎం) మిల్కూరి వాసుదేవరెడ్డి, బీఎస్పీ గాలి అనిల్‌కుమార్, టీడీపీ నుంచి ఎర్రబెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు


నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్వీపర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారం తొమ్మిదోరోజు కొనసాగాయి. దీక్షలో పాల్గొన్న గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన స్వీపర్ లక్ష్మీనారాయణ ఈనెల 18న మనోవేదనకు గురైమృతి చెందగా.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సీఐటీయూ నాయకులు నివాళి అర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూల్ స్వీపర్లను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనం లేకుండా వెట్టిచాకిరీ చేయించుకోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. రిలే దీక్షలకు డీటీఎఫ్, టీపీటీఎఫ్, తపస్ ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరి రమేశ్, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.రాజేశం, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మద్దతు తెలిపారు.

మేధస్సు పెంపునకు చెస్ దోహదం

- అల్ఫోర్స్ అధినేత డా.నరేందర్‌రెడ్డి



విద్యార్థులతో డాక్టర్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): క్రీడాకారుల్లో మేధస్సును పెంపొందించేందుకు చెస్ దోహదపడుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో 'అల్ఫోర్స్ చెస్ కార్నివల్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీఎస్ఆర్ మాట్లాడుతూ ప్రాథమిక దశనుంచే చదరంగంపై ఆసక్తి పెంచడం ద్వారా వారిలోని ఆలోచన శైలిని, పోటీతత్వాన్ని వెలికితీయవచ్చునన్నారు. చెస్ అసోసియేషన్ ప్రతినిధులు మాసం అంజయ్య, కె.కనకయ్య, కె.అనూప్, ఎ.రాజేంద్రప్రసాద్, ఎ.కుమార్, జి.శ్రీనివాస్, ఎం.దేవయ్య, అశోక్‌ను ఘనంగా సత్కరించారు. చెస్‌లో అద్భుతంగా రాణించిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నిత్యావసర ధరలు తగ్గించడంలో విఫలం


నిరసన తెలుపుతున్న నాయకురాళ్లు

కరీంనగర్: నిత్యావసర ధరలు తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ గూడెం లక్ష్మి అన్నారు. నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ ఆనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం ఎదుట, కూరగాయల మార్కెట్లో నిరసన తెలిపారు. పాలకులకు ముందుచూపు లేకపోవడంతో ధరలు పెరిగాయని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా ధరలు పెరగడంతో, ప్రజలు తినడానికే కష్టంగా ఉందని తెలిపారు. నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుబాటులో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన ధరలు తగ్గించాలని లేనిపక్షంలో మహిళలను చైతన్యపరిచి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపెల్లి రాజు, బేబీ, పద్మ, అరుణ, లక్ష్మి, పోతుగంటి శారద, అనురాధ, లీల, సుమతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

కరీంనగర్: జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందికొండ విద్యాసాగర్, చింతపల్లి అశోక్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ రుణాలు, ఫైనల్ చెల్లింపులు, టీఎస్ జీఎల్ఐ అంతిమ చెల్లింపులు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వీటిని ఈ నెలాఖరులోపు జమ చేయాలన్నారు.

అత్యాచార ఘటనలో కేసు నమోదు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహితపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసి వీడియోలు తీసి బెదిరిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. సైదాపూర్ మండలానికి చెందిన సదరు మహిళ తన భర్త, పిల్లలతో కలిసి గత కొన్నాళ్లుగా పట్టణంలో నివాసం ఉంటోంది. పట్టణానికి చెందిన నెల్లి కృష్ణ(33), సైదాపూర్ మండలానికి చెందిన ఖమ్మం సురేశ్(35) తనను మభ్యపెట్టి లోబర్చుకొని గత రెండు నెలలుగా అత్యాచారం చేస్తున్నారని సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

శాతవాహనలో సెమినార్

కరీంనగర్ సిటీ:శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్‌కళాశాలలో తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌ను రిజిస్ట్రార్ వరప్రసాద్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఐపీఆర్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి అధ్యక్షత వహించారు. ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ రాధిక వంగల, అపూర్వ పేటెంట్స్ అప్లికేషన్ ఎలా చేయాలి, వాటి ఆవశ్యకతను వివరించారు.ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సంబంధించి ఐపీఆర్‌సెల్‌ను ప్రారంభించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): 2023–24 విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు గెస్ట్ అధ్యాపకుల ప్రాతిపదికన దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఐఈవో టి.రాజ్యలక్ష్మి తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 24 సాయంత్రం 5 గంటలలోపు పద్మనగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ల ఇంటర్వ్యూ వాయిదా

కరీంనగర్ సిటీ: ఈనెల 21న అతిథి అధ్యాపకులకు నిర్వహించాల్సిన మౌఖిక పరీక్ష వాయిదా వేశామని ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూలు 21వ తేదీన నిర్వహించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ఇచ్చినందున వాయిదా వేశామని పేర్కొన్నారు. అభ్యర్థులు జూలై 25న ఉదయం 10గంటలకు సదరు పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ప్రకృతే 'ప్రీతి'పాత్రం

- చిన్ననాటి నుంచే కదిలించే కవితలు
- ప్రతిష్టాత్మక ఇండియన్ నోబెల్ అవార్డు స్వీకరణ


అవార్డులతో ప్రీతి

కరీంనగర్‌సిటీ: తన చుట్టూ ఉన్న ప్రకృతి, జీవరాశుల గురించే అద్భుతమైన కవితలు రాస్తున్న కరీంనగర్‌కు చెందిన ప్రీతి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నోబెల్ అవార్డుకు ఎంపికైంది. ఇండియన్ నోబెల్ సొసైటీ కౌన్సిల్ ద్వారా బుధవారం అవార్డును స్వీకరించింది. జగిత్యాలలో జన్మించిన ప్రీతి తండ్రి విజయకుమార్ ఎస్‌బీఐలో బ్యాంక్ ఉద్యోగి కాగా తల్లి సౌజన్య గృహిణి. ప్రీతి ఇంటర్ సమయంలో కరీంనగర్‌లోని బ్యాంక్‌కాలనీలో స్థిరపడ్డారు. స్కూల్ సమయంలో తన చుట్టూచూస్తున్న ప్రకృతిపై కవితలు రాయడం ప్రారంభించింది. తరువాత ఫేస్‌బుక్‌లో, అనంతరం పుస్తకాలు రాసి ఇండియాతో పాటు మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ కాపీరైట్స్ సంపాదించింది. 2019లో నెకెడ్‌లవ్, 2021లో సోలిటస్‌సోల్స్ అనే కవితల సంపుటిని సొంతంగా రాసి విడుదల చేసింది. 2020లో పెటల్స్ అనే కవిత పుస్తకం రాయడంలో తన సహకారం అందించింది. పలు దేశాల్లో తన పుస్తకాలు అమ్మకాలు జరిగాయి. ప్రీతి రచనలు హైదరాబాద్‌లోని రైట్‌క్లబ్‌లో రెండో బహుమతి సాధించగా 2021లో ఢిల్లీలోని బుక్ ఫెయిర్‌కు ఎంపికైంది. అమెరికాలోని పోయమ్‌హంటర్‌తో పాటు హెలో పొయెట్రీలో ఆన్‌లైన్ ద్వారా పంపించి మంచి ప్రతిభ కనబరిచి వారి నుంచి ప్రశంసలు అందుకుంది. తాను రాసిన మూడు కవిత సంపుటాలకు మూడు ప్రతిష్టాత్మక అవార్డులు వచ్చాయి.

నూకలమర్రి అమరులకు అరుణోదయ నివాళి


నివాళి అర్పిస్తున్న అమర్, విమలక్క

సిరిసిల్ల: వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో 23 ఏళ్ల కిందట అమరులైన వారికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గురువారం నివాళి అర్పించింది. హైదరాబాద్‌లోని అరుణోదయ ఆఫీస్‌లో నూకలమర్రి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి కూర దేవేందర్ అలియాస్ అమర్, ఆయన భార్య, అరుణోదయ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అమరులకు జోహార్లు అర్పించారు. 23 ఏళ్ల కిందట అమర్ రాసిన 'నల్ల నల్ల రేగళ్ల నల్ల రేగళ్ల ఎర్ర కలువ పూలు పూసే' పాటను విమలక్క బృందం ఆలపించింది. నూకలమర్రి ఎన్‌కౌంటర్‌లో అమరులైన అశోక్, జ్యోతి, చైతన్య, మల్లేశం, గసికంటి పర్శరాములు, సముద్రాల ఎల్లేందర్, దొంతుల రమేశ్‌లకు నివాళి అర్పించారు. అరుణోదయ జంట నగరాల అధ్యక్ష, కార్యదర్శులు పోతుల రమేశ్, రాకేశ్, అరుణోదయ సిటీ కమిటీ సభ్యులు విశాల, హరికృష్ణ, పీడీఎస్‌యూ(విజృంభన) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏపూరి పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పారమిత' అధినేతకు సత్కారం



ప్రసాద్‌రావును సన్మానిస్తున్న టీచర్లు, తల్లిదండ్రులు

కరీంనగర్: విద్యా విజ్ఞానయాత్రలో భాగంగా లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన వివిధ వర్క్‌షాపులు, కాన్ఫరెన్స్‌లలో వారం రోజులు పాల్గొని గురువారం స్వదేశానికి వచ్చిన పారమిత పాఠశాలల అధినేత డా''ఇనుగంటి ప్రసాద్‌రావుకు, విద్యాసంస్థల డైరెక్టర్ రశ్మితకు విద్యార్థుల తల్లిదండ్రులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, జూడో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణ, పీఈటీఏ కార్యదర్శి యూనిస్‌పాషా, పెటా జిల్లా నాయకులు శేఖర్, శ్రీనివాస్, ఈగల్ ట్రస్ట్ అధ్యక్షుడు అశోక్‌రావు, కార్యదర్శులు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, హెచ్‌ఎంలు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, ఎస్‌ఓడి తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు డ్రెస్సుల పంపిణీ



డ్రెస్సులు పంపిణీ చేస్తున్న సభ్యులు

విద్యానగర్: రాజస్థాన్ మహిళా సమాజ్ సభ్యులు గురువారం కరీంనగర్‌లోని అనాథ పిల్లలకు డ్రెస్సులు పంపిణీ చేశారు. ముకరంపురాలోని అనాథ బాలల ఆశ్రమంలోని వారికి, బొమ్మకల్ ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లలకు వందమందికి డ్రెస్సులు, బిస్కెట్లు, స్వీట్లు పంచిపెట్టారు. డ్రెస్సులు పంపిణీ చేసిన వారిలో రాజస్థాన్ మహిళా సమాజ్ బాధ్యులు సునంద ముందడా, సరళముందడా, శీతల్, ఉర్మిళ సోని, సునీత ముందడా, శ్వేత గుప్త, కల్పన ఉన్నారు.

నటేశ్వరశర్మకు అభినందన

కరీంనగర్ కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా సాహిత్య రంగంలో అందించే ప్రతిష్ఠాత్మక దాశరథి కృష్ణమాచార్య అవార్డు – 2023కు ఎంపికైన సంస్కృతాంధ్ర పండితుడు, కవి, అవధాని అయాచితం నటేశ్వరశర్మకు జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య సాహితీగౌతమి సభ్యులు అభినందించారు. అధ్యక్ష ప్రధానకార్యదర్శులు నంది శ్రీనివాస్, అనిల్‌కుమార్, సహాధ్యక్షుడు డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కోశాధికారి స్తంభంకాడి గంగాధర్, గాజుల రవీందర్, దొమ్మాటి శంకర్‌ప్రసాద్, రేగులపాటి విజయలక్ష్మి, నీలగిరి అనిత తదితరులున్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్సకు స్పందన



ఆక్యు ప్రెషర్ చికిత్సకు హాజరైన పలువురు

సప్తగిరికాలనీ: స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని పెన్షన్ భవన్‌లో గురువారం నిర్వహించిన ఆక్యుప్రెషర్ చికిత్సకు స్పందన లభించింది. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మోసం అంజయ్య, ప్రధాన కార్యదర్శి మహేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వృద్ధులతో పాటు మహిళలకు ఈ ఆక్యుప్రెషర్ చికిత్స చాలా ఉపయోగపడుతుందని యువకులు సైతంముందుకు వస్తున్నారని, ఇది చాలా సులభమైన చికిత్స అని ఏ లాంటి ఖర్చు లేకుండానే అన్నిరోగాలను నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గోస్వామి, మహేందర్‌సింగ్, భుపేందర్ చౌదరి, బి.నరేందర్, రాంచందర్, పురుషోత్తం చంద్రయ్య, లక్ష్మీనారాయణ, నాగ మోహన్, గాలి మోహన్, రామచంద్రం పాల్గొన్నారు.

నగరంలో నైట్ ఫుడ్ బజార్లు

- శాతవాహన యూనివర్సిటీ వద్ద పనులు ప్రారంభం
- త్వరలో కేబుల్ బ్రిడ్జి సమీపంలో...
- అందుబాటులోకి తెచ్చేందుకు నగరపాలకసంస్థ చర్యలు



శాతవాహన వర్సిటీ వద్ద నైట్ ఫుడ్ బజార్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో త్వరలో నైట్‌ఫుడ్ బజార్‌లు రానున్నాయి. నగరవాసులకు రాత్రిళ్లు ఆహార పదార్థాలు అందించేందుకు నగరపాలక సంస్థ నైట్‌ఫుడ్ బజార్‌లు ఏర్పాటుచేస్తోంది. నగరంలో రెండుచోట్ల ఏర్పాటుచేసేందుకు అధికారులు సంకల్పించారు. ఈక్రమంలో ముందుగా విద్యానగర్ శాతవాహన యూనివర్సిటీ వద్ద నైట్ ఫుడ్ బజార్ ఏర్పాటుకు పనులను ఇప్పటికే ప్రారంభించింది. టైల్స్ నిర్మాణం పూర్తికాగా, ఆహార పదార్థాల ఏర్పాటుకు స్టాల్స్, లైటింగ్ సిస్టమ్, కూర్చునేందుకు వీలుగా, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. మొదట శాతవాహన యూనివర్సిటీ వద్ద నైట్‌ఫుడ్ బజార్ ప్రారంభించేందుకు పనులు వేగవంతం చేస్తున్నారు. ఆ తర్వాత హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలోని కేబుల్‌బ్రిడ్జి వద్ద నైట్ ఫుడ్‌బజార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీలో ఎంపికైన తర్వాత నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే సిటీ కల్చర్‌లో భాగంగా ఈ నైట్‌ఫుడ్ బజార్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

నెలరోజుల్లో పూర్తిచేయాలి..

నగర ప్రజలకు త్వరలోనే నైట్ ఫుడ్ బజార్‌ను అందుబాటులోకి తెస్తున్నామని మేయర్ యాదగిరి





నైట్ ఫుడ్ కోర్టు నమూనా చిత్రం

సునీల్‌రావు అన్నారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో మల్కాపూర్ రోడ్డు శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేస్తున్న నైట్ ఫుడ్‌బజార్ స్థలాన్ని గురువారం పరిశీలించారు. నైట్ ఫుడ్‌బజార్ ఏర్పాటుకు సంబంధించి తయారు చేసిన డిజైన్‌ను పరిశీలించి అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనులు వెంటనే ప్రారంభించి నెలరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నగర ప్రజలు రాత్రివేళల్లో కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో అవసరమైన ఫుడ్ తీసుకొనేలా నైట్‌ఫుడ్ బజార్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. యూనివర్సిటీతో పాటు నగరంలోని కేబుల్ బ్రిడ్జి, ఇతర ప్రాంతాల్లో కూడా నైట్‌ఫుడ్ బజార్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సేవా ఇస్లావత్, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ మహేందర్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ నిఖిత, ఆర్వీ అధికారులు సందీప్, హరికృష్ణ, మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్నేషనల్ చెస్ డే

కరీంనగర్‌స్పోర్ట్స్: ఇంటర్నేషనల్ చెస్‌డే వేడుకలను గురువారం స్థానిక జ్యోతినగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ కోచ్ కంకటి అనూప్‌కుమార్ విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా అనూప్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి చెస్‌లో గ్రాండ్ మాస్టర్‌ను అందించాలన్నదే తనలక్ష్యమన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అకాడమీ కోఆర్డినేటర్ కంకటి సృజన్‌కుమార్, కోచ్ తరుణ్, అరుణ్, రేవిక్, అభిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు...

కరీంనగర్ జిల్లాకేంద్రంలోని వైశ్యాభవన్‌లో నిర్వహించిన చెస్‌పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన బి. శ్రీ గౌరీప్రసన్న ప్రథమస్థానంతో పాటు రూ.1500, మామిడి శరణ్య ద్వితీయ స్థానంతో పాటు రూ. 1000, తాటిపల్లి విశాల్ రూ.1000 నగదు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు, పాఠశాలకు పేరు తేవాలన్నారు.

మానేరులో ఇంటర్నేషనల్ చెస్ డే..

కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలో అంతర్జాతీయ చెస్ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు



జీనియస్ చెస్ అకాడమీలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్, కోచ్ అనూప్‌కుమార్



చెస్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

చెస్‌పోటీలు నిర్వహించారు. అంతకుముందు చెస్ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి చెస్ పోటీలు ప్రారంభించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి ప్రిన్సిపాల్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ చెస్ అకాడమీలో వేడుకలు..



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

అంతర్జాతీయ చదరంగ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టుచౌరస్తాలోని విశ్వనాథ్ చెస్ అకాడమీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. డెర్మటాలజిస్ట్ డాక్టర్ జ్యోతి హాజరై కేక్‌కట్‌చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వహకులు ఏ.విశ్వనాథ్, ప్రసాద్, భవానీ, రాజేంద్రప్రసాద్, శివయ్య, శ్రేయ, మారుతి–సంధ్య, కొమురయ్య–సంధ్య, తేజ్‌పాల్‌కౌర్ పాల్గొన్నారు.

రుణమాఫీ వడ్డీతో సహా చెల్లించాలి

కరీంనగర్‌టౌన్: రైతులకు రూ. లక్ష రుణమాఫీ వడ్డీతో సహా చెల్లించాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం రైతుల రుణమాఫీ అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, వాసుదేవరెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, గంగారెడ్డి, సంపత్‌రావు, గుర్రాల వెంకట్‌రెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, సొల్లు అజయ్ వర్మ బొంతల కల్యాణ్, సమ్మిరెడ్డి, జానపట్ల స్వామి, సమ్మిరెడ్డి, శివారెడ్డి, మోహన్, రమణారెడ్డి, నారాయణ, పూర్ణచందర్, దేవేందర్, అనిల్, ఐలయ్య, జగ్గారెడ్డి, రవి, కోటి, సుధాకర్, కనకయ్య, రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

నగరంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. 35వ డివిజన్ సప్తగిరి కాలనీ రోడ్డులో రూ.30 లక్షలతో చేపట్టదుతున్న సీసీరోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ పైప్‌లైన్ పనులకు గురువారం కార్పొరేటర్ బుచ్చిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అభివృద్ధి పనులకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. 35వ డివిజన్‌లో పెండింగ్ పనులను మూడు నెలల్లో పూర్తిచేస్తామన్నారు కమిషనర్ సేవా ఇస్లావత్, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ మహేందర్, డీఈ మసూద్‌అలీ పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

- అల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నగరంలోని కోరా, జాన్సన్ పాఠశాలల్లో నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సింహచలం హరికృష్ణ మాట్లాడుతూ.. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహార లోపంతో మానసిక, శారీరక అభివృద్ధి క్షీణిస్తోందని, దీనిని నియంత్రించడానికి బలమైన ఆహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, వంగల సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ వాయిదా

కరీంనగర్‌టౌన్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా వేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు విస్తృతంగా కురుస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించింది. దీంతో తాత్కాలికంగా మాత్రల పంపిణీ వాయిదా వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ కే.లలితాదేవి తెలిపారు. మాత్రల పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా ఓ.వెంకటేశ్‌ను నియమిస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు పనిచేసిన జి.వెంకటేశ్వర్లును జగిత్యాల సీసీఎస్ సీఐగా బదిలీచేశారు.

వివేకానంద కళాశాలలో జీఎస్టీపై శిక్షణ



కరీంనగర్ సిటీ: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్‌స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టాలీ, జీఎస్టీపై మూడు రోజులపాటు శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ (టీపీవో)మహమ్మద్ అబ్దుల్ సలీం తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటరైజ్‌డ్ అకౌంటింగ్‌తో పాటు టాలీ, జీఎస్టీపై పట్టు సాధించినట్లయితే మంచి ఉద్యోగాలు సాధించొచ్చని తెలిపారు. ఏసీవో బండి సంపత్‌కుమార్, ఏవో బండి శ్రవణ్‌కుమార్, బి.రామేశ్వరరావు పాల్గొన్నారు.

ముందస్తుగా 'బోయినపల్లి' బర్త్‌డే



కేక్‌కట్ చేస్తున్న వినోద్‌కుమార్, సునీల్‌రావు



పుస్తకం అందిస్తున్న గ్రంథాలయసంస్థ చైర్మన్

కరీంనగర్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ముందస్తు జన్మదిన వేడుకలను నగరంలోని 33 డివిజన్ వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆధ్వర్యంలో బర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ కేక్ కట్‌చేశారు. మేయర్ సునీల్‌రావు వినోద్‌కుమార్‌కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ వినోద్‌కుమార్ నివాసంలో కేక్‌కట్ చేసి వినోద్‌కుమార్‌కు పుస్తకాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులకు పంపిణీ చేసే గ్రూప్–2, గురుకుల పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని గ్రంథాలయ చైర్మన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేచినేని వనజ అశోకరావు, టీఆర్‌ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, దూలం సంపత్, గందె కల్పన, బీఆర్‌ఎస్‌వీ నాయకులు చుక్క శ్రీనివాస్, ఆరె రవిగౌడ్, సోమిరెడ్డి నరేష్‌రెడ్డి, వడ్లకొండ పర్శరాం, మోహన్, శివకుమార్, సంతోష్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను వేధించే వారిపై చర్యతీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని వీధి వ్యాపారులకు వేధింపులు ఎక్కువయ్యాయనిఆరోపిస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆందోళన చేపట్టింది. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా కన్వీనర్ సురేష్ మాట్లాడుతూ వీధి వ్యాపారులను నగరపాలక సంస్థ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయం పక్కన సుద్దాల మల్లవ్వ అనే మహిళ టీకొట్టును తొలగించారన్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యాయత్నం చేసిందని, ఈ ఘటనకు కారకులపై చర్యతీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ధర్నా సందర్భంగా పోలీసులతో మహిళలు వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పసుల శ్రవణ్, నక్క అరుణ ఎండీ.సుల్తాన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

విజిలెన్స్ అధికారులతో విచారణ జరపండి

కరీంనగర్‌టౌన్: నగరపాలక సంస్థలో అవినీతి అక్రమాలు జరిగాయని అధికార పార్టీ కార్పొరేటర్ స్వయంగా బహిర్గతం చేయడం ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం కరీంనగర్ నగర ప్రజలను విస్మయానికి గురి చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఎద్దేవా చేశారు. అవినీతి అక్రమాలపై ఒక డీఈస్థాయి అధికారులు బాధ్యుడిని చేయడం సరికాదని మరింత లోతుగా విచారణ జరిపి ఏఈ స్థాయి అధికారి నుంచి ఎస్ఈ వరకు కమిషనర్ స్థాయిలో విజిలెన్స్ అధికారులతో విచారణచేయించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని, అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ దొంగ బిల్లులు పెట్టిడబ్బులు కాజేశారని ఫిర్యాదుచేస్తే ఈ అంశాన్ని ఏలా అర్థం చేసుకోవాలన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను విజిలెన్స్ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్డీవోకు సన్మానం

సప్తగిరికాలనీ: కరీంనగర్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన కుందారపు మహేశ్‌ను గురువారం పూర్వ విద్యార్థులు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఎస్ఈఎస్ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థులు ఎన్నం ప్రకాశ్, బాలసంకుల నేతాజీ, రాచమల్ల రాజు, కండెం శ్రీధర్, కట్ల శ్రీధర్‌రెడ్డి, నక్క బాలయ్య, యస్వాడ కృష్ణ, ఎస్‌కే.పాషా, ఎడ్ల శంకర్ పాల్గొన్నారు.



ఆర్డీవోను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

23న బీఎస్పీ జిల్లా మహిళా సదస్సు

విద్యానగర్: బీఎస్పీ జోనల్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న కరీంనగర్‌లో మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు జోనల్ మహిళా కన్వీనర్ జున్ను స్వరూప తెలిపారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్‌తో కలిసి వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కరీంనగర్‌లో నిర్వహించే మహిళా సదస్సుకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించాలంటే బీఎస్పీ వెంట నడవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలకు యాభైశాతం సీట్లు కేటాయించే పార్టీ కేవలం బీఎస్పీ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ సావనపెల్లి లక్ష్మీ, మానకొండూర్ అసెంబ్లీ మహిళా కన్వీనర్ నిశాని సుమలత, కరీంనగర్ అసెంబ్లీ మహిళా కన్వీనర్ అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్ నాయకులు కొంకటి శేఖర్, మంద రవీందర్, మాంకాళి తిరుపతి, బండపెల్లి శ్రీకాంత్, మహ్మద్ షమీమ్, కాంత పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

'నిరుద్యోగులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'

కొత్తపల్లి: ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకుండానే ముందస్తు ఎన్నికలకు వెళ్తున్న రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి జి.తిరుపతి మండిపడ్డారు. కొత్తపల్లిలో గురువారం నిర్వహించిన డీవైఎఫ్ఐ మండల కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. వివిధ శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించి ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టకుండా ఎన్నికల నోటిఫికేషన్‌పై దృష్టిసారించడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న ఎన్నికల హామీ అటకెక్కిందన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ లేక నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీచేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.సురేశ్, మండల అధ్యక్షుడు వినయ్,మహేశ్, అఫ్జల్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

మూసీ స్కైవే ప్రతిపాదన రాలేదు

పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నదిపై స్కైవే నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం ఎటువంటి ప్రతిపాదనను అందుకోలేదని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రతిపాదన రాలేదన్నారు. అంతేగాక 2014 నుంచి తెలంగాణలో ఎన్ఆర్‌సీపీ కింద కొనసాగుతున్న ప్రాజెక్ట్ లేదని.. మూసీ నది కాలుష్య నివారణకు ఎటువంటి ప్రతిపాదన కూడా కేంద్రం పరిశీలనలో లేదని బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత అడిగిన ప్రశ్నలకు షెకావత్ లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. కాగా తెలంగాణలో, మూసీ నది పరిరక్షణ కోసం ఎన్ఆర్‌సీపీ కింద రూ.335.65 కోట్ల వ్యయంతో కాలుష్య నివారణ పనులు మంజూరు చేసినట్లు షెకావత్ తెలిపారు. కాగా 2020లో హైదరాబాద్‌లో మూసీ నది పరిరక్షణకు సంబంధించిన 4 ఎస్‌టీపీ ప్రాజెక్టుల ప్రతిపాదనలను జలశక్తి మంత్రిత్వ శాఖ పరిశీలనలతో రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సవరించిన ప్రతిపాదనను ఇప్పటివరకు కేంద్రానికి సమర్పించలేదని షెకావత్ వెల్లడించారు.

రహదారులకు రూ. 37 వేల కోట్లు...

తెలంగాణలో 1,958 కిలోమీటర్ల పొడవున్న 71 రహదారుల నిర్మాణ ప్రాజెక్టులకు గత మూడేళ్లలో రూ.37,069 కోట్లు మంజూరు చేశామని.. అందులో గత నెల 30వ తేదీ వరకు రూ.2,580 కోట్లు సివిల్ పనులకు ఖర్చు చేసినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

కోర్టుకు గైర్హాజరైనా చర్యలు వద్దు: హైకోర్టు

భారీ వర్షాలతో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులు, కక్షిదారులు శుక్రవారం కోర్టుకు హాజరుకాకపోయినా ఎలాంటి ప్రతికూల ఆదేశాలు, వారెంట్లు జారీ చేయవద్దని కింది కోర్టులకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాసంస్థలకు సెలవులు..

పరీక్షలు వాయిదా

ఎడతెరిపిలేని వానలతో ప్రభుత్వం అప్రమత్తం

- గురు, శుక్రవారాలు బంద్.. వానలు తగ్గకపోతే మరో రోజూ సెలవు
- గురువారం పిల్లలు స్కూళ్లకు చేరాక సెలవు ప్రకటనతో ఇబ్బంది
- యూనివర్సిటీ పరిధిలో అన్ని పరీక్షలు రద్దు
- వానలతో పలుచోట్ల విద్యుత్, ఇంటర్నెట్‌కు అంతరాయం
- ఇంజనీరింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంచాలని విద్యార్థుల విజ్ఞప్తి
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు సెలవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు పడుతుండటంతో ప్రభుత్వం గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. వానలు తగ్గకపోతే శనివారం కూడా సెలవు ఇవ్వాలని క్షేత్రస్థాయిలో అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన పలు పరీక్షలను రద్దు చేశారు. అన్ని యూనివర్సిటీల పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగే ఇంటర్నల్ పరీక్షలను రద్దు చేశారు. వీటిని తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని అధికారులు చెప్పారు. ఇక ఇంజనీరింగ్ సహా వివిధ రకాల కౌన్సెలింగ్‌ల తేదీలను మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

అకస్మాత్తుగా సెలవు నిర్ణయంతో..

రెండు రోజులుగా వానలు పడుతుండటంతో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వచ్చాయి. కానీ దీనిపై బుధవారం రాత్రి వరకు కూడా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రెండు రోజుల పాటు సెలవులు ఇస్తున్నట్టుగా గురువారం ఉదయం ప్రకటించారు. ఇది కూడా జిల్లా అధికారులకు మెసేజీల ద్వారా తెలిపారు. మీడియాకు సమాచారం ఇవ్వలేదు. దీనితో సెలవుల విషయం తెలిసేసరికే విద్యార్థులంతా వానలో ఇబ్బందిపడుతూనే స్కూళ్లకు చేరారు. కొన్నిచోట్ల అప్పటికప్పుడే విద్యార్థులను తిప్పి పంపేయగా.. మరికొన్ని విద్యా సంస్థలు ఒంటి గంట వరకు ఇళ్లకు పంపించాయి. ఆటోల్లో, సైకిళ్లపై, నడుచుకుంటూ బడులకు వచ్చే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సెలవు విషయం తెలియడంతో తల్లిదండ్రులు హడావుడిగా స్కూళ్ల వద్దకు వచ్చి పిల్లలను తీసుకెళ్లాల్సి వచ్చింది.

ఇంటర్నెట్ ఇబ్బందితో..

ఎంసెట్ తొలివిడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఇటీవలే మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ నెల 22 నాటికల్లా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంది. రెండు రోజులుగా వానలతో పలుచోట్ల విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్‌కు అంతరాయం ఏర్పడింది. దీనితో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని, సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పొడిగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఉన్నత విద్యా మండలి అధికారి ఒకరు తెలిపారు. ఇక గురువారం జరగాల్సిన టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు సాంకేతిక విద్యా మండలి ప్రకటించింది.

హాస్టళ్ల నుంచి ఇళ్లకు..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్ల చుట్టూ నీరు చేరడం, పలుచోట్ల పైకప్పుల నుంచి నీరు కారడంతో ఇబ్బందిగా మారిందని సిబ్బంది వాపోతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్ర, శనివారాలు సెలవు

ఎడతెరిపిలేని వానల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్నిరకాల విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. వైద్యం, పాల సరఫరా వంటి అత్యవసర సేవలు కొనసాగుతాయని తెలిపింది. ప్రైవేటు సంస్థలు కూడా వారి కార్యాలయాలకు సెలవులు ప్రకటించేలా చర్యలు చేపట్టాలని కార్మికశాఖను ఆదేశించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి జీహెచ్ఎంసీ పరిధిలో విద్యాసంస్థలు, ప్రభుత్వ/ప్రైవేటు కార్యాలయాలకు రెండు రోజుల సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

- విప్లవ సాహిత్యంతోపాటు రూ.3.40లక్షల నగదు స్వాధీనం

కొత్తగూడెం టౌన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడితో పాటు మరో దళ సభ్యుడిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కొత్తగూడెంలో గురువారం ఎస్పీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని చర్ల బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు తనిఖీలు చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ అశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన తోట సీతారామయ్య, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన పాదం రాజ్‌కుమార్‌గా తేలింది. తోట సీతారామయ్య అలియాస్ కృష్ణన్న అలియాస్ సంజీవ్ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాజ్‌కుమార్ అలియాస్ అమరేందర్ దళ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. వీరి నుంచి విప్లవ సాహిత్యం, రివాల్వర్, 6 రౌండ్లు(తూటాలు), రూ.3,40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. రహస్యంగా పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు హైదరాబాద్ వెళ్తున్న సీతారామయ్యను ప్రొటెక్షన్ టీం సభ్యుడైన నరేష్(ఏసీఎం) మోటార్ సైకిల్‌పై చర్లకు తీసుకొచ్చి, మావోయిస్టు దళ సభ్యుడు పాదం రాజ్‌కుమార్‌ను పరిచయం చేసి వెళ్లాడు. ఆ తర్వాత వీరిద్దరూ చర్ల బస్టాండ్ సెంటర్‌లో ఉండగా పట్టుబడ్డారు. వీరిపై ఉపా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులపై దాడులు, తదితర ఘటనల్లో పాల్గొన్న సీతారామయ్యపై రూ.20 లక్షలు, రాజ్‌కుమార్‌పై రూ.లక్ష రివార్డు ఉందని ఆయన వెల్లడించారు.

మరోసారి వాయిదా కోరొద్దు..

ఓటుకు కోట్లు కేసులో రేవంత్ న్యాయవాదికి సుప్రీం స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. విచారణపై మరోసారి వాయిదా కోరవద్దంటూ రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదిని ఉద్దేశించి పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యలు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా విచారణ వాయిదా వేయాలని రేవంత్ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది హరీన్ రావెల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో రివిజన్ పిటిషన్ పరిస్థితి ఏంటని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా... గత ఆగస్టు నుంచి పిటిషన్ విచారణకు రాకుండా వాయిదాలు కోరి జాప్యం చేస్తున్నారని హరీన్‌రావెల్ చెప్పారు. విచారణ వాయిదా ఎందుకని ధర్మాసనం ప్రశ్నించగా ఓటుకు కోట్లు కేసుకు అవినీతి నిరోధక చట్టం వర్తించదని రేవంత్ న్యాయవాది తెలిపారు. చట్టం ఎందుకు వర్తించదని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేశారని అభియోగం మోపారని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం సివిల్ కోర్టులు దీనిపై నిర్ణయం తీసుకోలేవని రేవంత్ తరఫు న్యాయవాది తెలిపారు. ఈ విషయం తేల్చాల్సింది ట్రయల్ కోర్టు అని, తాము కాదని జస్టిస్ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఆగస్టు 28తో ప్రారంభయ్యే వారానికి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది.



న్యాయవాదుల మనోభావాలు దెబ్బతినేలా వారిపై అనుచితవ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలిని కలసి వినతిపత్రం సమర్పించారు.

– యాకుత్‌పురా

ప్రపంచంతో పోటీ

- మా పిల్లలను వెస్టర్న్ వరల్డ్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం
- ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై హైపవర్ వర్కింగ్ గ్రూపుతో భేటీలో ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధిని అందించాల్సి ఉందని, ఆ మేరకు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికకు రూపకల్పన చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా బోధనలో, శిక్షణలో ఫ్యూచర్ టెక్నాలజీ వినియోగంపై కార్యాచరణ రూపొందించాలన్నారు. ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో హైపవర్ వర్కింగ్ గ్రూపుతో సమావేశం అయ్యారు. విద్యా శాఖ, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావివ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఐబీ (ఇంటర్‌నేషనల్ బాకలారియేట్)తో కలిసి ఒక కొత్త సిలబస్‌ను రూపొందించబోతున్నామని, అది దేశానికే బెంచ్ మార్క్ కాబోతుందని సీఎం జగన్ తెలిపారు. ఐబీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో కలిసి టీచింగ్ మెథడాలజీని, పాఠ్య ప్రణాళికను మార్చబోతున్నామని.. దీనికి మీ సహకారం అవసరమని కోరారు. తద్వారా ఈ కల సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. 'వెస్టర్న్ వరల్డ్‌లో ఉన్న బోధనా స్థాయిలను అలవర్చుకుంటేనే మన పిల్లలు కూడా ఆ స్థాయికి చేరి పోటీ పడగలుగుతారు. దీని కోసం ప్రశ్నా విధానం, పిల్లలకు బోధించే విధానంలో కూడా మార్పు రావాలి. కరిక్యులమ్‌లో కూడా మనం వాళ్లకంటే ఏ మేరకు మెరుగు పరుచుకోవాలన్న విషయాన్ని పరిశీలించాలి. ఇందుకు పాఠశాల స్థాయిలో కూడా బోధన, బోధనా విధానాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలన్నది ఆలోచించాలి. స్టేట్ సిలబస్, నేషనల్ సిలబస్, సీబీఎస్ఈ వంటి అంశాలకే పరిమితం కాకుండా ఇంకా ముందుకు అడుగులు వేయాలి. ఉన్నత విద్యలో పరీక్షా విధానం, మెథడాలజీ, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తీసుకురావాల్సిన మార్పులపై దృష్టి సారించాలి. వెస్టర్న్ వరల్డ్ తరహాలో మరిన్ని వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై అధ్యయనం చేయాలి. వర్చువల్ టీచింగ్, వర్చువల్ కంటెంట్ అందుబాటులోకి తేవాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో వస్తున్న మార్పులను కరిక్యులమ్‌లో భాగం చేయాలి. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఎలా భాగస్వామ్యం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలి. సులభంగా అర్థమయ్యేలా ఆచరణీయంగా ఉండేలా మార్పు చేయాలి' అని సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారు.

వర్ధన్నపేట్ నుంచి పోటీకి రిటైర్డ్ సీపీ కసరత్తు?

ఖలీల్‌వాడి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట్ శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నిజామాబాద్ రిటైర్డ్ సీపీ కేఆర్ నాగరాజు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన తొలుత బీఆర్ఎస్ టికెట్‌పై ఉమ్మడి వరంగల్ నుంచి పోటీ చేస్తారని జిల్లాలో ప్రచారం జరిగింది. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ వర్గాలు చర్చించుకున్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కారులో సీట్లు ఫుల్ కావడంతో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి బీఆర్ఎస్ అధిష్టానం నుంచి ఆయనకు స్పష్టత రాలేదని తెలిసింది. దీంతో రిటైర్డ్ సీపీ ఇతర పార్టీల వైపు చూస్తున్నారని సమాచారం. ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ సభలో ప్రియాంక గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

మంత్రి గారూ.. మన రోడ్లు చూశారా..!





మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లా కేంద్రంలో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే శివాజీ చౌక్‌లో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు కిందపడిన ఘటనలు ఉన్నాయి. హైదరాబాద్, మంచిర్యాల, భైంసా వెళ్లే వాహనాలు ఈ చౌక్ మీదుగానే రాకపోకలు కొనసాగిస్తుంటాయి. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి నిత్యం ఈ చౌక్ మీదుగానే రాకపోకలు సాగిస్తారు. అయినా గుంతల గురించి పట్టించుకునేవారు లేరు. గురువారం మంత్రి కారు గుంతల మీదుగానే వెళ్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

26మంది ఎస్సైలకు తాత్కాలిక పోస్టింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఇతర జిల్లాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్సైలతోపాటు జిల్లాలో పని చేస్తున్న పలువురు ఎస్సైలకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆయా పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సై పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన పోలీస్‌స్టేషన్
డీ సుమన్	ఉట్నూర్	డీఎస్బీ, ఆదిలాబాద్
ఎల్.ప్రవీణ్	గుడిహత్నూర్	డీఎస్బీ, ఆదిలాబాద్
సయ్యద్ ఇమ్రాన్	గాదిగూడ	గుడిహత్నూర్
జీ మహేశ్	ఉట్నూర్ సెకండ్ ఎస్సై	గాదిగూడ
డీ రాధిక	భీంపూర్	బేల
లాల్‌సింగ్	ఆదిలాబాద్ టూటౌన్	భీంపూర్
ధనశ్రీ	తాంసి	తలమడుగు
ఎల్.శ్రీకాంత్	ఇచ్చోడ సెకండ్ ఎస్సై	సిరికొండ
నవీన్ బుర్ర	నిజామాబాద్	వన్‌టౌన్, ఆదిలాబాద్
కే సందీప్	నిజామాబాద్	బజార్‌హత్నూర్
బీ రాము	నిజామాబాద్	బోథ్
జీ నగేశ్	నిజామాబాద్	ఇచ్చోడ
గోవింద్	నిజామాబాద్	సెకండ్ ఎస్సై, ఆదిలాబాద్‌రూరల్
బీ శివరాం	నిజామాబాద్	తాంసి
సంతోష్‌రెడ్డి	నిజామాబాద్	డీఎస్బీ, ఆదిలాబాద్
సంజీవ్‌రావు	నిజామాబాద్	మహిళా పోలీస్‌స్టేషన్, ఆదిలాబాద్
ఆర్.లక్ష్మయ్య	నిజామాబాద్	సీసీఎస్, ఆదిలాబాద్
దేవికుమార్ దయావంతి	నిజామాబాద్	టూటౌన్, ఆదిలాబాద్
ఆనంద్‌సాగర్	నిజామాబాద్	ఇచ్చోడ, సెకండ్ ఎస్సై
రహమతుల్లా	నిజామాబాద్	మావల, సెకండ్ ఎస్సై
పుష్పవతి	నిజామాబాద్	మహిళా పోలీస్‌స్టేషన్
కే హీరాలాల్	నిజామాబాద్	డీఎస్బీ, ఆదిలాబాద్
సాయన్న సుంకరి	నిజామాబాద్	డీఎస్బీ, ఆదిలాబాద్
హబీబ్‌ఖాన్	నిజామాబాద్	వన్‌టౌన్, ఆదిలాబాద్
బీ ఉదయ్‌కుమార్	నిజామాబాద్	వన్‌టౌన్, ఆదిలాబాద్
ఎస్.సాయన్న	నిజామాబాద్	ఉట్నూర్, సెకండ్ ఎస్సై

ఆఫీస్ సబార్డినేట్


పోస్టుల అప్‌గ్రేడేషన్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్(అటెండర్) పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడేషన్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల కింద నియామకాలు చేసే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా లేకపోవడంతో చాలామంది కారుణ్య నియామకాల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉండడంతో వాటిని కారుణ్య నియామకాల కింద భర్తీ చేసేందుకు వీలుగా అప్‌గ్రేడేషన్ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 166 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడేషన్ అయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 34, కుమురంభీం జిల్లాలో 54, మంచిర్యాల జిల్లాలో 45, నిర్మల్ జిల్లాలో 33 పోస్టులు ఉన్నాయి.

కడెం ప్రాజెక్ట్‌కు

భారీగా వరద

- రెండు గేట్లు ఎత్తిన అధికారులు



ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్ట్‌కు గురువారం భారీగా వరద వస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 12,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు రెండు గేట్ల ఎత్తి 11,180 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 691 అడుగుల నీటి మట్టం ఉంది. సాయంత్రానికి ఇన్‌ఫ్లో 9,667 క్యూసెక్కులకు తగ్గిందని అధికారులు తెలిపారు.

గడ్డెన్నవాగుకు స్వల్పంగా వరద

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షానికి గురువారం ప్రాజెక్టులోకి 475 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.10 మీటర్ల నీరు నిల్వ ఉంది.

అల్లరి పిడుగుల ఆటల పోటీలు

- రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌కు ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- 24 నుంచి 26 వరకు ఎంపిక పోటీలు
- ఒక రోజు ముందుగానే విద్యార్థులు రిపోర్టు చేయాలి
- మెరిట్ ఆధారంగా సీటు



రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 24 నుంచి రాష్ట్రస్థాయి శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించగా ఆయా జిల్లాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆయా జిల్లాల యువజన క్రీడాశాఖ అధికారులు ప్రకటించారు. ఒక్కో జిల్లానుంచి 4వ, 5వ తరగతులకు గాను 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపించనున్నారు. హకీంపేటలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరగనున్నాయి.

ఎంపికైన విద్యార్థులు వీరే...

కరీంనగర్ జిల్లా...

- 25న మధ్యాహ్నం 2 గంటలకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రిపోర్టు చేయాలి.
- 26న శారీరక సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తారు..

4వ తరగతి బాలురు...

ఎ. హర్షవర్దన్ (సైదాపూర్), ఈ.సుచిత్‌రాయ్ (రంగాపూర్), వి.చక్రిత్ (కొలిమికుంట), ఎల్. బాలజీ (భూపాలపట్నం), ఎస్.విశ్వతేజ (హుజూరాబాద్), కె. మిథున్ (గర్షకుర్తి), టి.అభిరామ్ (బోర్నపల్లి), కె. వర్షిత్ (చల్లూర్), వి.మాన్విక్ (సుందరగిరి), జె. అభిమన్యు (కరీంనగర్)...

4వ తరగతి బాలికలు...

పి.రితిక, పి.శ్రీలాస్య (సుందరగిరి), డి. శ్రీవర్షిణి (కొత్తపల్లి), పి.నవ్యశ్రీ (రామడుగు), కె.అమూల్య, ఎస్. సుభానంద (కరీంనగర్), ఎ. అనన్య, జి.మాళవిక, లాస్య (గుమ్లాపూర్) సురక్షిత (మోతె)...

5వ తరగతి బాలురు...

బి.ప్రణయ్ (కాసీంపేట), బి. సాయిప్రణీత్ (కరీంనగర్), పి.విక్రాంత్ (మొలంగూర్), ఎండీ. సుఫీయాన్ (గర్షకుర్తి), బి.రోహిత్ (చొప్పదండి), ఎం. మిత్రేయ సింహ (హుజురాబాద్), జి.రాం చరణ్ (నాగిరెడ్డి పూర్), వి. ప్రణీత్ (నగునూర్), జి. రాజేశ్ (మెట్‌పల్లి), జి.మహేశ్ (గంగాధర)..

5వ తరగతి బాలికలు...

సీహెచ్.గీతాంజలి (హుజూరాబాద్), ఎ.అక్షిత (రామలింగంపల్లి), టి. జాస్నవి (వెదురుగట్టు), బి.వర్షిణి (పెద్దపాపయ్యపల్లి), కె. నిత్యశ్రీ (మొత్కులగూడెం), ఎస్. తేజస్వీ (టేకుర్తి), డి. వర్షిణి (హన్మాజీపల్లి), ఆర్. మనస్వినీ (హన్మాజీపల్లి), జి. మనస్వినీ (బొమ్మకల్), టి. శ్రీదేవి (కరీంనగర్)..

పెద్దపల్లి జిల్లా...

- 23న మధ్యాహ్నం 2 గంటలకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రిపోర్టు చేయాలి,
- 24న శారీరక సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తారు..

4వ తరగతి బాలురు...

బి.అర్జున్ (ఎలిగేడ్), టి. మధుకర్ (శ్రీరాంపూర్), ఎం. లక్కీ, ఆర్. కార్తీక్ (ఓదెల), ఆర్. విశ్వ వీక్షిత్ (పాలకుర్తి), జి. అఖిల్‌సాయి (రామగుండం), ఎస్. రఘువరుణ్ (పెద్దపల్లి), పి. రిశ్వంత్ (జూలపల్లి), డి. అభిరామ్ (కమాన్‌పూర్)..

4వ తరగతి బాలికలు...

డి. మోక్షిత, ఎన్. జాహ్నవి (ధర్మారం), కె. నవ్యశ్రీ, ఏ. అనన్య (కమాన్‌పూర్),

5వ తరగతి బాలురు...

జె.హరిహరణ్ యాదవ్ (ధర్మారం), బి.హనీశ్ (అంతర్గాం), ఎస్. సిద్ధార్థ (సుల్తానాబాద్), ఎ. అశ్వత్ తేజ (జూలపల్లి), కె. హృదిక్ వర్ధన్, ఆర్. మణిదీప్ (రామగుండం), జె. మణిచరణ్, టి. శివకుమార్ (శ్రీరాంపూర్), ఎం. అమన్ (కమాన్‌పూర్), ఎం. సహర్ష (ఓదెల)..

5వ తరగతి బాలికలు...

బి. శ్రీవర్షిణి (మంథని)..

రాజన్న సిరిసిల్ల జిల్లా...

- 25న మధ్యాహ్నం 2 గంటలకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రిపోర్టు చేయాలి, 26న శారీరక సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తారు..

4వ తరగతి బాలురు...

జె. మణిదీప్, ఎల్. వర్షిత్, బి. భరత్, జి. పణీశ్వర్ (వీర్నపల్లి), ఆర్. సాత్విక్ (నూకలమర్రి), ఎం. ఆదిత్య (రాచర్ల), ఎన్. మహిత్, ఎన్. నిహాల్ (కందికట్కూర్), ఎం. విహాన్ పటేల్ (ఎల్లారెడ్డిపేట), పి. సాహిత్ (కోనరావ్‌పేట)..

4వ తరగతి బాలికలు...

ఈ. శ్రీనిజ (సిరిసిల్ల), డి. మన్విత, ఆర్. శ్రీవిఘ్న (వీర్నపల్లి), బి. హర్షిత (గర్జనపల్లి), బి. అద్వైత, పి. శాన్వి (వేములవాడ), డి. స్మితిక (వనపల్లి), బి. లాస్య (రుద్రారం), బి. సింధు (కోనరావ్‌పేట), డి. శ్రీనిత్య (తంగల్లపల్లి)...

5వ తరగతి బాలురు...

ఎస్.హరినారాయణ (తంగళ్లపల్లి), కె. రోనిత్ పటేల్ (ముస్తాబాద్), బి. హర్ష, బి. వినమార్త్ సింహ (బంధన్‌కల్), ఎన్. మహేశ్వర్ (మారుపాక), ఎం.స్వనిక్ (వట్టిముల), డి. ఈశ్వర్ రెడ్డి, జి. జగ్గనాయక్ (వనపల్లి), జె. సహన్ (వీర్నపల్లి), ఎ. శ్రీవర్షిత్ (జిల్లెల్ల), కె. వెంకట లోకేశ్, టి. సంత్‌సింహ (వేములవాడ), డి. నిహాన్, కె. భార్గవ్ (గర్జనపల్లి), బి. పవన్ నాయక్ (అడవిపదిర)...

5వ తరగతి బాలికలు...

ఎం.అక్షిత్ (లక్ష్మీపూర్), కె. సహజ (చక్కపల్లి), ఈ. సహంత (మద్దిమల్ల), బి. సహస్ర, బి.నెహ (కనగర్తి), టి. అక్షిత (అంతగిరి), జి.చిత్ర (వనపల్లి), ఎస్. నీరజ (తంగళ్ళపల్లి), పి.సాన్వి (సంకెపల్లి), ఈ. లాస్య (పెద్దలింగాపూర్)

జగిత్యాల జిల్లా...

- 24న మధ్యాహ్నం 2 గంటలకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రిపోర్టు చేయాలి.
- 25నశారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు..

4వ తరగతి బాలురు ...

ఎన్. చైతన్య (జగిత్యాల రూరల్), ఈ.దీపక్ (కొడిమ్యాల), ఎన్.ధీరజ్ మోహన్ (మెట్‌పల్లి), సీహెచ్. సాత్విక్, ఈ. రితిక్ వర్మ, వి. ఆర్యన్ (కోరుట్ల), పి. శ్రీనాథ్ (పెగడపల్లి), జి.వరుణ్ సందేశ్ (గొల్లపల్లి), జి.రక్షక్ (రాయికల్), బి.గణహితేశ్వర్ గౌతమ్ (పెగడపల్లి)..

4వ తరగతి బాలికలు...

పి.అలకనంద, కె. విహాన్షి, జి.మధుప్రియ (కోరుట్ల), ఎం. శ్రీప్రియ (వెల్గటూర్), టి.అనూష, ఎల్. పూజ (మల్లాపూర్), ఎం. మహన్య (ఎండపల్లి), కె. పల్లవి (జగిత్యాల రూరల్), జె.అక్షర (బీర్‌పూర్), జి. నందిత (కొడిమ్యాల)

5వ తరగతి బాలురు...

జి.శ్రీకేష్, ఎస్.హర్షిత్, ఎం.రణదీప్ (మెట్‌పల్లి), కె.మోహిత్ రెడ్డి, కె.అర్జున్, బి.రిత్విక్ (కొడిమ్యాల), పి. హరిచరణ్, ఎస్.సిద్ధసాయి (మల్లాపూర్), జి. వచన్‌సాయి (రాయికల్), పి. సతీశ్‌పటేల్ (గొల్లపల్లి)

5వ తరగతి బాలికలు...

పి.సౌమిత (వెల్గటూర్), బి.కావ్య శ్రీ, బి.సహశ్రీక, ఎం. సాహితీ (ఎండపల్లి), ఎ. సంస్మృతి విజ్ఞాని రెడ్డి (మెట్‌పల్లి), ఎ.లాస్యశ్రీ (బీర్‌పూర్), డి.లాస్య (కొడిమ్యాల), ఎ. శ్రీజ, బి.హస్విత (కోరుట్ల), ఎస్.శ్రీజ (పెగడపల్లి)

విద్యార్థులు సమయానికి చేరుకోవాలి



ఈనెల 24 నుంచి ఎంపిక పోటీలు ప్రారంభిస్తుండడంతో 23న మధ్యాహ్నం రిపోర్టు చేయాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. హకీంపేటలో విద్యార్థులకు మాత్రమే వసతి కల్పించాం. ఎంపికైన విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పోటీలకు హాజరై అత్యధిక స్కోర్ సాధిస్తే స్పోర్ట్స్ స్కూల్‌లో అవకాశం లభిస్తుంది.

– కె. రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్

జలతారు వెన్నెలేమో..



విస్తృతంగా కురుస్తున్న వర్షాలతో వెన్నెల జలపాతం కనువిందు చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపాన వెన్నెల జలపాతాన్ని తిలకించేందుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. జలపాతంలో తడుస్తూ కేరింతలు కొడుతున్నారు.

-మణుగూరు రూరల్-

జడ్డి కట్టి.. వాగు దాటి..



- ములుగు జిల్లాలో వైద్యం కోసం గిరిజనుల పాట్లు
- సీతారాంపురంలో వైద్యం అందక ఒకరి మృతి

వెంకటాపురం(కె): ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సకాలంలో వైద్యమందక ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం బోదాపురం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో బాబురావు(30) అనే వ్యక్తి జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కుర్సం సిద్దూ జ్వరం, వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రాథమిక వైద్యం కోసం ఆలుబాక గ్రామానికి వెళ్లాలంటే మధ్యలోని జిన్నెలవాగు దాటాలి. అయితే ఉధృతంగా ప్రవహిస్తున్న జిన్నెలవాగులోంచి జడ్డి ద్వారా సిద్దూను ఆలుబాకకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వెంకటాపురం, ఆపై ములుగుకు తరలించారు.

ఆస్పత్రిలో ఊడిపడ్డ సీలింగ్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాలో 4 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనం ఉరుస్తోంది. బుధవారం రాత్రి మొదటి అంతస్తులోని పోస్ట్ ఆపరేటివ్ వార్డులో ఒక్కసారిగా ఫాల్స్ సీలింగ్‌లో కొంతభాగం ఊడి బెడ్‌లపై పడిపోయింది. అయితే ఆ సమయంలో ఆ బెడ్‌లపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, వెంటనే మరమ్మతులు చేయించాలని వైద్యాధికారులను మంత్రి హరీశ్ ఆదేశించారు.

అనంతగిరుల్లో జల సోయగం



నాలుగు రోజులుగా కురుస్తున్నవర్షాలకు వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి కొండల పైనుంచి పారుతున్న వరద నీరు జలపాతాన్ని తలపిస్తోంది. జలసోయగం దృశ్యాలను చూసేందుకు గురువారం పర్యాటకులు తరలివెళ్లారు.

- అనంతగిరి-



గురువారం హైదరాబాద్ శివార్లలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదలో చిక్కుకున్న కారు



కుమ్రం భీం జిల్లా నవేదరి చెక్ డ్యామ్ వద్ద జాలర్ల సందడి



ములుగు జిల్లా వాజేడు మండలంలో నీట మునిగిన 163 నంబర్ జాతీయ రహదారి (దీని వల్లతెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల రాకపోకలు నిలిచిపోయాయి)

వాన.. హైరానా!

రాష్ట్రంలో నాలుగో రోజూ వరుసగా వానలు

- గోదావరి పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు
- గురువారం ఒక్కరోజే రాష్ట్రంలో 3.45 సెంటీమీటర్ల సగటు వర్షపాతం
- జిల్లాల సగటున అత్యధికంగా మెదక్‌లో 9.46 సెంటీమీటర్ల వాన
- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్.. మరో రెండు రోజులూ వానలు
- నాలుగు రోజుల్లోనే 30 శాతం లోటు నుంచి 6 శాతం అధిక శాతానికి వర్షపాతం



హైదరాబాద్‌లో ఐకియా స్టోర్‌వద్ద భారీగా స్తంభించిన ట్రాఫిక్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రాన్ని నాలుగో రోజూ వానలు ముంచెత్తాయి. రాజధాని హైదరాబాద్ సహా చాలా జిల్లాల్లో పొద్దుమావు ముసురుపట్టింది. పలుచోట్ల భారీ వర్షాలు కూడా పడ్డాయి. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటం, గ్రామాలు జలదిగ్బంధం కావడం, రహదారులపై నీరు చేరడం, ముసురుతో ఇంట్లోంచి బయట అడుగుపెట్టే పరిస్థితి లేకపోవడంతో జనజీవనం దాదాపు స్తంభించిపోయింది. ఇదే సమయంలో భారీ వర్షాలతో సాగునీటికి కష్టాలు తీరుతాయంటూ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వారంతా వ్యవసాయ పనులు ముమ్మరం చేయడంలో నిమగ్నమవుతున్నారు. ఇక మరో రెండు రోజుల పాటు వానలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

ఒక్కరోజే సగటున 3.45 సెం.మీ

గురువారం రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా వర్షపాతం నమోదైంది. ఒక్కరోజే సగటున 3.45 సెంటీమీటర్ల వాన పడినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఇందులో అత్యధికంగా మెదక్ జిల్లాలో సగటున 9.46 సెంటీమీటర్లు, జనగామ జిల్లాలో 9.04 సెంటీమీటర్లు, సిద్దిపేట జిల్లాలో 8.10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లగొండ, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రం తేలికపాటి వానలే కురిశాయి. మిగతా అన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది.

స్తంభించిన జనజీవనం..

నాలుగు రోజులుగా ముసురుపట్టే ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న రోడ్లు జలమయమై రాకపోకలు నిలిచిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాజేడు మండలం టేకులగుడెం వద్ద జాతీయ రహదారి మునిగిపోవడంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముసురు ప్రభావంతో ఓపెన్‌కాస్ట్‌లలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

హైదరాబాద్‌లో రోజంతా వాన

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గురువారం రోజంతా వాన కురిసింది. చాలా కాలనీలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపై నీళ్లు నిలిచాయి. దీనితో కొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ తీగలు తెగడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పదుల సంఖ్యలో పాత ఇళ్లు కూలిపోయాయి. హైదరాబాద్‌లో అత్యధికంగా మల్కాజిగిరిలో 11.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తం నగరవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఏడెనిమిది సెంటీమీటర్లకుపైగానే వాన కురిసింది.

ఉప్పొంగిన వాగులు.. రాకపోకలు బంద్

- సంగారెడ్డి జిల్లాలోని ఫతేపూర్– పిట్ల రోడ్డులోని తాత్కాలిక వంతెన తెగిపోయింది. మంజీరా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నల్లవాగు పొంగి ప్రవహిస్తోంది.
- మెదక్ జిల్లా వెల్దుర్తిలో డబుల్ బెడ్రూం ఇళ్లు జలమయం అయ్యాయి. రామాయంపేట– సిద్దిపేట రహదారిపై కోనాపూర్ వద్ద వరద చేరడంతో రాకపోకలు ఆగిపోయాయి. ఘనపురం వాగు ఉప్పొంగడంతో ఏడుపాయల వనదుర్గ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు.
- సిద్దిపేట జిల్లాలో మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహించడంతో హన్మకొండ– సిద్దిపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- కుమురంభీం జిల్లాలో దహెగాంలో పెద్దవాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. పాటగూడ వాగు ఉధృతంగా ప్రవహించడంతో వంతెన కోతకు గురైంది.
- ఉమ్మడి ఖమ్మం జిల్లా టేకులగూడెం సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిపైకి గోదావరి వరద చేరింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మంగపేట మండలంలో గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో తీర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు బారికేడ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.
- వరంగల్ నగరంలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

లోటు నుంచి అధిక వర్షపాతానికి..

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించి నెల రోజులు దాటిపోయినా వానలు సరిగా కురవలేదు. ఇటీవలి వరకు 30శాతానికిపైగా లోటు వర్షపాతం కొనసాగింది. కానీ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మారింది. లోటు పూడిపోవడమేగాక 6 శాతం అధిక వర్షపాతం నమోదవడం గమనార్హం. వానాకాలం సీజన్‌లో జూలై 20 నాటికి 26.46 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. గురువారం నాటికి 27.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అధికంగా, 21 జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదవగా.. మిగతా 5 జిల్లాల్లో మాత్రం కాస్త లోటు ఉన్నట్టు వాతావరణ శాఖ వివరించింది.

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్:రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటం, గోదావరి నది ఉగ్రరూపం దాల్చడం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగాన్ని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తూ, తక్షణ చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచించారు. భద్రాచలంలో ముంపునకు గురయ్యే అవకాశాలున్న లోతట్టు ప్రాంతాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని.. గతంలో వరదల సందర్భంగా సమర్థవంతంగా పనిచేసిన అధికారుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ దళాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇక తక్షణమే భద్రాచలం వెళ్లి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ దుర్శెట్టి అనుదీప్‌ను సీఎం ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం, కొత్తగూడెం కలెక్టరేట్, భద్రాచలం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సీఎస్, డీజీపీ సమీక్ష

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌తో కలసి గోదావరి పరీవాహక జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని శాంతికుమారి ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, సరిపడా మందులు, విద్యుత్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఏవిధమైన సహాయ, సహకారాలైనా రాజధాని నుంచి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరి పరీవాహక ప్రాంతాల పోలీసు అధికారులతో ఇప్పటికే సమీక్షించామని.. సహాయ కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేశామని డీజీపీ అంజనీకుమార్ చెప్పారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెంటనే వెళ్లి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించామని వెల్లడించారు.

'అవసరమైతే హెలికాప్టర్ సేవలు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటం, గోదావరి ఉగ్రరూపం దాల్చడం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగాన్ని సీఎం కేసీఆర్ ఆదేశించారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తూ తక్షణ చర్యలకు ఉపక్రమించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. భద్రాచలంలో ముంపునకు గురయ్యే అవకాశాలున్న లోతట్టు ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని.. గతంలో వరదల సందర్భంగా సమర్థంగా పనిచేసిన అధికారుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ దళాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇక తక్షణమే భద్రాచలం వెళ్లి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ దుర్శెట్టి అనుదీప్‌ను సీఎం ఆదేశించారు.

'వారం రోజులు నిరసనలు వాయిదా'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు నిరసనలను వారం రోజులు వాయిదా వేస్తున్నట్లు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీ రామారావు ప్రకటించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలను భారీ వర్షాల నేపథ్యంలో వారం పాటు వాయిదా వేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు కేటీఆర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతులందరినీ కలుపుకొని కాంగ్రెస్ పార్టీ విధానాలను ఎండగట్టేలా నిరసన కార్యక్రమాలను పార్టీ కొనసాగిస్తుందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు, రైతులకు ఈ వారం రోజులపాటు అండగా ఉండాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను, నాయకులను, కార్యకర్తలను కేటీఆర్ కోరారు.

రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ..(సెం.మీలలో)

ప్రాంతం (జిల్లా)	వర్షపాతం	ప్రాంతం (జిల్లా)	వర్షపాతం
రామడుగు (కరీంనగర్)	16.0	మహేశ్వరం (రంగారెడ్డి)	11.6
ముజాహిద్‌పూర్ (వికారాబాద్)	14.5	ఉదిత్యాల్ (మహబూబ్‌నగర్)	11.3
చందనవల్లి (రంగారెడ్డి)	13.0	మల్కాజిగిరి (మేడ్చల్ జిల్లా)	11.2
పూడూర్ (జగిత్యాల)	12.7	శేరిలింగంపల్లి (రంగారెడ్డి	10.9
కేతిరెడ్డిపల్లి (రంగారెడ్డి)	12.7	నవాబ్‌పేట్ (మహబూబ్‌నగర్)	10.7
గంగాధర (కరీంనగర్)	12.7	మొద్గుల (వికారాబాద్)	10.5
కందవాడ (రంగారెడ్డి)	12.6	ఉప్పల్ (మేడ్చల్ జిల్లా)	10.4
చౌదాపూర్ (వికారాబాద్ జిల్లా)	12.1	కాప్రా(మేడ్చల్ జిల్లా)	10.0

మరో రెండు రోజులూ వానలు

వాయవ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనంతో గురువారం ఉదయం అల్పపీడనం ఏర్పడిందని, దీనికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనమూ ఏర్పడిందని వాతావరణ శాఖ ప్రకటించింది. వీటి ప్రభావంతో మరో రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వానలు పడతాయని.. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడవచ్చని హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పలుచోట్ల అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, మహబుబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది.



భద్రాచలంలోని రామాలయం పరిసరాల్లో వరదనీరు

వరద గోదారి

- విస్తారంగా వర్షాలతో ఉప్పొంగుతున్న ఉప నదులు, వాగులు.. ఈ నీటి చేరికతో గోదావరిలో గంట గంటకు పెరుగుతున్న ప్రవాహం
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- గురువారం రాత్రి 44.1 అడుగులకు చేరిన నీటిమట్టం
- శుక్రవారం తెల్లవారుజామున 48 అడుగులకు..!
- నది తీర గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు



మిడ్‌మానేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం..

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి, దాని ఉప నదులు జలకళ సంతరించుకున్నాయి. ఎగువన గోదావరిలోకి ప్రవాహాలు పెరుగుతుండగా.. కాళేశ్వరం దిగువన ప్రాణహిత, ఇంద్రావతి ఉప నదులు, వాగుల నీటి చేరికతో నది ఉగ్రరూపం దాల్చుతోంది. మేడిగడ్డ వద్ద వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. దీనితో అధికారులు గురువారం మధ్యాహ్నమే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇక్క గురువారం రాత్రి 8 గంటల సమయానికి 9,79,347 క్యూసెక్కుల ప్రవాహంతో వరద నీరు 44.1 అడుగులకు చేరింది. శుక్రవారం తెల్లవారుజాము సమయానికి నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక అయిన 48 అడుగులకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో నది తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇక ఎగువ గోదావరిలోనూ వరద పెరిగింది. మహారాష్ట్రలో, రాష్ట్రంలోని పరీవాహక ప్రాంతంలో వానలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 59,165 క్యూసెక్కుల వరద చేరుతోంది.

వచ్చిన వరద వచ్చినట్టుగానే..

ప్రాణహితలో వరద ఉధృతి పెరుగుతోంది. దీనితో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోకి చేరుతున్న 5,37,140 క్యూసెక్కులను వచ్చింది వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదకు దిగువన ఇంద్రావతి జలాలు తోడై సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజీలోకి 8,76,940 క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ మొత్తాన్నీ విడుదల చేస్తున్నారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని సైతం పొంగి ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని ప్రాజెక్టు దాదాపు గరిష్ట మట్టానికి చేరగా.. తాలిపేరు 24 గేట్లు ఎత్తి 1,02,399 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. వీటితోపాటు శబరి జలాలు కూడా కలసి గోదావరి మహోగ్ర రూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద వరద నీటి మట్టం గంట గంటకూ పెరుగుతోంది. దీనితో కొత్తగూడెం కలెక్టరేట్, భద్రాచలం సబ్ కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం భద్రాచలం రానున్నారు. వరద మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

పోలవరానికి పెరిగిన వరద

భద్రాచలం నుంచి పోలవరం ప్రాజెక్టులోకి గోదావరి ప్రవాహం పెరిగింది. గురువారం రాత్రి ఏడు గంటలకు పోలవరం ప్రాజెక్టులోకి 5,99,490 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. 48 గేట్లు ఎత్తి అంతే స్థాయిలో నీటిని దిగువకు వదిలేస్తున్నారు. నీటి మట్టం స్పిల్‌వే ఎగువన 31.88 మీటర్లు, దిగువన 23.3 మీటర్లుగా.. ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 32.55 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ వద్ద 22.73 మీటర్లుగా నమోదైంది. పోలవరం నుంచి నీరంతా ధవళేశ్వరం బ్యారేజీలోకి చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,800 క్యూసెక్కులను విడుదల చేస్తూ, మిగతా నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో ఇలా..

ప్రాజెక్టు	గరిష్ట నీటి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
జైక్వాడ్	102.73	47.16	319	319
శ్రీరాంసాగర్	90.31	37.17	59,165	1,046
ఎల్లంపల్లి	20.18	15.38	7787	787
మేడిగడ్డ బ్యారేజీ	16.17	3.73	5,28,880	5,28,880
సమ్మక్క బ్యారేజీ	6.94	5.1	8,41,270	8,41,270

(గురువారం రాత్రి 8 గంటలకు.. నీటి నిల్వ టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో/ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో..)

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత

గోదావరి, దాని ఉప నదుల పరీవాహక ప్రాంతంలో గురు, శుక్రవారాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. లోతట్టు ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. గోదావరితోపాటు ఉప నదులు, వాగుల ప్రవాహాలతో ప్రభావం పడేచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కృష్ణా ఉప నదులకూ జలకళ

మహారాష్ట్ర, కర్ణాటకలతోపాటు రాష్ట్రంలోని పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో కృష్ణా నది ఉప నదుల్లోనూ వరద ప్రారంభమైంది. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి 32,146 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. నీటి నిల్వ 32.24 టీఎంసీలకు చేరింది. ఆ ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 97 టీఎంసీలు అవసరం. దీని దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్‌లోకి ఇంకా వరద మొదలవలేదు. ఇక కృష్ణా ఉపనది మలప్రభ నుంచి మలప్రభ ప్రాజెక్టులోకి 10,437 క్యూసెక్కులు, ఘటప్రభ ఉప నది నుంచి ఘటప్రభ ప్రాజెక్టులోకి 20,813 క్యూసెక్కులు వరద వస్తోంది. భద్ర నది నుంచి భద్ర రిజర్వాయర్‌లోకి 4,227 క్యూసెక్కులు, తుంగభద్ర నుంచి తుంగభద్ర డ్యామ్‌లోకి 9,536 క్యూసెక్కులు ప్రవాహాలు ఉన్నాయి. బీమా నదిపై ఉన్న ఉజ్జయిని ప్రాజెక్టులోకి 12,925 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ నిండితే ప్రధాన కృష్ణా నదిలోకి వరద మొదలుకానుంది. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని.. నెలాఖరు నాటికి ప్రధాన నదిలో ప్రవాహాలు పెరుగుతాయని అధికారులు చెప్తున్నారు. కాగా, రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో వానలతో కృష్ణా ఉప నది అయిన మూసీలో వరద ఉధృతి పెరిగింది. మూసీ ప్రాజెక్టులోకి 2,125 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు రెండు గేట్లు ఎత్తి 1,800 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

యువర్స్

● సేవాపథం

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నిరాశ్రయులైన ప్రజల కోసం 27 సంవత్సరాల కౌశల్ శెట్టి 'నోస్టోస్ హోమ్స్' పేరుతో స్వచ్ఛందసంస్థను ప్రారంభించి దేశవ్యాప్తంగా సహాయక కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. నిరాశ్రయుల కోసం ఈ సంస్థ తేలికపాటి, ఈజీ ట్రాన్స్‌పోర్టబుల్ షెల్టర్స్‌ను రూపొందించింది...

పచ్చటి గూడుతో...


కౌశల్ శెట్టి

'అనుభవమైతేగానీ తత్వం బోధపడదు' అంటారు.

'తత్వం' మాట ఎలా ఉన్నా కౌశల్ షెట్టికి 'కర్తవ్యం' బోధపడింది. షెట్టిదీ కర్నాటకలోని ఉడిపికి సమీపంలోని మది అనే గ్రామం. పచ్చదనానికి ఈ గ్రామం పర్‌ఫెక్ట్ అడ్రస్. అలాంటి పచ్చటి ఊరు కాస్తా ఘటప్రభ నది పొంగి పొర్లడంతో అల్లకల్లోలం అయింది. అంతెత్తు చెట్లు నిలువునా కూలి పోయాయి.

పొలాలు మునిగిపోయాయి.

ఇండ్లు ఘోరంగా దెబ్బతిన్నాయి.

ఇంట్లో ఉండలేని పరిస్థితి.

దీంతో ప్రజలు తట్టాబుట్టా సర్దుకొని ఊరు విడిచి తోచిన దిక్కుకు వెళ్లారు. షెట్టి కుటుంబం ముంబైకి వెళ్లింది.

ముంబైకి వెళుతున్నప్పుడు షెట్టి మనసు బాధతో నలిగిపోయింది.

దీనికి కారణం...ఎటు పోవాలో తెలియక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ఊళ్లోనే ఉండిపోయిన ప్రజలు.

సంవత్సరాలు గడుస్తున్నా ఆ బాధ తన నుంచి దూరం కాలేదు.

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదుకునే రోజుల్లో మరోసారి తుఫాను బీభత్సాన్ని, బాధితులు, నిరాశ్రయుల కష్టాలు, కన్నీళ్లను దగ్గర నుంచి చూశాడు.

'ఇలా బాధ పడుతూ కూర్చోవడం తప్ప నేను ఏం చేయలేనా!' అనుకున్నాడు షెట్టి.

ఎన్నో రకాలుగా ఆలోచించిన తరువాత...

తన స్నేహితుడు మాధవ్ దత్‌తో కలిసి 'నోస్టోస్ హోమ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాడు.

'ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి సంవత్సరం వందలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. అలాంటి వారికి నిలువ నీడ కల్పించడానికి మా సంస్థ ద్వారా కృషి చేస్తున్నాం' అంటున్నాడు షెట్టి.

తమ సంస్థ ట్రాన్స్‌పోర్టబుల్ హోమ్స్ గురించి చెబుతూ...

'పర్సనల్ డిగ్నిటీ, ప్రైవసీతో కూడిన హోమ్స్ ఇవి' అంటాడు షెట్టి.

'నోస్టోస్ హోమ్' సంస్థ అస్సాం, నాగాలాండ్ రాష్ట్రాలతో పాటు ఆఫ్రిక దేశాలలోనూ సేవలు అందిస్తోంది. కౌశల్ చేపట్టే సేవాకార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయి.

'తక్కువ సమయంలోనే బాధితులకు సహాయం అందించి నిరాశ్రయులకు అండగా నిలబడింది కౌశల్ బృందం. నిపుణుల సహాయంతో సౌకర్యాలు సమకూర్చారు' అంటున్నాడు హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ మలావి నేషనల్ డైరెక్టర్ కపీరా.

ఇక షెట్టి భవిష్యత్ లక్ష్యం విషయానికి వస్తే...

తన సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనుకుంటున్నాడు. మారుమూల ప్రాంతాలలో వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం కృషి చేయాలనుకుంటున్నాడు.

'నోస్టోస్ హోమ్'తో తొలి అడుగు వేసినప్పుడు 'నిజంగా నేను చేయగలనా?' అనే సందేహం షెట్టికి వచ్చేది. మంచి పని కోసం బయలు దేరినప్పుడు ఎన్నో ద్వారాలు మన కోసం తెరుచుకుంటాయి...అన్నట్లుగా షెట్టికి ఎంతో మంది ఎన్నో రకాలుగా సహాయం అందించారు.

కొన్ని అడుగులు పడిన తరువాత శెట్టికి తనపై తనకు ఎంతో నమ్మకం వచ్చింది. ఆ నమ్మకమే మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యం నిర్దేశించుకోవడానికి కారణం అయింది.

● మ్యూజిక్ వరల్డ్

సందేశ సమ్మోహన గీతం

పాట లక్ష్యం హుషారుగా స్టెప్పులు వేయించడం మాత్రమే కాదు.

పరుగును ఆపి మనలోకి మనం వెళ్లడం.

మంచి ఊహలకు స్వాగతం పలకడం అంటోంది రియ సంగీతం.

సాంగ్ రైటర్, సింగర్ రియ పాటలు హుషారెత్తిస్తూనే స్వీయ క్రమశిక్షణ నుంచి ఆత్మబలం వరకు ఎన్నో మంచి విషయాలను చెబుతాయి...


రియ



దిల్లీలో పుట్టిన రియ రెండు సంవత్సరాల వయసులో తల్లి దండ్రులతో యూకే వెళ్లింది. పాప్-బాలీవుడ్ మ్యూజిక్‌ను వింటూ పెరిగింది. చిన్న వయసులోనే స్టేజీపై ప్రదర్శనలు ఇచ్చింది. రియ 'పర్మిషన్' ట్రాక్ శ్రోతలను అలరించింది. 'పర్మిషన్' కోసం కలం కూడా పట్టింది రియ. ఇద్దరు ప్రేమికుల గురించి కావచ్చు, స్నేహం, కుటుంబ బంధాల గురించి కావచ్చు స్టోరీ-డ్రైవెన్ లిరిక్స్ రాయడం అంటే రియకు ఇష్టం.

క్లాసికల్ సింగింగ్‌లో డిప్లొమా చేసిన రియకు థియేటర్ మ్యూజిక్ అంటే ఇష్టం.

'పర్మిషన్' తరువాత వచ్చిన 'డోన్ట్ హ్యావ్ ది టైమ్'కు మంచి పేరు వచ్చింది.

ఇన్‌స్పిరేషన్ అనేది ఎప్పుడైనా, ఎక్కడైనా రావచ్చు అనే దానికి ఉదాహరణ...డోన్ట్ హ్యావ్ ది టైమ్. ఒక ఫెస్టివల్‌లో లైవ్ పర్‌ఫార్మెన్స్ ఇస్తున్నప్పుడు ఈ పాటకు ఆలోచన తట్టింది. ఆడియెన్స్ కూడా లీనమై తనతో పాటు డ్యాన్స్ చేసే పాట సృష్టించాలనుకుంది రియ. అలా పుట్టిందే... డోంట్ హ్యావ్ ది టైమ్.

అయస్కాంతంలా ఆకట్టుకునే పాట ఒకటి సృష్టించాలనుకుంది. అలా అని ఆ పాట అల్లాటప్పాగా ఉండకూడదని దానిలో సందేశం ఉండాలనుకుంది.

మనలో ఎంత టాలెంట్ ఉంటే మాత్రం? టైమ్ లేకపోతే అంతే!

అందుకే టైమ్ విలువను క్షణ, క్షణం గుర్తు చేసుకునేలా 'డోన్ట్ హ్యావ్ ది టైమ్'ను తీర్చిదిద్దింది. ప్రతి ఒక్కరూ రిలేట్ అయ్యేలా ఉండడమే ఈ పాట సక్సెస్ సాధించడానికి కారణం అయింది.

'ప్రతి నిమిషం అపూర్వమైనది. వెల కట్టలేనిది' అని గుర్తు చేసే 'డోంట్ హ్యావ్ ది టైమ్'పై పాప్ బీట్ మాత్రమే కాదు బాలీవుడ్ మ్యూజిక్ ప్రభావం కూడా కనిపిస్తుంది.

ట్రాక్ వీడియోల షూట్ కోసం ఎన్నో సార్లు దిల్లీకి వచ్చిన రియ ప్రతి సారి ఒక కొత్త అనుభవాన్ని సొంతం చేసుకుంది.

'సాంస్కృతిక వైవిధ్యంతో వెలిగిపోయే దిల్లీలో అడుగు తీసి అడుగు వేస్తే ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి' అని దిల్లీ గురించి మురిపెంగా చెబుతుంది రియ.

'ప్రతి నెల ఒక సింగిల్ విడుదల చేయాలనుకుంటున్నాను' అంటున్న రియ తన రచనలు, సంగీతంతో ఎప్పుడూ బిజీబిజీగా ఉంటుంది. ఇండియాలోని ప్రొడ్యూసర్‌లు, మ్యూజిషియన్‌లతో పనిచేయాలని, లైవ్ షోలలో పాల్గొనాలనేది రియ కల.

మరి నెక్స్ట్ ఏమిటి?

'చెప్పుకోతగ్గ అద్భుతమైన ఆనందకరమైన విషయాలు ముస్ముందు ఉన్నాయి. మాంచెస్టర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్, బీబీసీ ది హండ్రెడ్ ప్రోగ్రామ్‌లో ప్రదర్శన ఇవ్వబోతున్నాను' అంటుంది రియ.

● టెక్.. టాక్

రియల్‌మీ ప్యాడ్ 2



డిస్‌ప్లే: 11.5 అంగుళాలు
ఫ్రంట్, బ్యాక్ కెమెరా: 8ఎంపీ
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
స్క్రీన్ రిజల్యూషన్: 2000×1200 పిక్సెల్స్
బ్యాటరీ: 8,360 ఎంఏహెచ్
ఆపరేషన్ సిస్టమ్: ఆండ్రాయిడ్ వి 13
కలర్స్: ఇనిస్పిరేషన్ గ్రీన్, ఇనిస్పిరేషన్ గ్రే
ర్యామ్: 6జీబి
ఇంటర్నల్ మెమోరీ: 128జీబి

వన్‌ప్లస్ 12



డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5,400 ఎంఏహెచ్
● 50 ఎంపీ మెయిన్ సెన్సర్ ● 50 ఎంపీ ఆల్ట్రావైడ్ సెన్సర్ ● 64 ఎంపీ టెలిఫొటో కెమెరా ● 32-మెగా పిక్సెల్ కెమెరా ● ఫింగర్ ప్రింట్ స్కానర్

ల్యాప్‌టాప్ స్టాండ్ విత్ మొబైల్ హోల్డర్



బ్రాండ్: ప్రోట్రానిక్స్
కలర్: బ్లాక్
ఫామ్: టేబుల్ స్టాండ్
హైట్: 26 సెం.మీ
విడ్త్: 28.5 సెం.మీ
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 2.7×28.5×26 సెం.మీ
బరువు: 739 గ్రా.

రెడ్‌మీ వాచ్ 3



రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్ ఇండియన్ మార్కెట్‌లో త్వరలో విడుదల కానుంది.
●1.83 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే
●బ్లూటూత్ 5.3 కనెక్టివిటీ
స్పోర్ట్స్ మోడ్స్: 100 ●వాటర్ రెసిస్టెంట్
● సింగిల్ ఛార్జ్: 12 గంటలు
రిజల్యూషన్: 240×280 పిక్సెల్స్
హెల్త్‌మానిటరింగ్ సెన్సర్‌లు: బ్లడ్ ఆక్సిజన్ సెన్సర్, హార్ట్ రేట్ మానిటర్, స్లీప్ మానిటర్... మొదలైనవి.
కలర్స్: బ్లాక్ అండ్ గ్రే

● గేమింగ్

తిరుగులేని వీరుడు

థర్డ్-పర్సన్ షూటర్ యాక్షన్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ రెమ్‌నెంట్2 ఈ నెల 25న విడుదల అవుతుంది. రెమ్‌నెంట్: ఫ్రమ్ ది యాషెస్(2019)కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ తమ క్యారెక్టర్‌లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్లేయర్స్ మొత్తం గేమ్‌ను సోలోగా ఆడవచ్చు. 3-ప్లేయర్ కోఆపరేటివ్ మల్టీప్లేయర్ మోడల్‌కు కూడా ఈ గేమ్ సపోర్ట్ చేస్తుంది. గన్ స్లింగర్, హ్యాండ్లర్, చాలెంజర్, హంటర్, మెడిక్...అనే అయిదు రకాల ఆర్కిటైప్‌లు ఉంటాయి. ప్రతి ఆర్కిటైప్‌కు తనదైన శైలి, నైపుణ్యం ఉంటాయి. మనం ఏ ఆర్కిటైప్‌ను ఎంపిక చేసుకున్నామనేదానిపై విజయం ఆధారపడి ఉంటుంది.



క్వాలిటీ, బ్యాలెన్స్‌డ్, పర్‌ఫార్మెన్స్ అనే మూడు రకాల మోడ్స్ ఈ గేమ్‌లో ఉంటాయి.

డెవలపర్స్: గన్‌ఫైర్ గేమ్స్ ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్5

జానర్స్: థర్డ్ పర్సన్ షూటర్, యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్

ప్లాట్‌ఫామ్స్: విండో పీసి, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● ఇడియమ్స్



పాస్ ది బక్

ఒక పని లేదా సమస్యకు వేరొకరిపై నింద మోపుతూ తన బాధ్యతల నుంచి తప్పుకోవడానికి ప్రయత్నించే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.

ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్. దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

ఏ ఫ్లాష్ ఇన్ ది పాన్

ఒక వ్యక్తి లేదా సంస్థ అనూహ్యంగా విజయం సాధించి, ఆ విజయాన్ని మళ్లీ నిలబెట్టుకోలేని లేదా పునరావృతం చేయలేని సందర్భంలో వాడే ఇడియమ్.

ఉదా: ది బ్యాండ్ వాజ్ జస్ట్ ఏ ఫ్లాష్ ఇన్ ది పాన్ విత్ వన్ హిట్ ఇన్ 2003

సినిమా


● కమల్ హాసన్, ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న టైమ్‌ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా అమెరికాలో జరుగుతున్న 'కామిక్ కాన్-2023' వేడుకల్లో 'ప్రాజెక్ట్ కె' గ్లింప్స్, టైటిల్‌ను జులై 21న (భారతీయ కాలమానం ప్రకారం) రివీల్ చేయడానికి ప్లాన్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్, కమల్‌హాసన్, నాగ్ అశ్విన్‌లతో పాటు 'ప్రాజెక్ట్ కె' టీమ్ అమెరికాలో సందడి చేసింది.

యాభైలో పడ్డారు!

యాభైలో పడ్డారంటే యాభై ఏళ్ల వయసులో పడ్డారనుకుంటున్నారేమో! ఆ మాటకొస్తే.. ధనుష్, విజయ్ సేతుపతి, అంజలికన్నా సీనియర్ ఆర్టిస్ట్ అయిన సిమ్రానే ఇంకా వయసు పరంగా యాభై టచ్ అవ్వలేదు. ఆమె యాభైలోకి అడుగుపెట్టడానికి ఇంకో రెండు మూడేళ్లు పడుతుంది. ఇక ధనుష్, భరత్ నలభై టచ్ చేస్తే.. ఇంకో అయిదు అదనంగా అంటే... సేతుపతి నలభై అయిదు టచ్ చేశారు. అంజలి నలభై లోపే. ఈ అయిదుగురూ అయిదుపదుల్లో పడింది సినిమాల పరంగా. ఈ అయిదుగురూ చేస్తున్న 50వ సినిమా విశేషాల్లోకి వెళదాం...

రెండు దశాబ్దాల్లో రెండోది

రెండు దశాబ్దాల కెరీర్‌లో నటుడు-నిర్మాత ధనుష్ దర్శకత్వం వహించిన తొలి సినిమా 'పా. పాండి' (2017). ఈ సినిమా తర్వాత మరో సినిమా కోసం దర్శకుడిగా ధనుష్ మెగాఫోన్ పట్టాలనుకున్నారు. 'నాన్ రుద్రన్'గా ప్రచారం జరిగిన ఈ సినిమా ఎందుకో సెట్స్‌పైకి వెళ్లలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ధనుష్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా సెట్స్‌పైకి వెళ్లింది. అయితే ఇది ధనుష్ కెరీర్‌లో 50వ సినిమా కావడం విశేషం. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమా నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా ఉంటుందట. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024లో రిలీజ్ కానుంది.

మహారాజా

హీరో.. విలన్.. సపోర్టింగ్ యాక్టర్... ఇలా పాత్రకు తగ్గట్టు ఇమిడిపోతూ విలక్షణ నటుడిగా ప్రేక్షకుల్లో పేరు సంపాదించుకున్నారు విజయ్ సేతుపతి. కెరీర్‌లో విజయ్ సేతుపతి 50 చిత్రాల మైలురాయికి చేరుకున్నారు. ఆయన 50వ సినిమాకు 'మహారాజా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నితిలన్ సామినాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో హీరోయిన్ మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్, బాలీవుడ్ దర్శక-నిర్మాత, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో నటించారు. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా తుది దశకు చేరుకున్నాయి. 'పాషన్ స్టూడియోస్' సుధన్ సుందరం, జగదీష్ పళనీసామి నిర్మించిన ఈ సినిమా విడుదల తేదీపై త్వరలో ఓ స్పష్టత రానుంది.

లా స్టూడెంట్

దక్షిణాదిలో నటిగా అంజలికి మంచి మార్కులే వేశారు ప్రేక్షకులు. హీరోయిన్‌గా, సెకండ్ హీరోయిన్‌గా, కీలక పాత్రల్లో నటిస్తున్న అంజలి కెరీర్‌లో హాఫ్ సెంచరీ కొట్టారు. అదేనండీ.. యాభై సినిమాల మైల్‌స్టోన్‌కు చేరుకున్నారు. అంజలి ప్రధాన పాత్రలో అశోక్ వేలాయుధం దర్శకత్వంలో 'ఈగై' అనే ఓ కోర్టు డ్రామా మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రం అంజలికి 50వది. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. ఈ చిత్రంలో అంజలి లా స్టూడెంట్‌గా నటిస్తున్నారని, సునీల్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారని తెలిసింది. గ్రీన్ అమ్యూస్‌మెంట్ ప్రొడక్షన్స్, డీ3 ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

సిమ్రాన్ శబ్దం

సిమ్రాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. దక్షిణాదిలోనే కాదు..ఉత్తరాదిలో కూడా సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు సిమ్రాన్. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. సిమ్రాన్ కీలక పాత్ర చేస్తున్న మూవీల్లో 'శబ్దం' ఒకటి. 'ఈరమ్' (తెలుగులో 'వైశాలి') చిత్రం తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. లక్ష్మీ మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్, లైలా కీలక పాత్రధారులు. సిమ్రాన్‌కు తమిళంలో ఇది 50వ సినిమా కావడం విశేషం.

ప్రేమకోసం...

దాదాపు ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన తమిళ చిత్రం 'కాదల్' తెలుగులో 'ప్రేమిస్తే..'గా విడుదలై మంచి విజయం సాధించింది. ఈ చిత్రం తర్వాత తమిళంలో చాలా సినిమాలే చేశారు భరత్. తెలుగులో మహేశ్‌బాబు 'స్పైడర్', సుధీర్‌బాబు 'హంట్' వంటి సినిమాల్లో కీలక పాత్రల్లో నటించారు. కాగా భరత్ కెరీర్‌లో రూపొందిన 50వ సినిమా 'లవ్'. వాణీ భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు ఆర్పీ బాలా దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది.

కెరీర్‌లో 50వ మైల్‌స్టోన్ చేరుకున్న నటీనటులు ఇంకొందరు ఉన్నారు.


● ధనుష్


● విజయ్ సేతుపతి


● భరత్


● అంజలి


● సిమ్రాన్

లక్కీ చాన్స్?

'గీత గోవిందం' (2018) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చోటు ఉందని, దీంతో ఈ పాత్రకు దివ్యాంశ కౌశిక్‌ను చిత్రయూనిట్ సెలక్ట్ చేసుకున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇదే నిజమైతే దివ్యాంశకు మరో లక్కీ చాన్స్ దక్కినట్లేనని సినిమా ప్రేమికులు చెప్పుకుంటున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.


● దివ్యాంశ కౌశిక్

రీల్స్

సినిమా బాగుంటే ఎందుకు చూడరు - అల్లు అర్జున్



"7/జి బృందావన కాలనీ, అర్జున్ రెడ్డి' సినిమాలు ప్రేమలోని బాధను చూపిస్తాయి. అలాంటి సినిమాలు తీయాలంటే చాలా కష్టం. అదే కోవలో వాస్తవ ఘటనల స్ఫూర్తితో 'బేబి' సినిమాని అద్భుతంగా తీశారు సాయిరాజేష్" అని హీరో అల్లు అర్జున్ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో సాయి రాజేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 14న రిలీజైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'బేబి అప్రిషియేషన్ మీట్'కి ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అర్జున్ మాట్లాడుతూ– "చిన్న సినిమాలను చూడరు అంటుంటారు. కానీ అది అబద్ధం.. సినిమా బాగుంటే ఎందుకు చూడరు? సాయి రాజేష్‌గారు చాలా బాగా తీశారు. ఆయన రాసిన కథ విధానం ఇంకా బాగా నచ్చింది" అన్నారు.

ఏ సినిమానీ చిన్నది అనొద్దు - విశ్వక్ సేన్


● చైతన్య, విశ్వక్‌సేన్

"ఏ సినిమానీ చిన్నది అనొద్దు. కొత్త వాళ్ల సినిమా అనాలి. నేను రావడం వల్ల ఓ సినిమాకు మంచి జరుగుతుందంటే ప్రమోషన్‌కు వస్తాను.. అది నాకు తృప్తినిస్తుంది" అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. చైతన్యా రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో'. యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ–"ఈ మూవీ హిట్ అవుతుందని ట్రైలర్ చూసినప్పుడే అనిపించింది. యూనిట్‌కి మంచి సక్సెస్ రావాలి" అన్నారు..

సమ్మోహనుడా...


● నేహా, కిరణ్

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏయమ్ రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సమ్మోహనుడా పెదవిస్తా నీకే కొంచెం కొరుక్కోవా...' అంటూ సాగే పాటను గురువారం విడుదల చేశారు. రాంబాబు గోసాలతో కలిసి రత్నం కృష్ణ ఈ పాటకి సాహిత్యం అందించగా, శ్రేయా ఘోషల్ పాడగా, శిరీష్ కొరియోగ్రఫీ అందించారు.

ఫన్‌ఫుల్


● మీనాక్షీ చౌదరి

ఫుల్లుగా ఫన్ మూడ్‌లో ఉన్నారు విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి. మరి.. నటిస్తున్న సినిమా ఫన్ ఎంటర్‌టైనర్ అయితే ఆ షూటింగ్ లొకేషన్లో మొత్తం ఫన్నే కదా. విశ్వక్, మీనాక్షీ జంటగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోలను త్వరలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	474	67,572
నిఫ్టీ ▲	146	19,979

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,155	▽	206
డోజోన్స్	35,319	▲	257
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,646	▲	58
డాక్స్	16,204	▲	95
షాంఘై	3,170	▲	29
నికాయ్	32,491	▽	406

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై			
బంగారం (24 క్యారెట్)	59,863	▲	107
బంగారం (22 క్యారెట్)	59,623	▲	106
వెండి (కిలో)	75,768	▲	269

60 సెకన్లలోనే వెబ్‌సైట్..

సైట్స్60 ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎస్‌ఎంఈ) డిజిటల్ బాట పట్టడంలో మరింత సహాయం అందించే దిశగా సైట్స్60 సంస్థ ఏర్పాటైంది. కేవలం 60 సెకన్లలోనే ఎస్‌ఎంఈలు తమ సొంత వెబ్‌సైట్‌ను రూపొందించుకునేందుకు ఇది తోడ్పాటు అందించనుంది. దీన్ని తెలంగాణ ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ప్రారంభించారు. స్థానిక భాషల్లో కూడా ఈ సైట్లను రూపొందించుకోవచ్చని సైట్స్60 వ్యవస్థాపకుడు రాజీవ్ రావుల పాటి తెలిపారు. సొంత వెబ్‌సైట్ తయారు చేసుకోవడం చిన్న వ్యాపార సంస్థలకు వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారమనే అభిప్రాయం నెలకొన్న నేపథ్యంలో తాము అత్యంత చౌకగా ఈ సర్వీసును అందించనున్నట్లు పేర్కొన్నారు. 2025 ఆఖరు కల్లా 10 లక్షల మంది చిన్న, మధ్యతరహా వ్యాపారులకు సేవలు అందించాలన్నది మా ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో టీహబ్ సీవోవో అనీష్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ అంచనాలు డౌన్

- పూర్తి ఏడాది ఆదాయ వృద్ధి అంచనాల్లో కోత..
- ఆర్థిక అనిశ్చితి ప్రభావం ఉంటుందని వెల్లడి
- క్యూ1 లో నికర లాభం రూ.5,945 కోట్లు; 11 శాతం వృద్ధి
- 10 శాతం పెరిగిన ఆదాయం; రూ.37,933 కోట్లు

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాలను భారీగా తగ్గించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 1–3.5 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంది. అంతక్రితం కంపెనీ ఆదాయం 4–7 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా వేసింది. కంపెనీలు తమ ఐటీ వ్యయాల విషయంలో నిర్ణయాలను జాప్యం చేస్తుండటం కూడా దీనికి కారణమని ఇన్ఫీ పేర్కొంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2023–24, క్యూ1)లో ఇన్ఫీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.5,945 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.5,362 కోట్లతో పోలిస్తే 11% వృద్ధి చెందింది. ఇక మొత్తం ఆదాయం 10% పెరుగుదలతో రూ.34,470 కోట్ల నుండి రూ.37,933 కోట్లకు చేరింది. అయితే, క్రితం ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి క్వార్టర్ (క్యూ4)తో పోలిస్తే (సీక్వెన్షియల్‌గా) కంపెనీ నికర లాభం 3 % తగ్గింది. ఆదాయం స్వల్పంగా 1.31% పెరిగింది.



భారీ స్థాయి మెగా డీల్స్‌తో క్యూ1లో మెరుగైన పనితీరు సాధించాం. అయితే, డీల్స్ కుదరడం, ప్రారంభ తేదీల విషయంలో కొంత జాప్యం చోటు చేసుకుంటోంది. కొన్ని ప్రాజెక్టుల విషయంలో కూడా మందగమనం నెలకొంది. 80 యాక్టివ్ ప్రాజెక్టులతో మా జెనరేటివ్ ఏఐ సామర్థ్యాలు పుంజుకుంటున్నాయి. – సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ1లో 2.3 బిలియన్ డాలర్ల విలువైన భారీ డీల్స్ కుదిరాయి.
- ఆపరేటింగ్ మార్జిన్ 20.8 శాతంగా నమోదైంది.
- జూన్ క్వార్టర్లో ఉద్యోగుల వలసల రేటు 17.8 శాతానికి తగ్గింది. క్రితం క్వార్టర్లో ఇది 20.9 శాతంగా ఉంది.
- క్యూ1లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 6,940 తగ్గింది. జూన్ చివరి నాటికి కంపెనీలో మొత్తం 3,36,294 మంది సిబ్బంది ఉన్నారు. ఇన్ఫీలో ఉద్యోగుల సంఖ్య తగ్గడం వరుసగా ఇది రెండో త్రైమాసికం కావడం గమనార్హం. కాగా, కొత్త నియామకాల ప్రణాళికను కంపెనీ ప్రకటించలేదు.
- జూన్ 28న జరిగిన వార్షిక వాటాదారుల సమావేశంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి షేరుకు రూ.17.5 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం 1.74% క్షీణించి రూ.1,449 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత కంపెనీ ఫలితాలు వెలువడ్డాయి.

జియో ఫైనాన్షియల్ @ రూ. 262

- కంపెనీ విలువ రూ. 1,66,000 కోట్లు
- ప్రత్యేక ప్రీఓపెనింగ్ సెషన్‌లో నిర్ధారణ
- రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడదీత



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) నుంచి విడివడిన ఫైనాన్షియల్ సర్వీసుల కంపెనీ విలువ విశ్లేషకుల అంచనాలను మించుతూ రూ. 1,66,000 కోట్లుగా నమోదైంది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(జేఎఫ్ఎస్ఎల్) పేరుతో విడివడిన కంపెనీ షేరుకి రూ. 262 ధర నిర్ధారణ అయ్యింది. పలువురు మార్కెట్ నిపుణులు రూ. 160–190 మధ్య ధరను అంచనా వేయడం గమనార్హం! ఆర్‌ఐఎల్ షేరు బుధవారం ముగింపు ధర రూ. 2,842కాగా.. గురువారం ప్రీఓపెన్ ట్రేడింగ్‌లో జేఎఫ్ఎస్ఎల్ బిజినెస్‌ను మినహాయించడంతో రూ. 2,580 వద్ద స్థిరపడింది. వెరసి జేఎఫ్ఎస్ఎల్ షేరుకి దాదాపు రూ. 262 ధర పలికింది. ఈ ధరలో ఫైనాన్షియల్ కంపెనీ మార్కెట్ విలువ 20 బిలియన్ డాలర్లు(రూ. 1,66,000 కోట్లు)కు చేరింది. ఫలితంగా అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, ఇండియన్ ఆయిల్ తదితర దిగ్గజాలకంటే ముందు నిలిచింది. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా దేశీయంగా 32వ ర్యాంకును పొందింది. తద్వారా మార్కెట్ విలువలో అదానీ గ్రీన్, టాటా స్టీల్, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌ను సైతం జేఎఫ్ఎస్ఎల్ వెనక్కి నెట్టింది.

త్వరలో లిస్టింగ్

ఆర్‌ఐఎల్ నుంచి విడదీసిన జేఎఫ్ఎస్ఎల్ షేరు త్వరలో ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కానుంది. ఆర్‌ఐఎల్ వాటాదారులు ప్రతీ 1 షేరుకి 1 జేఎఫ్ఎస్ఎల్ షేరుని పొందనున్నారు. జూలై 1 నుంచి విడదీత అమల్లోకిరాగా.. షేర్ల కేటాయింపునకు రికార్డ్ డేట్‌గా ఈ నెల 20ను ప్రకటించిన సంగతి తెలిసిందే. మూలధనం రీత్యా జేఎఫ్ఎస్ఎల్ దేశీయంగా ఐదోపెద్ద ఫైనాన్షియర్‌గా ఆవిర్భవించనుంది. పేటీఎమ్, బజాజ్ ఫైనాన్స్ తదితరాలతో పోటీ పడనుంది. ఆర్‌ఐఎల్‌కుగల జియో, రిటైల్ కన్జూమర్ బిజినెస్‌లకు తోడ్పాటునందించనుంది. 42.8 కోట్లమంది వినియోగదారులను కలిగిన జియో అతిపెద్ద వైర్‌లెస్ కంపెనీగా నిలుస్తోంది.

హెచ్‌యూఎల్ లాభం అప్

క్యూ1లో రూ. 2,556 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 2,556 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,391 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,757 కోట్ల నుంచి రూ. 15,679 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 11,531 కోట్ల నుంచి రూ. 12,167 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో గృహ పరిరక్షణ(హోమ్‌కేర్) విభాగం మరోసారి పటిష్ట పనితీరు చూపుతూ 10 శాతం వృద్ధి సాధించినట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. సౌందర్యం, వ్యక్తిగత రక్షణ బిజినెస్ 4 శాతం మెరుగుపడగా.. ఫుడ్, రిఫ్రెష్‌మెంట్ విభాగం 5 శాతం పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.2% బలపడి రూ. 2,702 వద్ద ముగిసింది.

తాన్లా లాభం రూ.135 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్లౌడ్ కమ్యూనికేషన్స్ కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 34.85 శాతం ఎగసి రూ.135.4 కోట్లు సాధించింది. ఎబిటా రూ.182.2 కోట్లు, ఎబిటా మార్జిన్ 20 శాతంగా ఉంది. టర్నోవర్ 13.9 శాతం అధికమై రూ.916 కోట్లు నమోదు చేసింది. ఈపీఎస్ రూ.7.38 నుంచి రూ.10.07కు చేరింది. క్రితం ముగింపుతో పోలిస్తే తాన్లా షేరు ధర బీఎస్ఈలో గురువారం 0.31 శాతం ఎగసి రూ.1,118.55 వద్ద స్థిరపడింది.

ఆరో రోజూ రికార్డుల పరుగు

- 20 వేల స్థాయి చేరువలో నిఫ్టీ
- 67,500 స్థాయి ఎగువకు సెన్సెక్స్
- బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్
- ఐటీ, కన్జూమర్ షేర్లలో లాభాల స్వీకరణ

ముంబై: బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీల రికార్డుల పరుగు వరుసగా ఆరో రోజూ కొనసాగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రికవరీ, విదేశీ నిధుల వెల్లువ అంశాలు కలిసొచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 23 పాయింట్ల స్వల్ప నష్టంతో 67,074 వద్ద, నిఫ్టీ ఒక పాయింటు నష్టంతో 19,832 వద్ద మొదలయ్యాయి. ప్రథమార్ధంలో ఐటీ, టెక్, కన్జూమర్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణతో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే ద్వితీయార్థంలో ఎఫ్ఎంసీజీ, బ్యాంకులు, ఫార్మా, ఫైనాన్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 522 పాయింట్లు పెరిగి 67,619 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు బలపడి 19,992 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 474 పాయింట్ల లాభంతో 67,572 వద్ద ముగిసింది. నిఫ్టీ మార్కెట్ ముగిసేసరికి 146 పాయింట్లు బలపడి 19,979 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,370 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.193 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.93 స్థాయి వద్ద ముగిసింది. అమెరికా రిటైల్ అమ్మకాలు నిరాశపరచడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

''ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయలేకపోయాయి. భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసంతో విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తడం ఇందుకు ప్రధాన కారణం. బ్యాంకుల క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. ముఖ్యంగా వ్యాపార విభజన తర్వాత అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ షేర్ల విలువల అన్‌లాక్ సూచీల కొత్త రికార్డుల ర్యాలీకి మరింత బలాన్నిచ్చింది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



ఐటీసీ @రూ.6 లక్షల కోట్లు

ఐటీ దిగ్గజం ఐటీసీ షేరు రూ.6 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ కలిగిన కంపెనీగా అవతరించింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. 3% పెరిగి రూ.493.50 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. రూ.492 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ ఒక్కరోజులోనే రూ.17,124 కోట్లు పెరిగి రూ.6.12 లక్షల కోట్లకు చేరింది.

అత్యంత విలువైన రెండో కంపెనీగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

దేశంలోనే అత్యంత విలువైన రెండో కంపెనీగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అవతరించింది. ఇటీవల మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీని ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు షేరు గురువారం బీఎస్ఈలో 0.22% పెరిగి రూ.1,688.50 వద్ద స్థిరపడింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12.72 లక్షల కోట్లుగా నమోదైంది. తద్వారా ఐటీ దిగ్గజం టీసీఎస్(రూ.12.66 లక్షల కోట్లు)ను అధిగమించి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. కాగా మార్కెట్ క్యాప్ విలువ ప్రకారం భారతీయ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17.72 లక్షల కోట్లతో తొలి స్థానంలో కొనసాగుతోంది.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్–23 క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత 'ఎ' జట్టు నేడు జరిగే సెమీ ఫైనల్లో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో తలపడనుంది. యశ్ ధుల్ నాయకత్వంలోని భారత 'ఎ' జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ఈ టోర్నీలో భారత 'ఎ' జట్టు ఆటగాళ్లు యశ్ ధుల్, హర్షిత్ రాణా, సాయి సుదర్శన్, నిశాంత్ సింధు, రాజ్‌వర్ధన్ హంగార్గేకర్, నికిన్ జోస్, మానవ్ సుథర్ తదితరులు ఆకట్టుకున్నారు. మరో సెమీఫైనల్లో శ్రీలంక 'ఎ'తో పాకిస్తాన్ 'ఎ' తలపడుతుంది.

ఓటమితో ముగింపు

ఆసియా క్రీడల సన్నాహాల్లో భాగంగా జర్మనీలో పర్యటించిన భారత మహిళల హాకీ జట్టుకు ఒక్క విజయం కూడా దక్కలేదు. గురువారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత జట్టు 0–2 గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడిపోయింది.

భారత్ 182/4

- రోహిత్, యశస్వి అర్ధ సెంచరీలు
- విండీస్‌తో రెండో టెస్టు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: రెండో టెస్టులోనూ భారత ఓపెనింగ్ జోడీ అదరగొట్టింది. కానీ తొలి సెషన్ వరకే ఈ శుభారంభం పరిమితమైంది. సెషన్ మారగానే వెస్టిండీస్ బౌలింగ్ ప్రతాపం మొదలైంది. 'టాప్' లేపింది. ఇరు జట్లు చెరిసగం ఆధిపత్యాన్ని పంచుకోవడంతో ఈ మ్యాచ్ పోటాపోటీగా మొదలైంది. టాస్ నెగ్గిన వెస్టిండీస్ బౌలింగ్‌కే మొగ్గుచూపగా, యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ఆరంభించారు. ఉదయం సెషన్ అంతా వీళ్లిద్దరు ఆడుతూపాడుతూ పరుగులు సాధించారు. చెత్త బంతుల్ని సిక్సర్లుగా మలిచారు. ఈ క్రమంలో ముందుగా 'హిట్‌మ్యాన్' రోహిత్ 74 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 21వ ఓవర్లోనే జట్టు స్కోరు వందకు చేరింది. కాసేపటికే ధాటిగా ఆడుతున్న జైస్వాల్ కూడా 49 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. 121/0 వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. భోజన విరామం తర్వాత 30 నుంచి 40 ఓవర్ల మధ్యలో... కేవలం 8 ఓవర్ల వ్యవధిలో కీలకమైన టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. ముందుగా యశస్వి జైస్వాల్ (74 బంతుల్లో 57; 9 ఫోర్లు, 1 సిక్స్)కు హోల్డర్ చెక్ పెట్టగా, రోచ్ బౌలింగ్‌లో పేలవమైన షాట్‌కు శుబ్‌మన్ గిల్ (10; 2 ఫోర్లు) నిష్క్రమించాడు. కోహ్లితో కలిసి సెంచరీ దిశగా దూసుకెళ్తున్న రోహిత్ శర్మ (143 బంతుల్లో 80; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను వారికన్ బోల్తా కొట్టించాడు. అనుభవజ్ఞుడైన రహానే (8) క్లీన్‌బౌల్డయ్యాడు. దీంతో 139/0 స్కోరు కాస్తా 182/4గా మారిపోయింది. టీ విరామానికి భారత్ 50.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కోహ్లి (18 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ పేసర్ ముకేశ్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. గాయపడిన శార్దుల్ ఠాకూర్ స్థానంలో అతన్ని తీసుకున్నారు. విండీస్ తరఫున కిర్క్ మెకెంజి కెరీర్ మొదలు పెట్టాడు.





భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 100వ టెస్టు సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు జ్ఞాపికను అందజేసిన వెస్టిండీస్ క్రికెట్ అధ్యక్షుడు డాక్టర్ కిశోర్ షాలో, దిగ్గజం బ్రియాన్ లారా

10 ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా భారత స్టార్ విరాట్ కోహ్లి మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి అంతర్జాతీయ క్రికెట్‌లో 500 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న పదో క్రికెటర్‌గా నిలిచాడు. సచిన్ టెండూల్కర్, ధోని, ద్రవిడ్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ క్రికెటర్‌గా కోహ్లి గుర్తింపు పొందాడు.

సాత్విక్–చిరాగ్ జోడీ ముందుకు...

పోరాడి ఓడిన ప్రణయ్, ప్రియాన్షు



యోసు (కొరియా): కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం సాత్విక్–చిరాగ్ 21–17, 21–15తో ప్రపంచ 16వ ర్యాంక్ జోడీ హి జి టింగ్–జౌ హావో డాంగ్ (చైనా)పై గెలిచింది. 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు తొలి గేమ్‌లో ప్రతిఘటన ఎదురైంది. పలుమార్లు ఆధిక్యం దోబూచులాడింది. 11–12తో వెనుకబడిన దశలో భారత జంట వరుసగా మూడు పాయింట్లు గెలిచి 14–12తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని తొలి గేమ్ దక్కించుకుంది. రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్ ఆరంభంలోనే వరుసగా మూడు పాయింట్లు నెగ్గి శుభారంభం చేసింది. స్కోరు 10–8 వద్ద భారత జోడీ వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 14–8తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 11–21, 14–21తో రెండో సీడ్ బేక్ హా నా–లీ సో హీ (దక్షిణ కొరియా) జంట చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 15–21, 12–21తో ఫెంగ్ యాన్ జె–హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) జంట చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుల కథ ముగిసింది. భారత నంబర్‌వన్ హెచ్ఎస్ ప్రణయ్, ప్రపంచ 32వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. ప్రపంచ పదో ర్యాంకర్ ప్రణయ్ 15–21, 21–19, 18–21తో ప్రపంచ 18వ ర్యాంకర్ లీ చెయుక్ యిక్ (హాంకాంగ్) చేతిలో... ప్రియాన్షు 14–21, 21–18, 17–21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయారు.

పాక్‌దే తొలి టెస్టు

గాలె: శ్రీలంక జట్టుతో రెండు టెస్టుల సిరీస్‌లో పాకిస్తాన్ జట్టు శుభారంభం చేసింది. గురువారం ముగిసిన తొలి టెస్టులో పాకిస్తాన్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఏడాది తర్వాత పాక్ జట్టుకు టెస్టు ఫార్మాట్‌లో తొలి విజయం దక్కింది. 131 పరుగుల లక్ష్యాన్ని అందుకోవడానికి ఓవర్‌నైట్ స్కోరు 48/3తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్... 32.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. బాబర్ ఆజమ్ (28 బంతుల్లో 24; 5 ఫోర్లు), సౌద్ షకీల్ (38 బంతుల్లో 30; 6 ఫోర్లు) వేగంగా ఆడగా... ఓపెనర్ ఇమామ్ ఉల్ హఖ్ (84 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో పాక్‌ను విజయతీరానికి చేర్చాడు. రెండో టెస్టు కొలంబోలో సోమవారం నుంచి జరుగుతుంది.



ఏ ప్రాతిపదికన ఈ మినహాయింపు?

డబ్ల్యూఎఫ్ఐ అడ్‌హక్ కమిటీని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: నేరుగా ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అడ్‌హక్ కమిటీ ఇచ్చిన మినహాయింపు అంశం కోర్టుకెక్కింది. అండర్–20 ప్రపంచ చాంపియన్ అంతిమ్ పంఘాల్, అండర్–23 ఆసియా చాంపియన్ సుజీత్ కల్కల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ సుబ్రమణియమ్ ప్రసాద్ వీరిద్దరికి మినహాయింపు ఇవ్వడానికి గల కారణాలు, ప్రాతిపదిక ఏమిటని రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అడ్‌హక్ కమిటీని ప్రశ్నించారు. డబ్ల్యూఎఫ్ఐ మార్గదర్శకాల ప్రకారం అన్ని వెయిట్ కేటగిరీలకు సెలక్షన్ ట్రయల్స్ తప్పనిసరి అని పిటిషనర్ల తరఫు న్యాయ వాది వినిపించగా, జడ్జి తదుపరి విచారణను నేటికి వాయిదా వేశారు.



బ్రిజ్‌భూషణ్‌కు బెయిల్

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు గురువారం ఢిల్లీ కోర్టు పూర్తిస్థాయి బెయిల్‌ను మంజూరు చేసింది. మైనర్ రెజ్లర్ సహా పలువురు రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్‌పై ఎట్టకేలకు గత నెల 15న పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్ని విచారించిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. మంగళవారం కేవలం మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా తాజాగా పూర్తిస్థాయి బెయిల్ ఇచ్చింది. అయినప్పటికీ కోర్టు అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేదు.

క్వార్టర్ ఫైనల్లో రిత్విక్–అర్జున్ జోడీ

న్యూఢిల్లీ: పోజోబ్లాంకో ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన భాగస్వామి అర్జున్ కదేతో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్–అర్జున్ ద్వయం 6–4, 6–4తో కుజ్మిన్ (ఫ్రాన్స్)–సారియానో బరేరా (కొలంబియా) జంటపై గెలిచింది. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్, అర్జున్ మూడు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.





ఇంగ్లండ్ దూకుడు

- తొలి ఇన్నింగ్స్‌లో 384/4
- జాక్ క్రాలీ మెరుపు సెంచరీ

మాంచెస్టర్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో ఇంగ్లండ్ రెండో రోజు అదరగొట్టింది. ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 384 పరుగులు సాధించింది. ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టు 67 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ జాక్ క్రాలీ (182 బంతుల్లో 189; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆసీస్ బౌలర్ల భరతంపట్టి త్రుటిలో డబుల్ సెంచరీని చేజార్చుకున్నాడు. మొయిన్ అలీ (82 బంతుల్లో 54; 7 ఫోర్లు), జో రూట్ (95 బంతుల్లో 84; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. ప్రస్తుతం హ్యారీ బ్రూక్ (14 బ్యాటింగ్), బెన్ స్టోక్స్ (24 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 299/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 18 పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయి 317 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 5 వికెట్లు... బ్రాడ్ 2 వికెట్లు తీశారు.

భారత జట్టు ర్యాంక్ 99



న్యూఢిల్లీ: ఐదేళ్ల విరామం తర్వాత భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ర్యాంకింగ్స్‌లో 100లోనికి వచ్చింది. క్రితంసారి ర్యాంక్‌లను ప్రకటించినపుడు సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత ఫుట్‌బాల్ జట్టు సరిగ్గా 100వ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల దక్షిణాసియా చాంపియన్‌షిప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడంతో భారత జట్టు ఒక స్థానం మెరుగుపర్చుకొని 99వ ర్యాంక్‌లో నిలిచింది. 1996లో భారత జట్టు అత్యుత్తమంగా 94 ర్యాంక్‌ను దక్కించుకుంది.

క్లుప్తంగా...

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

సమాచార శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: పేదలకు కార్పొరేట్‌ స్థాయి వైద్యం అందించే లక్ష్యంగా జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలకు సీఎం కేసీఆర్‌ శ్రీకారం చుట్టారని సమాచార శాఖ పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలందరికీ మెరుగైన కార్పొరేట్‌ స్థాయి వైద్యం అందించేందుకు వైద్యవిద్యను విస్తతం చేయాలని సీఎం భావించారని సమాచార శాఖ తెలిపింది. ''ఈ తొమ్మిదేళ్లలో 21 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం ఏర్పాటు చేశారు. అదేవిధంగా మరో 13 ప్రైవేటు వైద్య కళాశాలు ఏర్పాటు అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 3,690, ప్రైవేటు కళాశాలల్లో 4,525 మొత్తంగా 8,215 ఎంబీబీఎస్‌, ప్రభుత్వ ప్రైవేటు కలిపి 2,832 పీజీ, 138 సూపర్‌ స్పెషాలిటీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది మరో 8 ప్రభుత్వ కళాశాలలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వచ్చే ఏడాది ఈ కళాశాలలు అందుబాటులోకి వస్తే మరిన్ని సీట్లు పెరుగుతాయి'' అని సమాచార శాఖ వివరించింది. మరోవైపు అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం చేపడుతోందని పేర్కొంది.


మంత్రి కేటీఆర్‌ను కలిసిన 'ఎర్గొనమీ' ప్రతినిధులు



సాక్షి, హైదరాబాద్‌: అమెరికాలోని పలు కంపెనీలకు సాంకేతిక సేవలందిస్తున్న ఎర్గొనమీ సంస్థ సీఈఓ రాజ్‌ దుబ్బాక, వైస్‌ ప్రెసిడెంట్‌ అనిల్‌ కుర్మాన గురువారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ కలిశారు. ఉద్యోగుల పని సామర్థ్యాన్ని పెంచే విధంగా తయారు చేసిన సాంకేతిక సేవలను త్వరలో భారత మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఎర్గొనమీ సంస్థ సర్వీసు బ్రోచర్‌ను కేటీఆర్‌ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుతం భారత్‌లో సాంకేతిక సేవల ట్రయల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, రానున్న రెండు నెలల్లో పూర్తిస్థాయి సేవలను ప్రవేశపెడతామని ఈ సందర్భంగా ఎర్గొనమీ ప్రతినిధులు తెలిపారు.

గోరుముద్దలు తింటున్నప్పుడే ఆకాశంలో చందమామను అందుకోవాలన్న ఆరాటం మనిషిది. అలా అందుకోవాలంటే దగ్గరవ్వాలి. అందుకే అంతరిక్ష ప్రయోగాలు, స్పేస్‌ షిప్పులతో ప్రయాణాలు. అలాగాకుండా భూమ్మీద నుంచే చూస్తే.. చందమామ ఎవరికి దగ్గరో తెలుసా? ఏయే దేశాల వారికి దగ్గరగా ఉంటాడో తెలుసా? అసలు అంతరిక్షానికి భూమ్మీద దగ్గరి ప్రాంతమేంటో ఐడియా ఉందా? చందమామపైకి ఇస్రో తాజా ప్రయోగం నేపథ్యంలో ఈ వింతైన విశేషాలు తెలుసుకుందామా..

- సాక్షి సెంట్రల్‌ డెస్క్‌



చందమామకు ఎవరు దగ్గర?

మీకు తెలుసా?

- ఎవరెస్ట్‌ భూమ్మీద ఎత్తయినదే అయినా చంద్రుడికి దూరమే
- భూమి ఆకృతే దీనికి కారణమంటున్న శాస్త్రవేత్తలు
- ఈక్వెడార్‌లోని 'మౌంట్‌ చింబొరాజో'నే స్పేస్‌కు దగ్గర
- భూమ్మీద ఎత్తయిన పర్వత శిఖరం హవాయ్‌లోని 'మౌనాకీ'

ఎవరెస్ట్‌ ఎత్తయినదే.. అయినా..

భూమ్మీద ఏ ప్రాంతం చంద్రుడికి దగ్గరగా ఉంటుందనే ప్రశ్నకు.. ఎవరెస్ట్‌ శిఖరమే అయి ఉంటుందని చాలా మంది అంచనా వేస్తుంటారు. ఎందుకంటే భూమిపై ఎత్తయిన ప్రాంతం అదేకదా అంటారు. కానీ ఇది కొంత వరకే నిజం.. హిమాలయ పర్వతాలు, ఎవరెస్ట్‌ శిఖరం భూమి ఉపరితలంపైన మాత్రమే ఎత్తయినవి. భూమి మధ్యభాగం నుంచి చూస్తే.. ఎవరెస్ట్‌ కన్నా ఎత్తయిన ప్రాంతాలూ ఉన్నాయి మరి. అవే చందమామకు, స్పేస్‌కు దగ్గరగా ఉంటాయి.

భూమి ఆకృతి ఎఫెక్ట్‌

మన భూమి అచ్చంగా గోళాకారంలో ఉండదు. ధ్రువ ప్రాంతాల వద్ద కాస్త నొక్కినట్టుగా, భూమధ్య రేఖ ప్రాంతంలో ఉబ్బెత్తుగా.. కాస్త దీర్ఘవృత్తాకారంలో ఉంటుంది. భూమి భ్రమణ వేగం, సూర్యుడి గురుత్వాకర్షణ వంటివే దీనికి కారణం. ఈ కారణం వల్లే భూమి మధ్యభాగం నుంచి చూస్తే.. ధ్రువ ప్రాంతాలు దగ్గరగా, భూమధ్యరేఖ ప్రాంతాలు దూరంగా ఉంటాయి. దీనికితోడు భూమిపైపొరల్లోని హెచ్చుతగ్గులు కూడా భూమధ్య రేఖ ప్రాంతంలో ఎక్కువ.



చంద్రుడికి దగ్గరున్నది 'మౌంట్‌ చింబొరాజో'


స్పేస్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతం ఏదన్న దానిపై అమెరికాకు చెందిన జోసెఫ్‌ సెన్నె అనే ఇంజనీర్‌, న్యూయార్క్‌లోని హెడెన్‌ ప్లానెటోరియం డైరెక్టర్‌ నీల్‌ డెగ్రాస్‌ టైసన్‌ కలసి అధ్యయనం చేశారు. లోతుగా పరిశీలన చేసిన తర్వాత ఆండీస్‌ పర్వత శ్రేణుల్లో ఈక్వెడార్‌ దేశం పరిధిలోకి వచ్చే 'మౌంట్‌ చింబొరాజో' శిఖరం చంద్రుడికి దగ్గర అని తేల్చారు.

దక్షిణ అమెరికా ఖండంలో సుమారు ఏడు దేశాల్లో ఆండీస్‌ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. అందులో భూమధ్యరేఖకు కాస్త దిగువన ఉన్న ఈక్వెడార్‌ పరిధిలో 'మౌంట్‌ చింబొరాజో' శిఖరం ఉంది.

ఎవరెస్ట్‌ ఎత్తు సముద్ర మట్టం నుంచి 8,848 మీటర్లు. అదే చింబొరాజో శిఖరం ఎత్తు 6,268 మీటర్లు మాత్రమే. కానీ ఎవరెస్ట్‌తో పోలిస్తే.. చింబొరాజో చంద్రుడికి 2.4 కిలోమీటర్లు సమీపంలో ఉన్నట్టేనని నిపుణులు లెక్క తేల్చారు.

ఈ దేశాలు కూడా స్పేస్‌కు దగ్గర

చిన్న ప్రాంతాల వారీగా కాకుండా దేశాల వారీగా చూస్తే.. ఈక్వెడార్‌, కెన్యా, టాంజానియా, ఇండోనేసియా వంటివి భూమ్మీద మిగతా దేశాల కన్నా చంద్రుడికి, స్పేస్‌కు దగ్గరగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సరిగ్గా భూమి మధ్య నుంచి చూస్తే.. భూమధ్యరేఖకు కాస్త దిగువన ఉన్న ప్రాంతం ఉబ్బెత్తుగా ఉంటుందని, ఈ దేశాలన్నీ ఆ ప్రాంతంలోనే ఉన్నాయని వివరిస్తున్నారు. భూమి ఉత్తర, దక్షిణ ధ్రువ ప్రాంతాలతో పోలిస్తే.. ఈ దేశాల్లోని జనం చంద్రుడికి సుమారు 21 కిలోమీటర్లు (13 మైళ్లు) దగ్గరగా ఉన్నట్టేనని పేర్కొంటున్నారు.



ఎవరెస్ట్‌ కంటే 'మౌనాకీ' ఎత్తు ఎక్కువ!

- భూమిపై సముద్ర మట్టం కంటే పైన భాగాల్లో అత్యంత ఎత్తయినది 'ఎవరెస్ట్‌' శిఖరమే అన్నది సుస్పష్టం. కానీ సముద్రాలు, భూభాగాలు అన్నింటినీ కలిపి చూస్తే.. భూమ్మీద అతి ఎత్తయిన శిఖరం అమెరికాలోని హవాయ్‌ దీవుల్లో భాగమైన 'మౌనాకీ' అగ్నిపర్వత శిఖరమే.
- సముద్ర మట్టంపైన మౌనాకీ ఎత్తు 4,205 మీటర్లే. కానీ సముద్రం లోపల మరో 6,000 మీటర్ల లోతు వరకు ఉంటుంది. అంటే సముద్ర గర్భం నుంచీ చూస్తే.. మౌనాకీ మొత్తం ఎత్తు 10,205 మీటర్లపైనే. అంటే ఎవరెస్ట్‌ కన్నా సుమారు 1,350 మీటర్లు ఎత్తు ఎక్కువ.

ఇక అన్ని ప్రయాణాలకూ ఒకే కార్డు

త్వరలో కామన్‌ మొబిలిటీ కార్డు ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రులు కేటీఆర్‌, పువ్వాడ, శ్రీనివాస్‌గౌడ్‌
- ఆర్టీసీ బస్సులు, మెట్రో రైల్‌, ఎంఎంటీఎస్‌, క్యాబ్‌లు, ఆటోల్లో వాడుకునే సౌలభ్యం
- తొలుత హైదరాబాద్‌లో మెట్రోరైల్‌, ఆర్టీసీ సేవల కోసం కార్డుల జారీ
- ఆగస్టు రెండో వారం నాటికి కార్డులు అందుబాటులోకి

సాక్షి, హైదరాబాద్‌: ప్రయాణికులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించడానికి వీలుగా ఒకే కార్డును తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు రెండో వారంలోగా 'కామన్‌ మొబిలిటీ కార్డు'లను సిద్ధం చేయాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులతో సమీక్షించిన మంత్రులు... తొలుత హైదరాబాద్‌లోని ప్రజారవాణా వ్యవస్థ మొత్తానికి కలిపి వినియోగించేలా ఈ కార్డును అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. మొదట మెట్రోరైల్‌, ఆర్టీసీ బస్సులో ప్రయాణానికి వీలుగా ఈ కార్డులను జారీ చేస్తామని, సమీప భవిష్యత్తులో ఇదే కార్డుతో ఎంఎంటీఎస్‌, క్యాబ్‌ సేవలు, ఆటోలను కూడా వినియోగించుకొనేలా విస్తరిస్తామని మంత్రులు తెలిపారు. పౌరులు వారి ఇతర కార్డుల మాదిరే దీన్ని కొనుగోళ్లకు కూడా వినియోగించేలా వన్‌ కార్డ్‌ ఫర్‌ ఆల్‌ నీడ్స్‌ మాదిరి కామన్‌ మొబిలిటీ కార్డు ఉండాలని మంత్రులు అధికారులకు సూచించారు. ఈ కార్డుగల ప్రయాణికులు దేశవ్యాప్తంగా నేషనల్‌ కామన్‌ మొబిలిటీ కార్డు వినియోగించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోటా వినియోగించుకొనేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. మరోవైపు కామన్‌ మొబిలిటీ కార్డుకు ఒక పేరును సూచించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌ కుమార్‌ పౌరుల నుంచి పేర్లను కోరుతూ ట్వీట్‌ చేశారు. ఈ సమావేశంలో అరవింద్‌ కుమార్‌, మెట్రోరైల్‌ ఎండీ ఎన్వీఎస్‌ రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఇక కను'మరుగు'

కదిలిన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా అధికార యంత్రాంగం



కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణంపై మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సాక్షి ఎఫెక్ట్‌

కాటారం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నెలకొన్న మరుగుదొడ్ల సమస్య తీరనుంది. ఈ సమస్యపై జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఐటీఐ కళాశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థినులు పడుతున్న అవస్థలపై ఈ నెల 15న 'ఆత్మగౌరవం కను'మరుగు'' శీర్షికన సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థ నాయకులు స్పందిస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి అంచనా వేసి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్‌ భవేశ్‌మిశ్రా గురువారం పంచాయతీరాజ్‌ అధికారులను ఆదేశించారు. దీంతో కాటారం పీఆర్‌ ఏఈఈ అశోక్‌ ఐటీఐలో మరుగుదొడ్ల నిర్మాణ వ్యయంపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కూడా ఐటీఐలో మరుగుదొడ్ల నిర్మాణంపై ఆరాతీశారు. పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గురువారం కళాశాలను సందర్శించారు. కళాశాలలో మరుగుదొడ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి సహకారం అందించిన 'సాక్షి'కి కళాశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

బోడ కాకరకాయ కిలో రూ.400



మంచిర్యాల టౌన్‌: టమాటా, పచ్చిమిర్చికి బోడ కాకరకాయ తోడయ్యింది. మంచిర్యాల మార్కెట్‌లో గురువారం కిలో రూ.350 నుంచి రూ.400 పలికింది. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి మార్కెట్‌కు బోడ కాకరకాయను తీసుకొచ్చి అమ్ముతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.